సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 348

శుక్రవారం 10-3-2023



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



లాభాలకు బ్రేక్

సెన్సెక్స్ 542 డౌన్... 60,000 స్థాయి దిగువన ముగింపు...

-13లో



క్వీన్స్ ఎక్స్‌ప్రెస్

మహిళలతోనే నడిచిన ముంబై-పుణె దక్కన్ క్వీన్ ఎక్స్‌ప్రెస్.

-11లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



Latest 13th Gen Intel® Core™ Processors[1]

3K Dynamic AMOLED 120Hz display

Galaxy Ecosystem

Buy now at ₹ 2875/month*

Retail price (Galaxy Book3 360)	₹ 114990~
Exchange value of old device	₹ 40000^
Upgrade bonus	₹ 6000#
Effective price	₹ 68990'
No cost EMI (24 months)	₹ 2875*

Galaxy Buds2 at ₹ 1999** Worth ₹ 11999

+

Samsung Upgrade Up to ₹ 6000 bonus#

or

₹ 8000 bank cashback[2]

HDFC BANK

Scan to buy now

Or WhatsApp "GB3" to 9870-494949


Special offer for Corporate Customers, login with your work email: samsung.com/in/corporateplus

Available at: Samsung Exclusive Store | amazon specials | croma | ELECTRONICS MART | Reliance digital | vijay sales www.vijaysales.com

Re+ Please dispose e-waste and plastic waste responsibly. For more information or for e-waste pick up, please call 1800 40 7267864 or 1800 5 7267864.

T&C apply. Image simulated for representational purposes only. Color availability may vary due to product enhancement. Product features may vary basis model. S Pen is available with Galaxy Book3 Pro 360 and Galaxy Book3 360. Offers may be revised or withdrawn without prior notice. [1]Intel, the Intel logo, and Intel Evo are trademarks of Intel Corporation or its subsidiaries. *EMI amount computed on 0 down payment 24 months no cost EMI available with HDFC paper finance on the price of ₹ 68990 for 1 Unit of Galaxy Book3 360 39.6cm/i5/16GB/512GB model (Financier T&C's apply). EMI provided by Bank/NBFCs at their sole discretion and may vary by model. ~Retail price shown for 1 unit of Galaxy Book3 360, 39.6cm/i5/16GB/512GB Model inclusive of taxes. ^Approximate value on exchange of 1 unit of Galaxy S22 Ultra 12GB | 256GB. Exchange value varies basis model & condition of old device. Exchange at the discretion of retailer. Exchange offer applicable on exchange of smartphones only. #Upgrade Bonus provided by brand upon exchange of select smartphones only at its sole discretion. 'Effective Price shown for 1 unit of Galaxy Book3 360, 39.6cm/i5/16GB/512GB Model inclusive of exchange value of old device & upgrade bonus. **Galaxy Buds2 (1 unit) worth ₹ 11999, offer applicable on i5/512 GB variant for Galaxy Book3 Pro 360, Galaxy Book3 Pro, Galaxy Book3 360 models. *Offer applicable on either Samsung upgrade or HDFC Bank cashback. Bank cashback and Samsung Upgrade offers cannot be clubbed. [2]Cashback at sole discretion of HDFC Bank. Final price and offers subject to dealer discretion. All third-party logo/brands are the registered trademarks of the respective brand/company.

Cheil-14817/23


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 348

శుక్రవారం 10-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాకిస్తాన్‌తో సమరమే!

మోదీ హయాంలో పాక్‌పై సైనిక చర్యకు దిగే అవకాశముందని అమెరికా నిఘా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


వివరాలు 6లో ▶



గవర్నర్లకు నోరు తప్ప చెవుల్లేవు

వారికి నోరు తప్ప చెవులు లేవని అనిపిస్తోందని గవర్నర్ల వ్యవహార శైలిపై తమిళనాడు సీఎం స్టాలిన్ మండిపడ్డారు.

వివరాలు 6లో ▶



డిమెన్షియా.. డేంజర్ బెల్స్

2050నాటికి భారత్‌లో డిమెన్షియా కేసులు పెరుగుతాయన్న ఎయిమ్స్ పరిశోధన ఆందోళన కలిగిస్తోంది.

వివరాలు 6లో ▶



అహ్మదాబాద్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య గురువారం ప్రారంభమైన నాలుగో టెస్టు తొలి రోజు ఆటకు ఇరు దేశాల ప్రధానమంత్రులు హాజరయ్యారు. మైదానంలో ప్రత్యేక వాహనంలో కలియతిరిగిన అనంతరం ప్రెసిడెంట్స్ బాక్స్‌నుంచి నరేంద్ర మోదీ, ఆంథోని అల్బనీస్ మ్యాచ్‌ను వీక్షించారు.

న్యూస్‌రీల్

రేపు హైదరాబాద్‌కు అమిత్ షా



కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా శనివారం సాయంత్రం హైదరాబాద్ రానున్నారు. శనివారం రాత్రి బీజేపీ రాష్ట్ర మినీ కోర్‌కమిటీతో షా భేటీ అయ్యే అవకాశం ఉంది. ఆదివారం సీఐఎస్ఎఫ్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో కేంద్ర హోంమంత్రి పాల్గొంటారు.

- వివరాలు 3లో▶

ఎంత పెద్దవారున్నా వదలొద్దు: భట్టి



ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎంత పెద్దవారు ఉన్నా వదలొద్దని, ఎమ్మెల్సీ కవితకు ఇచ్చిన ఈడీ నోటీసులు తెలంగాణ ప్రజలకు అవమానమని ఎవరైనా మాట్లాడితే తెలంగాణ సమాజం వారిని ప్రశ్నించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ చూస్తోందని ఆయన ఆరోపించారు.

- వివరాలు 3లో▶

'లిక్కర్'పై టక్కర్!

రాష్ట్రాన్ని కుదిపేస్తున్న ఢిల్లీ మద్యం కుంభకోణం

- కవితకు ఈడీ నోటీసులతో రాజకీయ వేడి.. ఆరోపణలు, ప్రత్యారోపణలు.. తీవ్ర విమర్శలు
- విపక్ష నేతలు లక్ష్యంగా మోదీ ప్రభుత్వం దాడులు చేయిస్తోందన్న బీఆర్ఎస్
- దీటుగా బీజేపీ నేతల కౌంటర్
- రాష్ట్ర కేబినెట్‌లో కవితకు నోటీసులపై చర్చ!
- నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి భేటీ
- శుక్రవారం ఢిల్లీలో కవిత దీక్ష.. పోటీగా రాష్ట్రంలో బీజేపీ దీక్ష

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణంలో వంద కోట్ల ముడుపుల వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న.. బీఆర్ఎస్, బీజేపీల మధ్య వైరం పతాకస్థాయికి చేరింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లిక్కర్ స్కామ్‌లో నోటీసులు జారీ చేయడంతో రాజకీయంగా దుమారం రేగుతోంది. పరస్పర ఆరోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో వాతావరణం ఎన్నికలకు ముందే వేడెక్కుతోంది. గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్.. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విపక్ష నేతలపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారంటూ ధ్వజమెత్తారు. భారత్

మిగతా 2వ పేజీలో ▶



భయపడాల్సింది ఏమీ లేదు!

- కేంద్రం మరింత కక్ష సాధింపు చర్యలకు దిగుతుంది
- ధైర్యంగా ఎదుర్కొందాం..
- కవితకు ఈడీ నోటీసులపై కేబినెట్ భేటీలో కేసీఆర్
- పెండింగ్ బిల్లులపై సుప్రీంకు వెళ్లేందుకు మంత్రివర్గం సమర్థన

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ఏడాదిలో కేంద్రం మరింత కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని, వాటిని ధైర్యంగా ఎదుర్కొందామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గానికి సూచించారు. ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు ముందుగా ఊహించినవేనని అన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్రం కక్ష సాధింపు

మిగతా 2వ పేజీలో ▶

ఈడీ సమన్లు కావు.. మోదీ సమన్లు

కవితకు నోటీసులపై మంత్రి కేటీఆర్ ఫైర్



- మోదీ చేతిలో కీలుబొమ్మ, తోలుబొమ్మలుగా ఈడీ, సీబీఐ
- దేశంలోని విపక్ష నేతలపైకి వాటిని ఉసిగొల్పుతున్నారు

-2లో▶

యతో ధర్మః.. తతో జయః

ఢిల్లీలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



- దేవుడు, సత్యం, న్యాయం మావైపే.. ఎవరికీ భయపడేది లేదు
- దేవుడి కంటే బలవంతులమని భావించే వారికి ప్రకృతే సమాధానం చెబుతుంది

-2లో▶

4 లక్షల మందికి గృహలక్ష్మి!

సొంత జాగాలో ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం



- ఒక్కో నియోజకవర్గంలో 3 వేల మందికి ఇవ్వాలని సర్కారు నిర్ణయం
- రూ.4 వేల కోట్ల పేదల హౌసింగ్ రుణాలు మాఫీ
- రెండో దఫాలో లక్షా 30 వేల కుటుంబాలకు దళితబంధు.. 1.55 లక్షల మందికి 4 లక్షల ఎకరాల పోడు పట్టాలు
- ఏప్రిల్ 14న హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ.. అనంతరం సభ
- ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు జీవో 58, 59 కింద మళ్లీ దరఖాస్తులు
- కటాఫ్ తేదీ 2014 నుంచి 2020 ఏడాదికి మార్పు
- సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు
- సమావేశం అనంతరం వివరాలు వెల్లడించిన మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: సొంత జాగా ఉన్న పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించే పథకానికి రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పథకానికి 'గృహలక్ష్మి'గా నామకరణం చేయడంతోపాటు మొత్తం 4 లక్షల మందికి ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఒక్కో నియోజకవర్గంలో 3వేల మందికి చొప్పున 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3,57,000 మందికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని, రాష్ట్ర ప్రభుత్వ కోటాలో మరో 43వేల ఇళ్లు కేటాయిస్తామని పేర్కొంది. దీనికోసం ఈ ఏడాది రూ.12వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన సుదీర్ఘంగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనితోపాటు

మిగతా 3వ పేజీలో ▶

కుటుంబ పాలనే బీఆర్ఎస్ మోడల్!

- 'కరీంనగర్ కవాతు' బహిరంగ సభలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్
- తెలంగాణలో ఛత్తీస్‌గఢ్ మోడల్ అమలు చేస్తాం: రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ నిజాంను తలపిస్తున్నారు: జైరాం రమేశ్
- కాంగ్రెస్‌తోనే బడుగుల అభ్యున్నతి: మాణిక్‌రావ్ ఠాక్రే

5లో

డిగ్రీలో సమూల మార్పులు

- ఇష్టం వచ్చిన సబ్జెక్ట్‌ల ఎంపికకు విద్యార్థికి చాన్స్ అవకాశం.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు..
- కాలేజీలకు ముందే అనుబంధ గుర్తింపు
- ఉన్నత విద్యామండలి భేటీలో నిర్ణయాలు

-14లో▶

అన్నాచెల్లెలు చెప్పేవన్నీ అబద్ధాలే

కేటీఆర్, కవితలపై కిషన్‌రెడ్డి ధ్వజం

- తెలంగాణ ప్రజలు కవితను ఢిల్లీకి వెళ్లి లిక్కర్ స్కామ్ చేయమన్నారా?
- సీఎం కూతురు వల్ల తెలంగాణ పరువు పోయింది

-3లో▶



కవిత దీక్షకు పోటీగా బీజేపీ నిరసన

నేడు 'మహిళా గోస–బీజేపీ భరోసా'దీక్ష

సాక్షి, హైదరాబాద్: బీజేపీ పోటీ దీక్షలకు సిద్ధమైంది. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలంటూ బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో చేపడుతున్న దీక్షకు పోటీగా బీజేపీ నిరసనలు నిర్వహించనుంది. శుక్రవారం పార్టీ కార్యాలయంలో 'మహిళా గోస–బీజేపీ భరోసా'పేరిట మహిళా నేతలతో ఒకరోజు దీక్ష నిర్వహించాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. గురువారం బీజేపీ ఆఫీసులో గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన మహిళా మోర్చా నేతలతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, చింతల రామచంద్రారెడ్డి, భండారి శాంతికుమార్, కొల్లి మాధవి నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీక్షలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతితోపాటు మహిళా మోర్చా నాయకులు పాల్గొననున్నారు.

లిక్కర్ స్కాంను కప్పిపుచ్చుకొనేందుకే..

ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవిత.. దాన్ని కప్పిపుచ్చుకొనేందుకు ఢిల్లీలో మహిళా దీక్ష పేరుతో నిరసన చేపడుతున్నారని, ఈ విషయాన్ని ఎండగడతామని బీజేపీ మహిళా నేతలు చెబుతున్నారు. బీఆర్ఎస్, కవిత మహిళా బిల్లు పేరుతో తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తున్నారనే విషయాన్ని దేశ ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ దీక్ష నిర్వహిస్తున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆరోపించారు.

బీఆర్ఎస్‌లో మహిళా కోటా కోసం పోరాడండి: బండి

బీజేపీ మహిళా మోర్చా నేతలతో భేటీలో బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ మహిళలకు కవిత క్షమాపణ చెప్పేదాకా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రంలో మహిళలకు చేస్తున్న అన్యాయాలు, మోసాలను ఎండగట్టడమే ఈ దీక్ష లక్ష్యమన్నారు. కవిత దీక్ష వెనుక ఉన్న కుట్రలను, మోసాలను యావత్ దేశానికి తెలియజేయాలని సూచించారు. మహిళా బిల్లు గురించి మాట్లాడుతున్న కేసీఆర్ కుటుంబం తొలుత బీఆర్ఎస్‌లో 33 శాతం మంది మహిళలకు సంస్థాగత పదవులు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ టికెట్లు ఇచ్చేదాకా పోరాడాలని పిలుపునిచ్చారు. కవితకు మహిళలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే మహిళలను మోసగిస్తున్న తన తండ్రి, సీఎం కేసీఆర్ ఇంటిముందు దీక్ష చేయాలన్నారు. దొంగ సారా దందాతో కోట్లు దండుకోవాలనుకున్న కవితకు ఈడీ నోటీసులివ్వగానే కేసీఆర్ కుటుంబానికి మహిళా బిల్లు, దీక్షలు గుర్తొచ్చాయని దుయ్యబట్టారు.

బీజేపీలోకి సిరిసిల్ల బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు గురువారం బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ నేత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, సెస్ మాజీ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్, మిరుదొడ్డి దేవేందర్ (ముస్తాబాద్) సహా పలువురు నియోజకవర్గ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి కేటీఆర్‌కు చక్రధర్‌రెడ్డి అనుయాయుడిగా చాలా దగ్గరగా ఉండేవారని సంజయ్ పేర్కొన్నారు. బీజేపీలో చేరిన బీఆర్ఎస్ సిరిసిల్ల నాయకులంతా కూడా టీఆర్ఎస్ ఏర్పడిన నాటి నుంచి, కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి అనుచరులుగా ఉన్నారని బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ నేతలు వివేక్ వెంకటస్వామి, రాణిరుద్రమ తదితరులు మాట్లాడుతూ, గతంలో కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను విచారణ సంస్థలు దర్యాప్తు చేసినా మాట్లాడని కేటీఆర్ తన చెల్లెలు కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో విచారణను ఎదుర్కోవడంతో ఎదురుదాడికి దిగారన్నారు. సిరిసిల్లలో తన పీఠాలు కదిలిపోతున్నాయనే ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. లిక్కర్ స్కాంలో కవితకు భాగస్వామ్యం ఉందా లేదా చెప్పాలని, ఆ తర్వాతే సీబీఐ, ఈడీల గురించి కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు మాట్లాడాలన్నారు.

ఈడీ సమన్లు కావు.. మోదీ సమన్లు

కవితకు నోటీసులపై మంత్రి కేటీఆర్ ఫైర్

- మోదీ చేతిలో కీలుబొమ్మ, తోలుబొమ్మలుగా ఈడీ, సీబీఐ
- దేశంలోని విపక్ష నేతలపైకి వాటిని ఉసిగొలుపుతున్నారు
- ఈడీ దాడులు 95 శాతం విపక్షాల పైనే..
- టార్గెట్ కేసీఆర్‌లో భాగంగానే కవితకు వేధింపులు



మీడియా సమావేశంలో ఫోన్లో క్లిపింగ్‌లు చూపిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో విపక్ష నేతలను వేధించడమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలన సాగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కె.తారక రామారావు ధ్వజమెత్తారు. 'అయితే జుమ్లా... లేదంటే హమ్లా'అనే రీతిలో మోదీ ప్రభుత్వం ఉందని, అందులో భాగంగానే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇచ్చిందని అన్నారు. అవి 'ఈడీ సమన్లు కాదు.. మోదీ సమన్లు'అని పేర్కొన్నారు. మోదీ సర్కార్ చేతిలో 'ఈడీ కీలుబొమ్మ, సీబీఐ తోలుబొమ్మ'గా మారాయని విమర్శించారు. రాజకీయ వేధింపులను రాజకీయంగానే ఎదుర్కొంటామని, కవిత ఈడీ ముందు హాజరై పూర్తిస్థాయిలో సహకరిస్తారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్ వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే....

ఒక్క బీజేపీ నేతపై అయినా దాడులు జరిగాయా?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రతిపక్ష పార్టీలపైకి ఉసిగొల్పుతోంది. కవితే మొదటి వ్యక్తి కాదు. చివరి వ్యక్తీ కాదు. ఇంకా చాలా మంది ఉంటారు. మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పీఏ, జగదీశ్ రెడ్డి పీఏల మీద ఐటీ, ఈడీ అధికారులతో దాడులు చేయించారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మీద ఐటీ దాడులు జరిగాయి. పార్టీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర,, పార్థసారథి రెడ్డి, మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి మొదలైన 12 మంది మీద ఈడీ, సీబీఐ, ఐటీలతో కేంద్ర ప్రభుత్వం దాడులు చేయించింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ కవితకు ఈడీ సమన్లు పంపింది. మోదీ పాలనలో ఈడీ దాడులు 95 శాతం విపక్షాల మీదనే జరుగుతున్నాయి. ఒక్క బీజేపీ నేత మీద అయినా ఈ తరహా దర్యాప్తు సంస్థల దాడులు జరిగిన చరిత్ర లేదు. ఈ తొమ్మిదేళ్లలో ప్రతిపక్షాల మీద ఈడీ నమోదు చేసిన కేసుల సంఖ్య 5,422. అందులో కేవలం 23 కేసుల్లో మాత్రమే తీర్పు వచ్చింది.

అదానీ కంపెనీ మోదీ సొంత కంపెనీ...

ప్రతిపక్షాలపై కేసుల దాడి.. ప్రజలపై ధరల దాడి.. ఇవి తప్ప ఈ తొమ్మిదేళ్లలో మోదీ సర్కార్ సాధించిందేమీ లేదు. గౌతమ్ అదానీ అనే వ్యక్తి మోదీ బినామీ అని చిన్న పిల్లగాడిని అడిగినా చెబుతాడు. ఒక సంస్థకు రెండు ఎయిర్‌పోర్టులకంటే ఎక్కువ కాంట్రాక్టులు కట్టబెట్టొద్దని ఇప్పటిదాకా ఉన్న నిబంధనలను తుంగలో తొక్కి.. గౌతమ్ అదానికి ఆరు ఎయిర్‌పోర్టులు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసం? సాక్షాత్తూ నీతి ఆయోగ్ దీన్ని తప్పు బట్టింది. దేశాన్ని కుదుపు కుదిపేసిన హిండెన్‌బర్గ్ నివేదిక మీద మోదీకి మాట రాదు. రూ.13 లక్షల కోట్ల ఎల్ఐసీ, ఎస్‌బీఐ వంటి ప్రజా సంస్థల డబ్బులు ఆవిరైనా.. ఈ దేశ ప్రధానమంత్రి ఉలకడు పలకడు. గౌతం అదానీకి చెందిన ముంద్రా పోర్టులో దాదాపు రూ.21 వేల కోట్ల విలువైన 3 వేల కిలోల హెరాయిన్ పట్టుబడితే ఒక్క కేసు నమోదు కాదు. ఇటీవల జరిగిన జీ20 సదస్సులో పాల్గొనడానికి వచ్చిన శ్రీలంక ఆర్థిక మంత్రి.. అదానీకి, శ్రీలంకకు మధ్య జరిగిన ఆరువేల కోట్ల ఒప్పందాన్ని జీ టు జీ ఒప్పందంగా పేర్కొన్నాడు. జీ టూ జీ అంటే గవర్నమెంట్ టు గవర్నమెంట్ కాదు గౌతమ్ అదాని టు గొటబయ అని అర్థం. అదాని కంపెనీ మోదీ సొంత కంపెనీ కాబట్టి ప్రపంచ వ్యాప్తంగా అదానీ కోసం ప్రధాని హోదాలో మార్కెటింగ్ చేస్తున్నారు.

బీజేపీ వ్యవహారం 'వాషింగ్ పౌడర్ నిర్మా'యే..'

సీఎం కేసీఆర్ చెప్పినట్టు వాషింగ్ పౌడర్ నిర్మా.. అన్నట్లుగా ఉంది బీజేపీ వ్యవహారం. అంటే బీజేపీలో చేరగానే వారి పాపాలు, వారి మీద ఉన్న కేసులు వెంటనే పోతాయి. సుజనాచౌదరికి చెందిన షెల్ కంపెనీల ద్వారా లగ్జరీ కార్లు కొనుగోలు చేశారని, వేల కోట్ల బ్యాంకు ఫ్రాడ్ జరిగిందని ఈడీ తన అధికారిక ట్విట్టర్ ఖాతా ద్వారా తెలిపింది. కానీ సుజనాచౌదరి బీజేపీలో చేరడంతో ఆ కేసులు నీరుగారాయి. ఏపీలో బ్యాంకులకు వందల కోట్లు కుచ్చుటోపీ పెట్టిన సుజనాచౌదరి, సీఎం రమేశ్‌లు మీ పార్టీలో చేరగానే పునీతులు అయ్యారా ? ఇటీవల కర్ణాటకలో బీజేపీ ఎమ్మెల్యే విరూపాక్ష కొడుకు రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. అయినా ఎలాంటి దాడులు ఉండవు. మహారాష్ట్రకు చెందిన ఎంపీ పాటిల్ అనే వ్యక్తి.. 'బీజేపీలో చేరినందున నా మీదకు ఈడీ రాదు'అని చెప్పారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన తర్వాత ఈడీ నుంచి ఉపశమనం పొందానని హర్షవర్ధన్ అనే ఎంపీ చెప్పాడు. పశ్చిమబెంగాల్‌లో వేల కోట్ల కుంభకోణంలో ఇరుక్కున్న తృణమూల్ నేత సువేందు అధికారిని విచారణల పేరుతో భయపెట్టి బీజేపీలో చేర్చుకున్న తర్వాత ఆ కేసు ముందుకు సాగకపోవడం నిజం కాదా? శారదా కుంభకోణం ప్రధాన నిందితుడు హిమంత బిస్వాశర్మ బీజేపీలో చేరిన తరువాత ఈడీ, సీబీఐ అతనిపై దర్యాప్తును ఎందుకు నిలిపివేశాయి? బీబీసీ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థల మీద దాడులు చేయడం ద్వారా తమకు అనుకూలంగా లేకపోతే మీడియా సంస్థలపై సైతం ఎలాంటి చర్యలకైనా సిద్ధం అని ఒక పెద్ద వార్నింగ్ ఇచ్చారు.

డబుల్ ఇంజన్ అంటే.. ఒకటి మోదీ, మరొకటి అదాని

డబుల్ ఇంజన్ డబుల్ ఇంజన్ అంటున్న బీజేపీ ప్రభుత్వం అసలు రూపం దేశ ప్రజలకు ఇప్పుడు అర్థం అయింది. ఒక ఇంజన్ మోదీ అయితే మరో ఇంజన్ అదానీ. ఆ డబుల్ ఇంజన్ పేరు 'మాదాని.. అంటే మోదీ, అదానీ అన్న మాట. మోదీ– అదానీ చీకటి స్నేహం వెనుక దాగి ఉన్న ఆంతర్యం ప్రజలందరికీ తెలుసు.

తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చింది నిజం కాదా?

మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దొడ్డిదారిన తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చింది నిజం కాదా? ఆయా రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కాంట్రాక్టులు, పదవుల పేరుతో లొంగదీసుకున్నది అబద్ధమని చెప్పగలరా? మన తెలంగాణలో మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు కట్టబెట్టి కాంగ్రెస్ అభ్యర్థిని బీజేపీలోకి లాక్కున్నది వాస్తవం కాదా? మద్యమే లేని గుజరాత్ రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి 42 మంది చనిపోతే ఏ విచారణ చేశారు? అది స్కాం కాదా? ఢిల్లీ లిక్కర్ పాలసీని తప్పు బడుతున్న వారు.. గుజరాత్‌లో జరిగిన ఘటనపై ఏ చర్యలు తీసుకున్నారు?

ఈడీ, బోడీలకు భయపడేదే లేదు..

టార్గెట్ కేసీఆర్‌లో భాగంగానే.. ఉద్యమనేత బిడ్డగా పుట్టుకనుండే చైతన్యాన్ని పుణికి పుచ్చుకున్న ఉద్యమకారిణి ఎమ్మెల్సీ కవితను ఈడీ పేరుతో వేధిస్తున్నారు. ఢిల్లీలో బీజేపీకి కంట్లో నలుసులా తయారైన ఆప్ సర్కార్ మీద కుట్రలో భాగంగానే మనీశ్ సిసోడియాను కూడా అరెస్టు చేశారన్నది దేశ ప్రజలకు తెలుసు. బ్యాంకుల్ని ముంచినవారిని, కమీషన్లు దండుకుంటున్న వారిని పట్టించుకోకుండా కవిత మీద , ఇతర నేతల మీద ఈడీలను, బోడీలను ప్రయోగిస్తే భయపడే ప్రసక్తే లేదు.

యతో ధర్మః.. తతో జయః

- దేవుడు, సత్యం, న్యాయం మావైపే.. ఎవరికీ భయపడేది లేదు
- దేవుడికంటే బలవంతులమని భావిస్తే ప్రకృతే సమాధానం చెబుతుంది
- తెలంగాణలో బీజేపీకి అధికారంలోకి రావాలనిపిస్తే ముందు ప్రజల మనసు గెలుచుకోవాలి
- అవసరమైతే సుప్రీంకోర్టుకు: కవిత



సాక్షి, న్యూఢిల్లీ: 'యతో ధర్మః తతో జయః.. దేవుడు మా వెంటే ఉన్నాడు. ఎవరికీ భయపడేది లేదు. ఎప్పటికీ ప్రజల కోసమే పని చేస్తాను'అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో భారత్ జాగృతి నేతృత్వంలో నిర్వహించనున్న నిరాహారదీక్షకు సంబంధించి గురువారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో విచారణకు హాజరుకావాలంటూ ఈడీ తనకిచ్చిన నోటీసుల అంశంపై ఆమె స్పందించారు. ఈ నెల 11న ఈడీ విచారణకు హాజరవుతానని.. ఎప్పుడు, ఎక్కడికి రమ్మని పిలిస్తే అక్కడి వెళతానన్నారు. అయితే విచారణ సమయంలో చట్ట ప్రకారం మహిళలకు ఉండే అధికారాలను విచారణ సంస్థలు గౌరవించాలన్నారు. 'వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ ఎందుకు జరపరు? అవసరమైతే మా ఇంటికి వచ్చి ఎందుకు విచారించరు?'అని ప్రశ్నించారు. దీనిపై అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామని ఆమె స్పష్టం చేశారు.

ధర్మం ఎవరివైపు ఉంటే వారిదే విజయం..

'మహాభారత యుద్ధ సమయంలో దుర్యోధనుడు తల్లి గాంధారి ఆశీర్వాదం కోరతాడు. అయితే దుర్యోధనుడు అన్యాయం వైపు ఉన్నాడని తెలుసు కాబట్టి ఆమె 'యతో ధర్మః.. తతో జయః'అని కొడుకును ఆశీర్వదిస్తుంది. నేనూ అదే చెబుతున్నాను. ధర్మం ఎవరివైపు ఉంటే వారికే విజయం లభిస్తుంది. జైలులో ఉంచినంత మాత్రాన కృష్ణుడి పుట్టుకను ఆపలేకపోయారు. అజ్ఞాతవాసంలో ఉన్న కారణంగా అర్జునుడి శౌర్యం ఏమాత్రం తక్కువకాలేదు. వనవాసానికి వెళ్లిన తర్వాత శ్రీరాముడు మరింత బలవంతుడిగా మారి లోకకల్యాణం కోసమే పనిచేశారు. మేము దేవుడి కంటే బలవంతులమని ఎవరికైతే అనిపిస్తుందో... విచారణ సంస్థలు సహా అన్నింటినీ కంట్రోల్ చేస్తున్నామని భావిస్తారో, అప్పుడు ప్రకృతే న్యాయం చేసేందుకు ముందుకొస్తుంది. బీజేపీ నియంతృత్వ పాలనను అడ్డుకొని న్యాయం చేసేందుకు ప్రకృతి ముందుకు రావడం ఖాయం'అని కవిత పేర్కొన్నారు.

వందలాది మందిపై దాడులు..

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలోని 500 వ్యాపార సంస్థలపై ఐటీ దాడులు, వందమందిపై సీబీఐ, 200 మందిపై కేంద్రం ఈడీ దాడులు చేయించిందని కవిత దుయ్యబట్టారు. తనతోపాటు పలువురు మంత్రులు, బీఆర్ఎస్‌కు చెందిన సుమారు 16 మంది ప్రజాప్రతినిధులపై రాజకీయ దురుద్దేశంతోనే విచారణ సంస్థలతో దాడులు చేయించిందని ఆరోపించారు. అలాగే సుమారు 600 మందిని ఎన్ఐఏ విచారణకు పిలిపించి భయపెట్టిందన్నారు. బీజేపీకి తెలంగాణలో అధికారంలోకి రావాలన్న ఆశ ఉంటే తొలుత రాష్ట్ర ప్రజల మనసులు గెలవాలని, ఆ తర్వాతే అధికారం గురించి ఆలోచించాలని సూచించారు.

కాంగ్రెస్ అహంకారాన్ని వీడాలి

దేశంలో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నాయని, కాంగ్రెస్ ఇప్పటికైనా అహంకారాన్ని వీడాలన్నారు. ప్రతిపక్షాలు ఏకమవ్వడంలో సవాళ్లు ఏమీ లేవని.. అయితే దేశంలోని అన్నిచోట్లా బలంగాలేని కాంగ్రెస్ ప్రతిపక్షాలకు ఎలా నేతృత్వం వహిస్తుందని ప్రశ్నించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఒక పెద్ద ప్రాంతీయ పార్టీ మాత్రమేనని, జాతీయ పార్టీ అనే భ్రమ నుంచి బయటికి రావాలని సూచించారు. విపక్షాలకు నేతృత్వం వహించాలని కాంగ్రెస్ భావిస్తే తొలుత ఆ పార్టీ అహంకారాన్ని వదిలిపెట్టి వాస్తవాలను గ్రహించాలని ఆమె సూచించారు.

ముందు ఈడీ.. తర్వాతే మోదీ

ఈ ఏడాది నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గతేడాది జూన్ నుంచి మోదీ ప్రభుత్వం తెలంగాణకు కేంద్ర దర్యాప్తు సంస్థలను పంపించడం ప్రారంభించిందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రస్తుతం దేశంలో బీజేపీ కొత్త సంప్రదాయాన్ని పాటిస్తోందని... ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ముందుగా ఈడీ వెళ్తోందని.. ఆ తర్వాతే మోదీ వస్తున్నారన్నారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను చూసి భయపడే ప్రసక్తే లేదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకోవడం ప్రజాస్వామ్యంలో మంచిదికాదన్నారు.

బీఎల్ సంతోష్‌కు భయమెందుకు?

ప్రతిపక్షాలకు చెందిన తనలాంటి నాయకులను వేధించడం ద్వారా ఏం సాధించాలనుకుంటుందో బీజేపీ స్పష్టం చేయాలని కవిత డిమాండ్ చేశారు. తాను తప్పు చేయలేదు కాబట్టి ఈడీ విచారణకు సిద్ధంగా ఉన్నానని, అయితే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఎందుకు భయపడుతున్నారో చెప్పాలని కవిత కోరారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ముందుకు బీఎల్ సంతోష్ హాజరై అధికారులు అడిగే ప్రశ్నలకు జవాబులివ్వాలన్నారు. అన్ని అంశాల్లోనూ కేంద్రం అబద్ధాలాడుతూ కాలం వెళ్లదీస్తోందని, వన్ నేషన్– వన్ ఫ్రెండ్ ప్రభుత్వానికి ప్రజలు అవకాశం ఇవ్వరాదని కోరారు.

'లిక్కర్'పై టక్కర్!

▶ మొదటి పేజీ తరువాయి

జాగృతి దీక్ష కోసం బుధవారం నాడే ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్సీ కవిత కూడా మోదీ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. ఇక ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి..అన్నాచెల్లెళ్లు కేటీఆర్, కవిత అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారంటూ ప్రతి విమర్శలు చేశారు. మరోవైపు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కూడా రాష్ట్రంలో తాజా పరిణామాలపై స్పందించారు. ఇలావుండగా కవితకు ఈడీ నోటీసుల వ్యవహారం గురువారం నాటి కేబినెట్ భేటీలోనూ చర్చకు వచ్చినట్లు తెలిసింది. కాగా శుక్రవారం బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరగనుండటం, పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలంటూ ఢిల్లీలో కవిత చేయనున్న దీక్షకు పోటీగా శుక్రవారం నాడే 'మహిళా గోస – బీజేపీ భరోసా' పేరిట ఆ పార్టీ రాష్ట్ర నేతలు సైతం దీక్ష చేపట్టనుండటంతో.. రాష్ట్రంలో రాజకీయం మరింత వేడెక్కే సూచనలు కన్పిస్తున్నాయి.

తీవ్రమవుతున్న రాజకీయ పోరు

కవిత దీక్ష చేయనున్న జంతర్‌మంతర్ వద్దే మరో రెండు పార్టీలు సమావేశాలు నిర్వహించుకునేందుకు తొలుత ఢిల్లీ పోలీసులు అనుమతినిచ్చినా తర్వాత ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాన్ని మార్చుకున్నారు. మద్యం కుంభకోణాన్ని పక్కదారి పట్టించడానికే కవిత మహిళా రిజర్వేషన్ల పేరిట దీక్ష కార్యక్రమాన్ని ఎంచుకున్నారని బీజేపీ నాయకులు విమర్శిస్తుండగా.. 'లిక్కర్ కేసులో ఎలాంటి విచారణనైనా ఎదుర్కొంటా. నేను తప్పు చేయలేదు. భయపడే ప్రసక్తే లేదు' అంటూ కవిత ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా బీఆర్ఎస్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తం మీద అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య రాజకీయ పోరు తీవ్రమవుతోంది.



భయపడాల్సింది ఏమీ లేదు!

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్దామని, భయపడాల్సిన పనేమీ లేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. గురువారం ప్రగతిభవన్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో ఎమ్మెల్సీ కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసుల అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారని సమాచారం. కాగా నోటీసులు, వేధింపులు ఇక్కడితో ఆగవని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఇప్పటికే పలువురిపై దాడులు నిర్వహించిన దర్యాప్తు సంస్థలు కేసులు నమోదు చేసిన అంశం కూడా చర్చకు వచ్చింది. బీజేపీ అరాచకాలను క్షేత్రస్థాయిలోనూ ఎండగట్టాలని, అందుకు సంబంధించి శుక్రవారం జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వివరంగా మాట్లాడుకుందామని సీఎం చెప్పినట్లు తెలిసింది.

తదుపరి భేటీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఖరారు!

గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయమై సుప్రీంకోర్టుకు వెళ్లడాన్ని కేబినెట్ సమర్థించింది. మరోవైపు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక అంశం కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. అయితే ఇంకా సమయం ఉన్నందున తదుపరి కేబినెట్ భేటీలో అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని కేసీఆర్ వెల్లడించినట్లు సమాచారం. ఎన్నికల ఏడాది కావడంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విమర్శలకు, ఆరోపణలకు తావివ్వకుండా మసలుకోవాలని, బడుగు బలహీన వర్గాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సీఎం సూచించారు.

నంబర్ ఇక్కడ.. వాట్సాప్ అక్కడ!

- బేసిక్ ఫోన్లలో ఉన్న సెల్ నంబర్లు గుర్తింపు
- వాటితో స్మార్ట్‌ఫోన్లలో వాట్సాప్ యాక్టివేట్
- ప్రముఖుల పేరిట వాట్సాప్ మెసేజ్‌లు
- పంపి డబ్బు గుంజుతున్న సైబర్ నేరగాళ్లు
- కేసులు నమోదవుతున్నా నిందితుల ఆచూకీ కనిపెట్టలేకపోతున్న పోలీసులు



సాక్షి, హైదరాబాద్: వాట్సాప్ డీపీలతో టోపీ వేస్తున్న సైబర్ నేరగాళ్లు కొత్త పంథా అనుసరిస్తున్నారు. బేసిక్ ఫోన్లలో ఉన్న సెల్ నంబర్లను గుర్తించి వాటికి సంబంధించిన వాట్సాప్‌ను తమ స్మార్ట్‌ఫోన్లలో యాక్టివేట్ చేసుకుంటున్నారు. వైఫై ద్వారా కథ నడుపుతూ డబ్బు, గిఫ్ట్ వోచర్ల పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు. 'డీపీ ఫ్రాడ్స్'పై అధ్యయనం చేసిన హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు.. రెండు రకాలుగా ఇతరుల వాట్సాప్‌లు సైబర్ నేరగాళ్ల వద్దకు వెళ్తున్నాయని గుర్తించారు.

కొన్నాళ్లకు వినియోగించడం మానేసి..

ఒకరి పేరుతో ఉన్న సెల్ నంబర్‌కు సంబంధించిన వాట్సాప్‌ను వినియోగించుకోవడానికి సైబర్ నేరగాళ్లు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.నకిలీ పత్రాలతో గ్రామీణ ప్రాంతాల్లో సిమ్‌కార్డులు కొని వాటి ద్వారా వాట్సాప్‌ను యాక్టివేట్ చేసుకుంటున్నారు. ఆపై కొన్నిరోజులకు ఆ నంబర్‌ను నేరుగా వాడటం మానేసి కేవలం వైఫై ద్వారానే వాట్సాప్ వాడుతున్నారు. దీంతో నిర్ణీతకాలం తర్వాత సర్వీస్ ప్రొవైడర్లు ఆ నంబర్‌ను మరొకరికి కేటాయిస్తున్నారు. ఇలా తీసుకున్న వాళ్లు ఈ నంబర్‌తో వాట్సాప్ యాక్టివేట్ చేసుకోకున్నా లేదా బేసిక్ ఫోన్లు వాడుతున్నా వాట్సాప్ నంబర్ పాత యజమాని వద్దే ఉండిపోతోంది.

సాధారణ ఫోన్లలో ఉన్నవి గుర్తిస్తూ..

సైబర్ నేరాల కోసం మరొకరి వాట్సాప్‌ను తమ స్వాధీనంలోకి తీసుకోవడానికి సైబర్ నేరగాళ్లు మరో విధానాన్ని అనుసరిస్తున్నారు. ఓ సిరీస్‌లోని నంబర్లను తమ స్మార్ట్‌ఫోన్లలో వేర్వేరు పేర్లతో సేవ్ చేసుకొని వాటిల్లో వాట్సాప్ యాక్టివేట్ అయిందో లేదో తెలుసుకుంటున్నారు. యాక్టివేట్ కాని వాటిని వైఫై ద్వారా వాడే తమ స్మార్ట్‌ఫోన్లలో వాడటానికి ఓటీపీ అవసరం. దీంతో సేల్స్, కాల్‌సెంటర్ల పేర్లతో వారికి ఫోన్లుచేసి ఓటీపీ తెలుసుకుంటున్నారు. ఇది ఎంటర్ చేయడంతోనే అవతలి వారి నంబర్‌తో వాట్సాప్ వీరి ఫోన్లలో యాక్టివేట్ అవుతోంది. విషయం ఫోన్‌నంబర్ వాడే వారికి తెలియట్లేదు.

కష్టసాధ్యంగా దర్యాప్తు..

ఈ వాట్సాప్‌లను వాడి ప్రముఖులు, అధికారుల ఫొటోలు డీపీలుగా పెడుతున్న సైబర్ నేరగాళ్లు ఇంటర్నెట్ ద్వారా వారి సంబంధీకుల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. వాళ్లకు వారి బాస్‌లు, ప్రముఖుల మాదిరిగా వాట్సాప్ సందేశాలు పంపి డబ్బు, గిఫ్ట్ వోచర్లు డిమాండ్ చేసి కాజేస్తున్నారు. దీనిపై కేసులు నమోదవుతున్నా వాట్సాప్‌కు సంబంధించిన ఫోన్ నంబరే దర్యాప్తునకు ఆధారంగా మారుతోంది. అలా ముందుకు వెళుతున్న అధికారులకు దాని యజమానుల ఆచూకీ లభిస్తోంది తప్ప వాట్సాప్ యాక్టివేట్ చేసుకొని వినియోగిస్తున్న వారు పట్టుబడట్లేదు. వారిని కనిపెట్టడం కూడా కష్టంగా మారడంతో దర్యాప్తులు జటిలంగా మారుతున్నాయి. ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన కేసుల్లో నిందితులు దొరకడం అరుదు కాగా.. గిఫ్ట్ వోచర్ల రూపంలో కొల్లగొట్టిన వాళ్లు చిక్కడం దుర్లభమవుతోంది.

నేరుగా సంప్రదించడం ఉత్తమం..



వాట్సాప్ మోసాల బారినపడకుండా ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. సందేశం వచ్చిన వెంటనే కేవలం డీపీ ఆధారంగా కాకుండా ఫోన్‌నంబర్ చూశాకే ఎదుటి వ్యక్తి ఎవరన్నది ఖరారు చేసుకోవాలి. అవసరమైతే ఫోన్ చేసి లేదా నేరుగా సంప్రదించాకే లావాదేవీలు చేయాలి. – కేవీఎం ప్రసాద్, హైదరాబాద్ సైబర్ క్రైం ఏసీపీ

కవిత దీక్షకు అంతా సిద్ధం

మహిళా రిజర్వేషన్ బిల్లుపై నేడు జంతర్‌మంతర్ వేదికగా నిరాహార దీక్ష



ఢిల్లీలో సీతారాం ఏచూరితో భేటీ అయిన కవిత

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలనే డిమాండ్‌తో శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేపట్టే నిరాహార దీక్షకు అంతా సిద్ధమైంది. జంతర్‌మంతర్ వేదికగా జరిగే ఈ దీక్షకు భారత జాగృతి నేతలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు దీక్ష ప్రారంభం కానుండగా సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఈ దీక్షకు 18 రాజకీయ పార్టీలు ఇప్పటికే సంఘీభావం ప్రకటించగా, వివిధ రాష్ట్రాల నుంచి మహిళా సంఘాల నేతలు, ప్రతినిధులు హాజరుకానున్నారు.

మద్దతుపై కాంగ్రెస్‌తోనూ చర్చలు...

మహిళా రిజర్వేషన్ బిల్లుపై చేపడుతున్న దీక్షకు సంఘీభావం తెలపాలని వివిధ రాజకీయ పార్టీల నేతలను భారత జాగృతి నేతలు సంప్రదించారు. అందుకు బీఆర్ఎస్ సహా నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, అకాలీదళ్, టీఎంసీ, జేడీయూ, ఆర్జేడీ, సమాజ్‌వాదీ, సీపీఐ, సీపీఎం, డీఎంకే, ఎన్సీపీ, శివసేన, ఆప్, ఆర్ఎల్డీ, జేఎంఎం వంటి పార్టీలు సమ్మతించాయి. కాగా ఈ దీక్షకు సంఘీభావంగా పార్టీ తరపున ప్రతినిధులను పంపాలని కాంగ్రెస్ అగ్రనేతలను సైతం సంప్రదించామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఈ విషయమై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడినట్లు వెల్లడించారు. అయితే కాంగ్రెస్ నుంచి ప్రతినిధుల హాజరుపై మాత్రం స్పష్టత రాలేదు. ఉదయం 10 గంటలకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి దీక్షను ప్రారంభిస్తారు. ఈ మేరకు గురువారం సీతారాం ఏచూరిని కవిత కలిసి శుక్రవారం నాటి దీక్ష ప్రారంభ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఇక దీక్ష ముగింపునకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తదితరులు పాల్గొనే అవకాశం ఉందని నేతలు చెబుతున్నారు. దీక్షలో సుమారు 5వేల మంది పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీక్ష కోసం వివిధ వర్సిటీల నుంచి యువకులు, మహిళలను పెద్ద ఎత్తున తరలించేలా నేతలు ఏర్పాట్లు చేశారు.

చివరి నిమిషంలో బీజేపీ వేదిక మార్పు ..

కాగా జంతర్‌మంతర్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్షా స్థలి విషయంలో కొంత వివాదం తలెత్తింది. దీక్షలో 5వేల మంది పాల్గొనేందుకు వీలుగా తొలుత విశాలమైన దీక్షా స్థలిని కేటాయించిన ఢిల్లీ పోలీసులు గురువారం మధ్యాహ్నం దానిని కుదించినట్లు కవితకు సమాచారమిచ్చారు. దీక్షకు మొదటగా కేటాయించిన ప్రాంతాన్ని విభజించి టిబెట్ అంశంపై జరిగే ఆందోళన, ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన ఆందోళనకు స్థలం కేటాయించారు. ఈ నేపథ్యంలో కవిత ఢిల్లీ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో దీక్షాస్థలికి పక్కనే బీజేపీ ఆందోళనకు కేటాయించిన స్థలాన్ని ఢిల్లీ పోలీసులు మార్చారు. భారత జాగృతి దీక్ష, బీజేపీ ఆందోళన పక్క పక్కనే జరిగితే ఉద్రిక్తతలు చోటు చేసుకుంటాయనే ఉద్దేశ్యంతో బీజేపీ కార్యక్రమ వేదికను దీన్ దయాళ్ మార్గ్ ప్రాంతానికి మార్చారు.

ఇదండీ సంగతి



బీజేపీయేతర రాష్ట్రాలన్నిటిలో కూడా అలానే ఉంది.. ప్రత్యేకంగా అక్కడే ఇలా జరుగుతుందనడం సరికాదు!

4 లక్షల మందికి గృహలక్ష్మి!

▶ మొదటి పేజీ తరువాయి

పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, మల్లారెడ్డిలతో కలిసి ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు మీడియాకు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

'ఇంటి' కోసం మూడు విడతల్లో రూ. 3 లక్షలు

సొంత స్థలాలు ఉండి ఇల్లు లేనివారు, గతంలో ఉన్న ఇల్లు కూలిపోయిన పేదలు 'గృహలక్ష్మి' పథకానికి అర్హులు. మంజూరు చేసే ఇళ్లన్నీ మహిళల పేరు మీదనే ఉంటాయి. తక్షణమే లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ ప్రక్రియలను ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించాం. ఒక్కో విడత రూ.లక్ష చొప్పున మూడు విడతల్లో రూ.3 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో వేస్తుంది. లబ్ధిదారులు తమకు నచ్చిన విధంగా ఇళ్లను నిర్మించుకోవడానికి వీలుగా నిబంధనలను సులభతరం చేయాలని నిర్ణయించాం. సొంత జాగా లేని పేదల కోసం డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం కొనసాగుతుంది. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులు వేగంగా ముగించాలని అధికారులను ఆదేశించాం.

1.55 లక్షల మందికి పోడు పట్టాలు

రాష్ట్రంలో 1,55,393 మంది ఆడబిడ్డలకు 4లక్షల 903 ఎకరాల్లో పోడు పట్టాలు ఇవ్వాలని, తక్షణమే పంపిణీని ప్రారంభించాలని అధికారులను ఆదేశించాం. లబ్ధిదారుల గుర్తింపు, తీర్మానాలు పూర్తి చేయడంతోపాటు పట్టాలను ముద్రించి పంపిణీకి సిద్ధం చేశాం. ఎక్కడైనా మిగిలి ఉన్నచోట ప్రక్రియ కొనసాగుతుంది.

పేదల హౌసింగ్ రుణాలు మాఫీ

గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇళ్ల నిర్మాణం కోసం పేదలకు ఇచ్చిన రూ.40 వేలు/ రూ.60 వేలు/ రూ.90 వేలు అప్పులను మాఫీ చేస్తున్నాం. ఈ మేరకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించింది. దాదాపు రూ.4వేల కోట్ల అప్పులను ఆ పేదల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుంది.

జీవో 58, 59ల దరఖాస్తులకు 2020 కటాఫ్

ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కోసం ఇచ్చిన జీవో 58, 59 కింద గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి చివరిసారిగా నెల రోజుల గడువుతో మరో అవకాశం కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. గతంలో 2014 కటాఫ్ తేదీ ఉండగా 2020కి మార్చుతున్నాం. జీవో 58 కింద ఒక్క రూపాయి లేకుండా పేదలకు స్థలం/ఇంటి మీద హక్కు కల్పిస్తాం. జీవో 58 కింద ఇప్పటివరకు 1,45,668 మందికి, జీవో 59 కింద 42వేల మందికి పట్టాలు అందించడం జరిగింది. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పేదల ఇళ్లను జేసీబీలు, పోక్లెయిన్లతో కూల్చివేస్తే.. మేం క్రమబద్ధీకరిస్తున్నాం.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్. చిత్రంలో మంత్రులు గంగుల, వేముల, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి తదితరులు

ఏప్రిల్ 14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

హుస్సేన్‌సాగర్ తీరాన దేశంలోనే అతిపెద్దదైన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం సిద్ధమైంది. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న ఘనంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని మంత్రివర్గంలో నిర్ణయించాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత ప్రజలు, బిడ్డలను హైదరాబాద్‌కు పిలుచుకుని, లక్షల మంది సమక్షంలో గొప్పగా ఈ కార్యక్రమాన్ని జరుపుతాం. అన్ని గ్రామాలు, పట్టణాల నుంచి దళితవర్గాల ప్రజలు హైదరాబాద్‌కు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, విగ్రహావిష్కరణ అనంతరం భారీ సభ జరపాలని నిర్ణయం తీసుకున్నాం.

1.30 లక్షల కుటుంబాలకు రెండోదశలో దళితబంధు

లక్షా 30 వేల దళిత కుటుంబాలకు రెండోదశ దళితబంధు పథకాన్ని అమలు చేయాలని, వెంటనే ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికే దళితబంధు 100 శాతం అమలైంది. మిగతా 118 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున 1,29,800 మందికి.. సీఎస్ నేతృత్వంలోని కమిటీకి వచ్చే అప్పీళ్ల ఆధారంగా మరో 200 మందికి అందిస్తాం. ఇకపై ఏటా ఆగస్టు 16న రాష్ట్రవ్యాప్తంగా దళితబంధు వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించాం. ఈసారి కూడా కలెక్టర్ల పర్యవేక్షణలో దళితబంధు అమలు చేయాలని, వేగంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించాం.

ఏప్రిల్ నుంచి గొర్రెల పంపిణీ

గొర్రెల పంపిణీ పథకం కింద రాష్ట్రంలో 7.31 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించగా.. అందులో 50 శాతం మందికి గతంలో పంపిణీ పూర్తయింది. రెండో విడత కింద మిగతా వారికి ఏప్రిల్ నుంచి పంపిణీ ప్రారంభించనున్నాం. ఇందు కోసం రూ.4,463 కోట్లను మంజూరు చేస్తున్నాం.

కాశీ, శబరిమలలో రాష్ట్ర వసతిగృహ సముదాయాలు
రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో వెళ్లే భక్తుల కోసం కాశీ, శబరిమలలో రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో వసతిగృహాలను నిర్మించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వీటికి చెరో రూ.25 కోట్లను మంజూరు చేసింది. ప్రభుత్వస్థలం దొరకకపోతే ప్రైవేటుస్థలం కొని అన్ని వసతులతో వసతి గృహ సముదాయాన్ని నిర్మిస్తాం. గతంలో కేసీఆర్ కేరళ సీఎంతో మాట్లాడినప్పుడు స్థలం ఇచ్చేందుకు అంగీకరించారు.

ఏప్రిల్ నుంచి ధాన్యం కొనుగోళ్లు

కొత్త సచివాలయం, అమరవీరుల స్థూపం పనులు పూర్తికావచ్చాయి. జూన్ 2లోగా వీటిని ప్రారంభించుకుంటాం. రంగారెడ్డి జిల్లాలోని వక్ఫ్ భూముల్లో ఇళ్లు కట్టుకున్నవారి విషయంలో చట్టాలు, నిబంధనలకు లోబడి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల ఎంపికకు మే వరకు సమయం ఉంది. యాసంగిలో పండిన ప్రతి గింజను కొంటాం. కేంద్రం కొన్నా, కొనకపోయినా ఏప్రిల్ నెలాఖరులోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం'' అని హరీశ్‌రావు తెలిపారు.

కేసీఆర్ చేతిలో పోలీసుశాఖ కీలుబొమ్మ కాదా?

- వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల



సాక్షి, హైదరాబాద్: కేంద్రం చేతిలో ఈడీ తోలుబొమ్మ అయితే.. కేసీఆర్ ప్రభుత్వం చేతిలో పోలీసు శాఖ కీలుబొమ్మ కాదా? అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. కేటీఆర్ ప్రెస్ మీట్‌పై ఆమె స్పందిస్తూ.. దొంగలు ఎవర్రా అంటే భుజాలు తడుముకున్నట్టు ఉందని వ్యాఖ్యానించారు. ఏ తప్పూ చేయకుంటే ఈడీ, బోడీలకు భయమెందుకని ఆమె ప్రశ్నించారు. వాస్తవాలు బయటకు చెప్పే మీడియాపై కేటీఆర్‌కు ఎందుకు అంత అసహనమని ప్రశ్నించారు. తన చెల్లి నిర్దోషి అయితే, లిక్కర్ దందాలో ఏం జరిగిందో చెప్పాలని కోరారు. కేసీఆర్ పాపాలపుట్ట పగులుతోందని. ఇక తమ సర్కార్ పతనమే మిగిలిందని షర్మిల వ్యాఖ్యానించారు. కేసీఆర్ నేరాల చిట్టా నాగుపామై కాటేసే రోజు దగ్గరలో ఉందని స్పష్టం చేశారు. 'జాగ్రత్త కేసీఆర్.. నీకు కూడా జైలు ఖాయం' అని షర్మిల హెచ్చరించారు.

ద.మ. రైల్వే సరకు రవాణా @ రూ. 12,016 కోట్లు

- సరకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే కొత్త చరిత్ర

సాక్షి, హైదరాబాద్: సరకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే కొత్త రికార్డులు సృష్టించింది. 2018–19 ఆర్థిక సంవత్సరం–2లో సాధించిన 122.498 మిలియన్ టన్నుల లోడింగ్‌ను అధిగమించి 2023 మార్చి 8 నాటికి 122.628 మిలియన్ టన్నుల రవాణాను సాధించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. జోన్ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధిక సరకు రవాణా ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలోనే సాధించినట్టు, మొత్తంగా రూ. 12,016 కోట్లు ఆర్జించినట్లు ద.మ.రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. ఈ అత్యుత్తమ మైలురాయిని సాధించినందుకు ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఆర్. ధనంజేయులు, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి.జాన్ ప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బందిని అభినందించారు. సరుకు రవాణా విభాగంలో దక్షిణ మధ్య రైల్వే రెండవ స్థానాన్ని చేరుకుందన్నారు.

నేడు బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

- పలు అంశాలపై పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయనున్న కేసీఆర్
- ఎన్నికల ముందు పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంపై దిశానిర్దేశం
- కేంద్ర దర్యాప్తు సంస్థల తీరును ఎండగట్టేలా కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా.. ఎన్నికల ఏడాదిలో పార్టీని బలంగా జనంలోకి తీసుకెళ్లే దిశగా బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. పార్టీ టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ విస్తృత స్థాయి సమావేశంలో.. జాతీయ స్థాయిలో పార్టీ బలోపేతం, శాసనసభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడం లక్ష్యంగా కార్యాచరణ రూపొందించనున్నారు. ఇప్పటికే జాతీయ దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలు వ్యవహరిస్తున్న తీరుపై జాతీయస్థాయిలో విపక్షాలను ఒక్కతాటిపైకి తెచ్చే పనిలో ఉన్న కేసీఆర్.. ఈ అంశాలను తెలంగాణ ప్రజల్లోకి బలంగా చేరవేసేలా సూచనలు చేయనున్నట్టు తెలిసింది. కేంద్ర దర్యాప్తు సంస్థల తీరును ఎండగట్టేలా గ్రామ, మండల స్థాయి నుంచీ బీఆర్ఎస్ కార్యకర్తలు అనుసరించాల్సిన కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఎమ్మెల్సీ కవితతోపాటు 12 మంది పార్టీ నేతలను విచారణల పేరుతో వేధింపులకు గురిచేస్తున్న అంశాన్ని, ఆయా సంస్థలను ప్రోత్సహిస్తున్న బీజేపీ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈనెల 11న ఎమ్మెల్సీ కవిత ఈడీ ముందు హాజరవనున్న నేపథ్యంలో.. పరిణామాలను బట్టి అనుసరించాల్సిన వ్యూహంపైనా సమావేశంలో చర్చించనున్నట్టు సమాచారం.

ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై..: గురువారం కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా పార్టీ విస్తృత సమావేశంలో తగిన సూచనలు చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇక బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు సాగిస్తున్న కార్నర్ మీటింగ్‌లు, పాదయాత్రలకు బీఆర్ఎస్ తరఫున కౌంటర్‌గా చేపట్టే కార్యక్రమాలను వెల్లడించే అవకాశం ఉందని అంటున్నాయి. నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తూనే.. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, ప్రచారంపై ఎమ్మెల్యేలు అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ స్పష్టత ఇవ్వనున్నట్టు వివరించాయి. మొత్తంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీకి ఉన్న యంత్రాంగాన్ని క్రమపద్ధతిలో వినియోగించుకుంటూ.. మంచి ఫలితాలు సాధించేదిశగా పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

పీఆర్సీపై విద్యుత్ మంత్రి చర్చలు నేడు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ, ఇతర సమస్యలపై విద్యుత్‌శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సౌధలో విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీలతో చర్చలు జరపనున్నారు. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు గత సోమవారం విద్యుత్ సౌధలో నిర్వహించిన చర్చల్లో 6శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేస్తామని ప్రతిపాదించగా, జేఏసీల ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించడం తెలిసిందే.

అన్నాచెల్లెలు చెప్పేవన్నీ అబద్ధాలే

- మంత్రి కేటీఆర్, కవితలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: కల్వకుంట్ల కుటుంబసభ్యులు కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేసేంత గొప్పోళ్లు ఏమీ కాదని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అన్నాచెల్లెలైన బీఆర్ఎస్ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత మీడియా సమావేశాల్లో అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని విమర్శించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, 'కల్వకుంట్ల కుటుంబ ప్రతినిధులు దశల వారీగా ప్రెస్‌మీట్లు పెడుతూ.. మేమే చాలా నీతిమంతులం.. మా మీద అక్రమ కేసులు పెడుతున్నరని అంటున్నారు. వారి తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ డాంటే' అన్న సామెతను తలపిస్తున్నది. మీరు ఢిల్లీ వెళ్లి అక్కడ మద్యం స్కాం చేసి డబ్బులు సంపాదించమని తెలంగాణ ప్రజలు, ఆడబిడ్డలు ఏమైనా చెప్పారా? మహిళలు చీదరించుకునేలా అక్రమ వ్యాపారం చేసింది మీరు. సీఎం బిడ్డ, ఒక మహిళ ఢిల్లీ నడిబొడ్డున అక్రమ వ్యాపారం చేసినందుకు తెలంగాణ పరువు పోయింది' అని ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం మాట్లాడుతున్నందునే ఈడీ తనకు నోటీసులు ఇచ్చిందని కవిత చెప్పడం విడ్డూరమని కిషన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్ కాబోతున్నారని తెలిసే, మహిళా రిజర్వేషన్ పేరుతో సానుభూతి కోసం డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. 'కేసీఆర్ మొదటి టర్మ్ కేబినెట్‌లో ఒక్క మహిళా మంత్రి కూడా లేరని, బీఆర్ఎస్ తరఫున రాజ్యసభకు ఒక్క మహిళను కూడా పంపలేదని, అలాంటి మీకు మహిళా రిజర్వేషన్ గురించి మాట్లాడే హక్కు ఉందా?' అని కవితను ప్రశ్నించారు. నీతివంతులైతే, అక్రమ వ్యాపారం చేయనట్లయితే.. ఎందుకు భుజాలు తడుముకుంటున్నారన్నారు.

అవినీతి వ్యతిరేక విధానంలో రాజీ పడే ప్రసక్తే లేదు
తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబాన్ని, బీఆర్ఎస్ పార్టీని ప్రజలు వ్యతిరేకిస్తుండటంతో ఏం చేయాలో తోచకే బీజేపీపై విమర్శలు చేస్తున్నారని కేంద్రమంత్రి అన్నారు. 2014లో దేశంలో అవినీతి వ్యతిరేక నినాదంతో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం తమకు లేదని పేర్కొన్నారు.

ఎంత పెద్దవారున్నా వదలొద్దు

- ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు తెలంగాణ సమాజానికి సంబంధమేంటి?
- ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేస్తా: భట్టి



సాక్షి, హైదరాబాద్ : 'ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎంత పెద్దవారు ఉన్నా వదలొద్దు. ఎమ్మెల్సీ కవితకు ఇచ్చిన ఈడీ నోటీసులు తెలంగాణ ప్రజలకు అవమానమని ఎవరైనా మాట్లాడితే తెలంగాణ సమాజం వారిని ప్రశ్నించాలి. లిక్కర్ స్కామ్‌కు తెలంగాణ సమాజానికి సంబంధం ఏంటీ..? తెలంగాణ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారు. తెలంగాణ సమాజం ఈ విషయాన్ని గమనించాలి' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ గాంధీ వారసులుగా టోపీలు పెట్టుకొని అవినీతిని ఊడ్చివేస్తామని అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ సర్కార్ ఇప్పుడు లిక్కర్ స్కామ్‌కు పాల్పడి దేశానికి మచ్చ తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేసిన అన్నాహజారే ఇప్పుడు బయటకు వచ్చి మాట్లాడాల్సిందేనని డిమాండ్ చేశారు. లిక్కర్ స్కామ్‌కు ఢిల్లీ కేబినెట్‌లో ఉన్న సీఎంతో పాటు మంత్రులందరూ బాధ్యత వహించాలని అన్నారు.

కవిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం..
లిక్కర్ స్కామ్ అభియోగాలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ నోటీసులు ఇస్తే.. సమగ్ర విచారణకు సిద్ధమని వెళ్లాలి కానీ.. తెలంగాణ ప్రజలకు అవమానమని వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని భట్టి అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, పౌరుషాన్ని మద్యం కుంభకోణానికి చిత్రీకరించడం ఏంటని మండిపడ్డారు. ప్రతిపక్షాలను వేధించడానికి కేంద్రం ఐటీ, సీబీఐ, ఈడీలను వాడుతోందనడంతో సందేహం లేదని, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీలకు ఈడీ నోటీసులు ఇచ్చిందన్నారు. 16 నుంచి ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేస్తానని, రూట్‌మ్యాప్ రేపటిలోగా ఫైనల్ అవుతుందని పేర్కొన్నారు.

రేపు హైదరాబాద్‌కు అమిత్ షా

- 12న సీఐఎస్ఎఫ్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా శనివారం సాయంత్రం హైదరాబాద్ రానున్నారు. హకీంపేట ఎయిర్‌పోర్టులో ఆయన దిగనున్నారు. ఆదివారం ఉదయం సీఐఎస్ఎఫ్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొంటారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి బీజేపీ రాష్ట్ర మినీ కోర్‌కమిటీతో షా భేటీ అయ్యే అవకాశం ఉంది. శుక్రవారం ఢిల్లీలో బీఆర్ఎస్ ధర్నా, ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు తదితర రాజకీయ పరిణామాల నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత ఏర్పడనుందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఆదివారం సంగారెడ్డిలో వివిధ రంగాల మేధావులతో విడిగా సమావేశం కావాల్సి ఉండగా అది రద్దయినట్లు తెలిపారు.

సాక్షి
శుక్రవారం, మార్చి, 10

అఫ్గాన్ విషాద సంగీతం

చేసిన పాపాలు శాపాలై వెంటాడతాయంటారు. అఫ్గానిస్తాన్‌లో రెండు దశాబ్దాలుగా తప్పు మీద తప్పు చేసుకుంటూ పోయిన అమెరికా అటువంటి స్థితినే ఎదుర్కొంటున్నది. ఆ దేశానికి అన్ని రకాలుగా తోడ్పడిన పాకిస్తాన్ వర్తమాన దుఃస్థితి చెప్పనవసరమే లేదు. అఫ్గాన్ నుంచి 2021 ఆగస్టు 15న అమెరికా సైన్యం కంగారుగా, బాధ్యతారహితంగా, పరమ అరాచకంగా వెనక్కొచ్చిన ఉదంతంపై బుధవారం అమెరికన్ కాంగ్రెస్ విదేశాంగ శాఖ కమిటీ ముందు పలువురు మాజీ సైనికాధికారులు, సైనికులు ఇచ్చిన వాంగ్మూలాలు అందరినీ దిగ్భ్రాంతిలో ముంచెత్తాయి. అదే రోజు మహిళా దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ మాట్లాడుతూ అఫ్గానిస్తాన్ మహిళలు ప్రపంచంలోనే అత్యంత దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘనను చవిచూస్తున్నారని ప్రకటించారు. వెనకా ముందూ చూసుకోకుండా తాలిబన్‌లతో ఆదరాబాదరాగా ఒప్పందం కుదుర్చుకుని అక్కడినుంచి వెనుదిరిగిన అమెరికాయే ఈ పరిస్థితికి కూడా బాధ్యత వహించాల్సి వుంటుంది.

నిష్క్రమణ రోజు కాబూల్‌లోని హమీద్ కర్జాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒకదాని వెంబడి ఒకటి చోటుచేసుకున్న ఉదంతాలు ఎవరూ మరువలేరు. తాలిబన్‌ల పునఃప్రవేశం, అమెరికా సైన్యం నిష్క్రమణ ఖాయమని నిర్ధారించుకున్నాక వేలాదిమంది అఫ్గాన్ పౌరులు ఆ విమానాశ్రయానికి తరలివచ్చారు. అలా దాదాపు లక్షా 24 వేలమంది విమానాశ్రయంలో తలదాచుకోగా అంతకు రెట్టింపుమంది అప్పటికే దాదాపు 40 శాతం భూభాగం సొంతం చేసుకున్న తాలిబన్‌ల పడగ నీడలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని తమ విముక్తి కోసం ఎదురుచూశారు. నడిరోడ్లపై పడిగాపులు పడ్డారు. వీరంతా దాదాపు ఇరవైయ్యేళ్లుగా అమెరికా సైన్యానికి అండదండలందించినవారే. వీరిలో అనేకమంది పౌరులపై తాలిబన్‌లు దౌర్జన్యాలకు దిగటం ప్రారంభించారు. నిలదీసినవారిలో కొందరినైతే అక్కడికక్కడే కాల్చిచంపారు. పరిస్థితిని చక్కదిద్దటానికీ, నిష్క్రమణ సాఫీగా సాగటానికీ తాలిబన్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్న సీనియర్ అధికారులు వీటిల్లో చాలా ఉదంతాలను చూసీచూడనట్టు వదిలేశారు. కొన్నింటిని లేవనెత్తినా 'అది మా ఆంతరంగిక సమస్య' అంటూ తాలిబన్‌లు బదులిచ్చినప్పుడు మౌనంగా ఉండిపోయారు. ఈలోగా భారీయెత్తున పేలుడు సంభవించి 200మంది అఫ్గాన్ పౌరులతోపాటు 13 మంది అమెరికన్ సైనికులు మరణించారు. అనేకులు వికలాంగులుగా మిగిలిపోయారు. సుశిక్షితమైన సైన్యం, అత్యాధునిక సాంకేతికత ఉండి, ప్రత్యర్థులతో సంప్రదింపులు జరిపేటపుడు అనుకున్నది సాధించేవరకూ పట్టుదలగా వ్యవహరిస్తుందని గుర్తింపు పొందిన అమెరికా అఫ్గాన్ చిట్టచివరి అధ్యాయంలో బేలగా మిగిలిపోయింది. యుద్ధ కాలంలో సహకరించినవారిని చిట్టచివర నట్టేట ముంచుతుందన్న అపఖ్యాతి అమెరికాకు ఉన్నదనీ, అఫ్గాన్ పౌరుల విషయంలో అది మరోసారి రుజువైందనీ కమిటీ ముందు ఒక మాజీ సైనికాధికారి వాపోయిన తీరు ఆనాటి పరిస్థితులకు అద్దం పడుతుంది. ఆండ్రూస్ అనే మాజీ మెరైన్ ఒకరు 200 మంది దుర్మరణం పాలైన ఘటన గురించి చెప్పిన అంశాలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. మానవ బాంబులుగా అనుమానించిన ఇద్దరు జన సమూహంవైపు రావటం చూసిన ఆండ్రూస్, అతని సహచర సైనికుడు వారిపై చర్య తీసుకునేందుకు కమాండర్ అనుమతి కోరారట. కానీ ఆయన నిరాకరించారు. మరికాస్సేపటికి మానవ బాంబులు తమను తాము పేల్చుకున్నారు. చిత్రమేమంటే ఆ తర్వాత మరో మూడు రోజులకు విమానాశ్రయానికి దగ్గర్లో ఒకరిని మానవబాంబుగా అనుమానించి అమెరికా సైనికులు డ్రోన్ దాడి ద్వారా మట్టుబెట్టే ప్రయత్నం చేశారు. తీరా ఆ దాడిలో ఒక అఫ్గాన్ కుటుంబంలోని ముగ్గురు పెద్దలు, ఏడుగురు పిల్లలు మరణించారు. ఇలా తప్పు మీద తప్పు చేస్తూ పోయిన అమెరికా అఫ్గాన్ పౌరులకు మాత్రమే కాదు... తన సైనికులకు కూడా అన్యాయం చేసింది. ఆ యుద్ధంలో పాల్గొన్న అనేకమంది సైనికులు ప్రస్తుతం అనేక మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా పరువుప్రతిష్ఠలు కోల్పోయింది. దాదాపు 2,500 మంది సైనికులను పోగొట్టుకుని, 2 లక్షల కోట్ల డాలర్ల సొమ్ము వృథా వ్యయం చేసింది. కానీ అఫ్గాన్ దేశానికీ, పౌరులకూ కలిగిన నష్టం అపారం. అదిప్పుడు శిథిలాల గుట్టగా మారింది. ఆ దేశ పౌరుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. 80వ దశకంలో సోవియెట్ దురాక్రమణను ఎదుర్కొనే నెపంతో పాకిస్తాన్ ద్వారా అఫ్గాన్‌లో మతమౌఢ్యం పెంచి అల్ కాయిదా, తాలిబన్ వంటివి ఏర్పడటానికి దోహదపడింది అమెరికాయే. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికల ద్వారా సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నం చేస్తే ఇంత చేటు ఉపద్రవం దాపురించేది కాదు. అక్కడ జోక్యం చేసుకోవటం ఎంత తప్పో, బాధ్యతారహితంగా నిష్క్రమించటం కూడా అంతే నేరం.

అమెరికా నిర్వాకానికి ఇప్పుడు రెండున్నర కోట్లమంది మహిళలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. మొదట్లో తమ పాలనకు అంతర్జాతీయ గుర్తింపు పొందటానికి మహిళలకు అన్ని రకాల హక్కులూ ఇస్తామని నమ్మబలికిన తాలిబన్‌లు ఇప్పుడు అన్ని రంగాల నుంచీ వారిని వెళ్లగొట్టారు. చదువులకు దూరం చేశారు. ట్రంప్ ఏలుబడినుంచీ వారిపై అమెరికాకు మంచి అభిప్రాయం కలగజేసిన పాకిస్తాన్‌కు సైతం వారిప్పుడు కొరకరాని కొయ్యలయ్యారు. అమెరికన్ కాంగ్రెస్ కమిటీ ముందు వెల్లడైన అభిప్రాయాలు, ఇప్పుడు అఫ్గాన్ మహిళలు అనుభవిస్తున్న నరక యాతనలు ఆ దేశం కళ్లు తెరిపించాలి. జవాబుదారీతనాన్నీ, బాధ్యతాయుత ప్రవర్తననూ అలవర్చాలి.

విధాన లోపం వ్యవస్థకు శాపం

విశ్లేషణ



డి. పాపారావు

2023 ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికానికి భారత ఆర్థిక వ్యవస్థ కేవలం 4.4 శాతం స్థూల జాతీయ వృద్ధి రేటును మాత్రమే సాధించగలిగింది. ప్రజల కొనుగోలు శక్తి దిగజారిపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ జీడీపీ పతనం భారత దేశానికి మాత్రమే పరిమితం కాదు. అమెరికా, జపాన్, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలలో అది 1 శాతానికి లోపు పరిమితమైంది. ఈ దేశాలన్నింటికీ ఉన్నటువంటి కీలక సారూప్యత – ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో ఉండడం. ఈ దేశాలన్నింటిలోనూ కార్మికులు, ఉద్యోగుల వేతనాల పెరుగుదల బలహీనంగా ఉంది. ప్రభుత్వ విధానాలు మెజారిటీ ప్రజానీకానికి నష్టం కలిగించేవిగా ఉండడం వలననే జీడీపీ దారుణంగా పతనమయ్యింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సర కాలానికి సంబంధించి డిసెంబర్ 2022తో ముగిసిన మూడవ త్రైమాసికానికి భారత ఆర్థిక వ్యవస్థ కేవలం 4.4 శాతం స్థూల జాతీయ వృద్ధి (జీడీపీ) రేటును మాత్రమే సాధించగలిగింది. అంతకు ముందరి త్రైమాసిక వృద్ధి రేటు 6.3 శాతం కంటే ఇది గణనీయమైన పతనం. 2022 ఆర్థిక సంవత్సరం తాలూకూ మూడవ త్రైమాసికంలోని 5.2 శాతం కంటే కూడా ఇది తక్కువ. ఈ జీడీపీ దిగజారుడు మన దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొంటున్న అనేక సమస్యలకు ప్రతిబింబం.

వృద్ధి రేటును లెక్కించేందుకు పరిగణనలోకి తీసుకునే అంశాలుగా వ్యక్తిగత వినియోగం, ప్రభుత్వ వినియోగం లేదా వ్యయాలు, పెట్టుబడులు, నికర ఎగుమతులు ఉంటాయి. వీటిలో వ్యక్తిగత వినియోగానిది అతిపెద్ద వాటా. అది దేశీయ జీడీపీలో 55 నుంచి 60 శాతం మేరకు వాటాని కలిగి ఉంటుంది. కాగా, ఇది ప్రస్తుతం అంతకు ముందరి మూడవ త్రైమాసికంలోని వృద్ధి రేటుతో పోలిస్తే కేవలం 2.1 శాతం మాత్రమే ఎదుగుదలను చూపింది. ప్రస్తుత జీడీపీ వృద్ధి రేటు పతనం వెనుక వ్యక్తిగత వినియోగ పతనం ఉందన్నది గమనించాల్సిన అంశం. ఈ వ్యక్తిగత వినియోగం తగ్గటం వెనుక అసమానతలతో కూడిన ఆర్థిక అభివృద్ధి ఉంది. దీనినే మనం ఆంగ్లాక్షరం 'కే' పై గీత, కింది గీతలతో పోలుస్తున్నాం. పై గీతను పోలిన ధనవంతులు మరింతగా ధనవంతులవుతుండగా, కింది గీతను పోలిన సామాన్య జనం మరింత కిందికి దిగజారుతున్నారు.

ఈ అసమానతల అభివృద్ధికి వక్కాణింపుగా – ఇండియా రేటింగ్స్ సంస్థ ఆర్థిక వేత్త సునీల్ కుమార్ సిన్హా మాటలను చెప్పుకోవచ్చు: 'ప్రస్తుత వినియోగ డిమాండ్ అనేది ప్రధానంగా ఉన్నత ఆర్థిక వర్గాలు వినియోగించే సరుకులు, సేవల నుంచే వస్తోంది. అంటే, ప్రస్తుతం దేశంలోని ప్రజల వ్యక్తిగత వినియోగంలో సింహభాగం – ఉన్నత ఆదాయ వర్గాల నుంచే వస్తోంది. మరో రకంగా చెప్పాలంటే – మెజారిటీ జన సామాన్యం కొనుగోళ్లు బలహీనంగా ఉన్నాయి. ఫలితంగా అంతిమ లెక్కింపులో దేశంలో వ్యక్తిగత వినియోగం బలహీనపడుతోంది'.

కోవిడ్ మహమ్మారి కాలంలో దేశంలో ప్రజల వినియోగం భారీగా పడిపోయింది. ఈ పరిస్థితి నుంచి ఉపశమనం లభించిన తొలి దశలో ఈ వ్యక్తిగత వినియోగం పెద్దగంతులో పెరిగింది. కోవిడ్, లాక్‌డౌన్ల కాలంలో ప్రజలు తమకు కావాల్సిన సరుకులు లేదా సేవల కొనుగోళ్లను వాయిదా వేసి ఉంచడం... కోవిడ్ బెడద తగ్గగానే ఒక్కసారిగా కొనుగోళ్లు చేయడం ఈ పెద్దగంతు వినియోగ పెరుగుదలకు కారణం. ఒక మారు ఈ తరహా కొనుగోళ్లు పూర్తయి పోగానే, మరలా వినియోగం తగ్గుముఖం పట్టసాగింది. కోవిడ్ అనంతర కాలంలో కూడా జటిలంగానే మిగిలి పోయిన నిరుద్యోగం, పడిపోతున్న దేశీయ ఎగుమతులు, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి సమస్యలన్నీ కలగలిసి ప్రజల కొనుగోలు శక్తి దిగజారింది. కోవిడ్, లాక్‌డౌన్ల, అనంతరం కూడా సామాన్య ప్రజానీకం పెద్ద ఎత్తున అప్పుల పాలయ్యారు. బంగారాన్ని తనఖా పెట్టడం భారీగా పెరిగింది. ఈ క్రమంలోనే సామాన్య ప్రజల పొదుపు స్థాయి దారుణంగా పడి పోయింది. కొత్తగా అప్పులు చేయగల స్థితి కూడా లేకుండా పోయింది.



జీడీపీ పతనం కేవలం భారత దేశానికి మాత్రమే పరిమితం కాదు. గడచిన ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో అమెరికా, జపాన్, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలలో అది 1 శాతానికి లోపు పరిమితమైంది. అంటే, భారతదేశంలో జీడీపి వృద్ధి, మిగత ప్రపంచం తాలూకూ సమస్యలతో సంబంధం లేకుండా, ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటుందనే కట్టుకథను ఇది వట్టిదిగా కొట్టేసింది. పైన పేర్కొన్న దేశాలన్నింటికీ ఉన్నటువంటి కీలక సారూప్యత – ఆయా దేశాలలో ఆర్థిక అసమానతలు అత్యంత తీవ్రస్థాయిలో ఉండడం. భారత్ సహా దరిదాపు ఈ దేశాలన్నింటిలోనూ కార్మికులు, ఉద్యోగుల వేతనాల పెరుగుదల బలహీనంగా ఉంది. ఉదాహరణకు, అంతర్జాతీయ కార్మిక సమాఖ్య గణాంకాల ప్రకారం 2008–11 కాలంలో మన దేశంలో నిజ వేతనాల పెరుగుదల 1 శాతం ప్రతికూల దిశగా ఉన్నది. అదే కాలంలో దేశంలో కార్మిక ఉత్పాదకత 7.6 శాతం పెరిగింది. పెరిగిన సంపద తాలూకు ప్రయోజనం కార్మికులు, ఉద్యోగులకు దక్కక పోగా, వారికి అప్పటికే ఉన్న ఆర్థిక స్థితి దిగజారింది.

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో జరుగుతోంది ఈ వేతనాల పతనమే. 2018 నాటి అంతర్జాతీయ కార్మిక సమాఖ్య తాలూకు ప్రపంచ వేతనాల నివేదిక కూడా ఈ అంశాన్నే చెబుతోంది. ఒక్క చైనా మినహా 2017లో ప్రపంచ వ్యాప్తంగా వేతనాల పెరుగుదల వార్షికంగా కేవలం 1.1 శాతం. జపాన్‌లో దశాబ్దాల కాలంపాటు ఉద్యోగులు, కార్మికుల వేతనాలు ఎదుగూ బొదుగూ లేకుండా స్తంభించిపోయి ఉన్నాయి. మొత్తంగా జీ 20 దేశాల్లో 2017లో నిజ వేతనాల వృద్ధి కేవలం 0.4 శాతం.

చైనాలో 2015 నాటికే సరుకు ఉత్పత్తి రంగంలోని కార్మికుల 1 గంట కాలపు వేతనాలు, అప్పటికే అధిక ఆదాయ దేశాలుగా ఉన్న గ్రీస్, పోర్చుగల్‌తో సమానంగా ఉన్నాయి. దాని వలన అక్కడ యావన్మంది ప్రజల కొనుగోలు శక్తి తగినస్థాయిలో ఉంది. ఫలితంగానే 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం అనంతరం తన దేశీయ ఎగుమతులు కొంత మేర తగ్గినా, స్వయంగా తన దేశంలోనే పెరిగిన ప్రజల కొనుగోలు శక్తి ద్వారా, ఆర్థిక వృద్ధిని కొనసాగించగలిగింది. ప్రస్తుతం తన జీరో కోవిడ్ పాలసీ, నిర్మాణ రంగం పట్ల కఠిన వైఖరి తరువాత కూడా చైనాలో కర్మాగారాల ఉత్పత్తి రికార్డు స్థాయిని అందుకుంది. దీనంతటికీ కారణం, కొనుగోలు శక్తి ప్రజానీకం అంతటిలోనూ విస్తారంగా పెరిగి ఉండడమే.

మన దేశంలో నేడు సంస్కరణల పేరిట అమలు జరుగుతోన్న విధానాలు పొదుపు చర్యల రూపంలో ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయి. ఈ పొదుపు చర్యల వల్ల ప్రతీ సంవత్సరం సంక్షేమ కార్యక్రమాలపై కోతలు పడుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కూడా ఆహారం, ఎరువులు, ఇంధన సబ్సిడీలు, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి అనేక సంక్షేమ విధానాలపై కోతలు పడడం చూశాం. ఈ పొదుపు చర్యలలో భాగంగానే దేశంలో ప్రభుత్వ ఉద్యోగాల కల్పన గణనీయంగా తగ్గిపోయింది. 2022లోనే దీనిలో 8.8 శాతం తగ్గుదల నమోదైంది. దీనంతటి ఫలితంగా ప్రజల ఉపాధి అవకాశాలు, కొనుగోలు శక్తి వేగంగా పడిపోతున్నాయి. దశాబ్దాల కాలం ప్రజల పన్నుల డబ్బు, శ్రమలతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలు వేగంగా ప్రైవేటు పరం అవుతుండడం... దేశంలోని రోడ్లు, రైలు మార్గాలు, స్టేడియాలు ఇత్యాది సమస్త మౌలిక సదుపాయాల వ్యవస్థలూ నగదీకరణ పేరిట ప్రైవేట్ పరం అవుతుండడంతో – ప్రజల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఆదాయాన్ని పెంచుకునే పేరిట (ద్రవ్యలోటు తగ్గింపు కోసం) నిత్యావసరాల పైన కూడా జీఎస్టీ వంటి పన్ను భారాలను మోపడం ప్రజల కొనుగోలు శక్తి పాలిట అశనిపాతంగా మారుతోంది.

ప్రభుత్వ విధానాలు కూర్చున్న కొమ్మను నరుక్కున్న విధంగా, మెజారిటీ ప్రజానీకానికి నష్టం కలిగించేవిగా ఉండడం వలననే జీడీపీ దారుణంగా పతనమయ్యింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు మార్గం – ఇప్పటి వరకూ జరిగినట్లుగా కార్పొరేట్లకు మరిన్ని రాయితీలు ఇస్తూపోయి, జన సామాన్యంపై భారాలు మోపుతూ నిర్ణయాలు తీసుకోవడం కాదు. సంపదలో సాధ్యమైనంతగా కార్మికులు, ఉద్యోగులు, మధ్య తరగతి జనాలకు తగిన వాటాను కల్పించడం! ప్రస్తుత వృద్ధి రేటు పతనం, దానికి మూలంగా ఉన్న ప్రజల కొనుగోలు శక్తి పతనం వంటి వాటిని పరిష్కరించలేని పక్షంలో మున్ముందు దేశ ఆర్థిక సమస్యలు మరింత జటిలం కాగలవు.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇవి చాలు...



హ్యాపీ విమెన్స్ డే అని మాకు చెప్పే బదులుగా – మమ్మల్ని ఉద్యోగాల్లోకి తీసుకోండి. వేతనాలు చెల్లించండి. మేము రాసేది చదవండి. మమ్మల్ని ఉటంకించండి. మా గొంతులను వినండి. మా చదువులకు ప్రతిబంధకాలు సృష్టించకండి. మమ్మల్ని గర్భంలోనే చంపకండి.

– నికితా సూద్, ప్రొఫెసర్

నియంత్రణలు



రంజాన్ నేపథ్యంలో సౌదీ అరేబియాలో బిన్ సల్మాన్ కొన్ని నియంత్రణలు తెచ్చారు. లౌడ్ స్పీకర్లు వాడొద్దు. ప్రార్థనలను బ్రాడ్‌కాస్ట్ చేయొద్దు. విరాళాలు సేకరించొద్దు. మసీదుల్లో పిల్లలు ఉండొద్దు. మసీదు లోపల ఇఫ్తార్ పార్టీలు ఏర్పాటు చేయొద్దు.

– సమీ హమ్దీ, కామెంటేటర్

నేర్పాల్సిన విషయాలు



రాజనీతి శాస్త్రంలో కనీసం ఆరు నెలల కోర్సుతో కూడా మన పాలకులు లబ్ధి పొందుతారు. ఎన్నికైన ప్రతినిధులు అందరి ప్రయోజనాలకూ ప్రాతినిధ్యం వహిస్తారనీ; ప్రభుత్వం అనేది దేశం కాదు, సంరక్షకురాలనీ; పౌరులకు హక్కులు, ప్రభుత్వానికి బాధ్యతలుంటాయనీ; రాజ్యాంగమే పరమం అనీ వాళ్లు నేర్చుకుంటారు.

నీరా చాందోక్, ప్రొఫెసర్

అప్పుడేనా?



ఆత్మీయత, ప్రేమ, నవ్వులు కలిసిన మనిషి సతీశ్ కౌశిక్ (నట దర్శకుడు). కనీసం నలభై ఏళ్లుగా నాకు సోదరుడిలా ఉన్నాడు. నాకంటే పన్నెండేళ్లు చిన్నవాడు. సతీశ్ జీ, మీ టర్న్ ఇది కానే కాదు.

– జావేద్ అఖ్తర్, సినిమా రచయిత

అనవచ్చా?



'ముందు బొట్టు పెట్టుకో. నీ భర్త బతికే ఉన్నాడు. అవునా? నీకు ఇంగితం లేదా?' అని ఒక కూరగాయలు అమ్ముకునే మహిళ మీద కోలార్ బీజేపీ ఎంపీ ఎస్. మునిస్వామి అరుస్తున్నారు.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

మోదుగుపువ్వు!

ఎక్కడ చూసినా నీ దృశ్యం
నన్ను ఆకట్టుకుంటుంది
ఎప్పటి లాగే నన్ను నీ వైపు
బిగుసన్న లాగుతుంది
ఒక్కసారి నిన్ను తాకాలని
నా మునివేళ్ల ఆరాటం...

ఎందుకో గాని
ఈసారి మోదుగు పువ్వు
చిన్నబోయినట్టుగా ఉంది
కేరింతలు కొట్ట
కొత్తతరం ఉరకలేస్త లేదు
ఆత్మహత్యలతోనే ఆశయాల
అలంబనను వదులుకుంటున్న చోట
ఈ మోదుగుపువ్వులు చిన్నబోయినాయి.

మోడువారిన చెట్టుకు కొత్త పుంతలు
తొక్కిన మోదుగుపువ్వు
జీవితానికి ఒక ఆశను
ఒక కొత్త బాటను చూపుతుంది



ఇప్పుడు
ఆ మోదుగుపువ్వు
వాలిపోతుంది
వచ్చే తరాన్ని తల్చుకొని
(ఆత్మ)హత్యలు
కుట్ర కేసులు
ఎన్ని ఛేదించుకొని
అది ఒక
వర్ణాన్ని అందుకుందో

నిన్నటికి – నేటికీ
రేపటి నవతరానికి ఒక
పూదోటయి వికసిస్తుంది
జీవితానికి మార్గమై!

– వంగల సంతోష్
ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక
(యువత ఆత్మహత్యల నేపథ్యంలో...)

ఆరోగ్యానికి 'నీరా'జనం!

సందర్భం



పున్నా కృష్ణమూర్తి

మార్చి 19వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సూర్యాపేట జిల్లా మునగాల మండలం 'కలకోవ' గ్రామం వేదికగా ఒక అపూర్వ మైన కార్యక్రమం జరిగింది. ఆహార సంస్కృతి గురించి ఆరోగ్య పానీయాల గురించి ముచ్చటించి ఆవశ్యకమైన, ఆచరణ సాధ్యమైన అంశాలను ప్రభుత్వాల, ప్రజల దృష్టికి తీసుకురావాలని గ్రామ సర్పంచ్ వీరబాబు గౌడ్ – సుజాత దంపతులు... కవులు, కళాకారులు, జర్నలిస్టులను ఆహ్వానించారు. కొంపల్లి వెంకట్ గౌడ్ ఈ కార్యక్రమానికి ప్రేరణ. కలకోవ గీత కార్మికులు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి సూర్యకిరణాలు సోకని 'నీరా'ను తాటి చెట్లపై నుంచి దింపుతుండగా గ్రామంలోని బహుజనులందరూ... స్థానిక ఆహార సంస్కృతిలో భాగమైన శాకాహార, మాంసాహార వంటలను సమకూర్చారు. వందలాది తాటి– ఈత చెట్ల మధ్య చల్లని పందిళ్లలో కలకోవ జాన పదుల ఆటపాటల సంబరాల నేపథ్యంలో గోరటి వెంకన్న, కార్టూనిస్ట్ శంకర్ తదితరులు నీరా సేవనంతో మాటా మాటా కలిపారు. ఆ సంభాషణలలో అంశాలు క్లుప్తంగా...

మహాత్మాగాంధీ నీరాపై ప్రయోగాలు చేశారు. విదేశీ వస్తువుల స్థానంలో స్వదేశీ వస్తువులను వాడాలనే ప్రయత్నంలో భాగంగా నీరా భారతీయ హెల్త్ డ్రింక్‌గా ప్రోత్స హించతగినది అని వివిధ రాష్ట్రాలలో జరిగిన గ్రామీణ పారిశ్రామిక ప్రదర్శనలలో ఉపన్యసించారు. కొందరు నిపుణులను ఆహ్వానించి వారికి రుచి చూడవలసినదిగా నీరాను ఇచ్చారు. అతిథులు వచ్చేసరికే ఎండ పెరిగి పరీక్షలలో 6–7 శాతం ఆల్కహాల్ ఉన్నదని రుజువు కావడంతో 'నీరాను నీరాగా అందచేయడం' అప్పటి పరిస్థితులకు సాధ్యంకాదని నిర్ధారించుకున్నారు.

సంపూర్ణ మద్యనిషేధాన్ని గాంధీజీ ప్రతిపాదించినపుడు జొరాస్ట్రియన్లు వ్యతిరేకించారు. తమ సంస్కృతిలో 'హోమ్మ' దివ్యమైనదని, సంతాన వృద్ధి, దీర్ఘాయుష్షును ప్రసాదిస్తుందని స్వర్గంలోని పవిత్రపర్వతం నుంచి దేవతపక్షులు భూమిపైకి ఖర్జూర వృక్షాలను తెచ్చాయని తాము విశ్వసిస్తామని గాంధీతో అన్నారు. జొరాస్ట్రియన్ల ప్రాచీన భాష అవేస్తా సంస్కృతం అక్కాచెల్లెళ్ల వంటివని భాషాశాస్త్రం చెబుతుంది. హోమ్మ – సోమ పర్యాయపదాలు. సోమ రసం గురించి వేదాలు, రామాయణ, భారత, భాగవతాలలో ప్రస్తావనలున్నాయి.

ఖాదీ – గ్రామీణ పరిశ్రమల కమిషన్ నీరా ఉత్పత్తిని సూత్రబద్ధంగా ప్రోత్సహిస్తున్నది. పామ్ కుటుంబంలో భాగమైన ఈత, తాటి, ఖర్జూర, కొబ్బరి చెట్లనుంచి ఉత్పత్తి అయ్యే నీరాను కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ప్రోత్సహిస్తున్నాయి. సంబంధిత సంస్థలనూ ఏర్పాటు చేశాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నీరా కేఫ్ లను అందుబాటులోకి తెస్తున్నది. ఈ సందర్భంలో ఆహార సంస్కృతి – ఆరోగ్య పానీయం – గ్రామీణ పరిశ్రమల వికాసం... దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశాలు. నీరాతో పోటీ పడగల హెల్త్ డ్రింక్ లేదని అంతర్జాతీయ, జాతీయ పరిశోధనా సంస్థలు నివేదికలు ఇచ్చాయి. సోడాలు – శీతల పానీయాలు – ఎనర్జీ డ్రింక్‌లకు మెరుగైన ప్రత్యామ్నాయం నీరా అని అమెరికా నుంచి వెలువడే 'బయో మెడికల్ జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ రీసెర్చ్'లోని ఒక పరిశోధన పత్రం వెల్లడించింది.

సాయంత్రం వీడ్కోలు సమయంలో నిర్వాహకులు రెండు తాటి చెట్లకు ఇద్దరు ప్రముఖుల పేర్లు పెట్టారు. ఒకటి వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, మరొకటి కార్టూనిస్ట్ శంకర్ పామర్తి. ఇటువంటి మరెన్నో కార్యక్రమాలు ఆరోగ్యదాయని నీరా పట్ల ఉన్న అపోహలు తొలగిస్తాయనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త ఇండిపెండెంట్ జర్నలిస్ట్
మొబైల్: 76809 50863

అంతిమంగా రైతులే బాధితులు!

విశ్లేషణ



సారంపల్లి మల్లారెడ్డి

2022–23 యాసంగిలో తెలంగాణ రాష్ట్రంలో 56.20 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. దిగుబడి 125 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ ధాన్యం కొనుగోలుకు ఐకేపీ సెంటర్ ద్వారా కొనుగోలు కేంద్రాలు తెరిచి రైతులకు కనీస మద్దతు ధరలు ఇప్పిస్తామని వ్యవసాయ శాఖ మంత్రితోపాటు ముఖ్యమంత్రి కూడా ప్రకటించారు. ఇదే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని యాసంగి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ ప్రకటనతో హర్షం వెలిబుచ్చిన రైతులకు కేంద్రం చేసిన మరో ప్రకటన ఆందోళనకు గురిచేస్తోంది. తెలంగాణలో యాసంగి ధాన్యం సేకరణ సందర్భంగా 'బాయిల్డ్ రైస్' కొనుగోలు చేయం అనీ, 'ముడి బియ్యం' మాత్రమే కొనుగోలు చేస్తామనీ కేంద్రం బాంబు పేల్చింది. దీనితో మిల్లర్లు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఒక దశలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలంగాణ నుండి 30 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ కొనుగోలు చేస్తామని ప్రకటించారు. కానీ ప్రస్తుతం బాయిల్డ్ రైస్ కొనం అని కేంద్రం ప్రకటించడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే. కేరళ, బంగ్లాదేశ్, తమిళనాడు, శ్రీలంక తదితర ప్రాంతాలకు ఎగుమతులకు అవకాశం ఉంది. వారు ముఖ్యంగా బాయిల్డ్ రైస్‌నే అన్ని ఆహార పదార్థాల్లో వాడుతారు. బియ్యంగానే కాక, పిండిగా మార్చి కూడా వ్యాపారులు ఎగుమతులు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం బాయిల్డ్ రైస్‌ను కొనం అని చెప్పడం రాష్ట్ర ప్రభుత్వాన్నీ, రైతులనూ ఇబ్బందుల పాలు చేయడమే తప్ప మరొకటి కాదు.

దేశంలో మొత్తం యాసంగి పంట 114.23 లక్షల ఎకరాల్లో వేశారు. ఇందులో 56.20 లక్షలు తెలంగాణలో వేయగా, 58.03 లక్షల ఎకరాల్లో మాత్రమే మిగిలిన అన్ని రాష్ట్రాల్లో వేశారు. 2022 వానాకాలం 948.45 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి వేశారు. అంతకు ముందు ఏడాది 1,012 లక్ష ఎకరాల్లో వరి పంట వేశారు. వానాకాలం దాదాపు 60 లక్షల ఎకరాల్లో పంట విస్తీర్ణం తగ్గింది. దానితో దేశంలో బియ్యం ఉత్పత్తి కూడా 1.05 కోట్ల టన్నులు తగ్గింది. ఈ తగ్గుదలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం బియ్యం, నూకల ఎగుమతులను నిషేధించింది. కాలం కలిసివచ్చి యాసంగిలో గత సంవత్సరం (86.50 లక్షల ఎకరాలు) కన్నా అదనంగా (114.23 లక్షల ఎకరాలు) సాగై వరి ఉత్పత్తిలో వానాకాలం వచ్చిన నష్టం చాలా వరకు పూడింది. అందులో తెలంగాణలో వానాకాలం 64.54 లక్షల



ఎకరాలు, యాసంగి 56.20 లక్షల ఎకరాలు సాగు అయ్యింది. దీనితో తిరిగి ఎగుమతులు ప్రారంభించే దశకు చేరుకున్నాం. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుండి 'బాయిల్డ్ రైస్' కొనుగోలు చేయం అని కండీషన్ పెట్టడం శోచనీయం.

వానాకాలం క్వింటాల్ వరి ధాన్యాన్ని మిల్లు ఆడిస్తే 67–68 కిలోల బియ్యం వస్తాయి. వాతావరణం చల్లగా ఉండడం వల్ల నూక 4 శాతానికి మించిరాదు. కానీ, యాసంగిలో క్వింటాల్ ధాన్యానికి 55–60 కిలోలు మాత్రమే ముడి బియ్యం వస్తాయి. అదే బాయిల్డ్‌రైస్‌గా చేస్తే క్వింటాల్‌కు 68 కిలోల బియ్యం వస్తాయి. ముడి బియ్యం తీయగా 8 నుండి 10 కిలోలు నూకలు వస్తాయి. నూకలకు మార్కెట్‌లో తక్కువ ధర ఉంటుంది. ధర తగ్గడం వల్ల క్వింటాలు బియ్యానికి రూ. 250 నుండి 300 రూపాయల వరకు నష్టం వస్తుంది. అందువల్ల మిల్లర్లు యాసంగి ముడి బియ్యం చేయడానికి సుముఖత చూపరు. పైగా గతంలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మిల్లర్లు వేల కోట్లు వెచ్చించి ముడి బియ్యం తీసే మిల్లులను బాయిల్డ్ రైస్‌గా మార్పు చేశారు. ఇప్పుడు బాయిల్డ్ రైస్ అవసరం లేదనుకుంటే వేల కోట్లు ఖర్చుపెట్టి అప్‌గ్రేడ్ చేసిన మిల్లులు వృథాగా ఉండిపోతాయి. మిల్లర్లు నష్టపోతారు.

రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదించి ఏ ప్రాంతంలో వానాకాలం, యాసంగిల్లో ఏఏ పంటలు వేయాలో, వరి పంట ఎంత వేయాలో దిశా నిర్దేశం చేయాలి. అలాంటి ప్రణాళికలు వ్యవసాయరంగంలో కేంద్రానికి కానీ, రాష్ట్రానికి కానీ ఏమీ లేవు. అవి ఉంటే రైతుల పరిస్థితి ఇంత అగమ్యగోచరంగా ఉండేది కాదు.

ఆహార ధాన్యాల ఎగుమతులు ముఖ్యంగా ముడి బియ్యం, బాయిల్డ్‌రైస్ ఎగుమతులు కార్పొరేట్ సంస్థలు చేస్తున్నాయి. వారు కనీస మద్దతు ధరలు మరింత తగ్గించడానికి చేసే ప్రయత్నంలో భాగమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వైషమ్యాల సృష్టి. పంటల కాలంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి, తరువాత అత్యధిక ధరలు పెంచి అమ్ముతున్నారు. ఎఫ్‌సీఐ కొనుగోలు రేటుకు, మార్కెట్‌లో బియ్యం అమ్మకం రేటుకు కిలోకు రూ. 18.20లు తేడా ఉంది. లాభాల కోసం దళారీలు, ప్రభుత్వాలు ఆడుతున్న నాటకంలో రైతులు, మిల్లర్లు సమిధలౌతున్నారు.

తెలంగాణలో యాసంగి వడ్లను పూర్తిగా కొనుగోలు చేయడంతోపాటు మిల్లర్ల నుండి ఎఫ్‌సీఐ సగం బాయిల్డ్ రైస్, సగం ముడి బియ్యం సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించాలి. గతంలో ఈ విధమైన వ్యాపారం సాగింది. దానినే కొనసాగించాలి. రైతుల పెట్టుబడికి నష్టం రాకుండా చూడాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు
మొబైల్: 94900 98666

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.తదియ రా.8.25 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: చిత్త తె.5.58 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి స్వాతి, వర్జ్యం ప.1.27 నుండి 3.06 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.37 నుండి 9.14 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.22 వరకు, అమృతఘడియలు: రా.11.21 నుండి 1.02 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.17, సూర్యాస్తమయం: 6.04

'జెనిసిస్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ బీఆర్ఎస్' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం కేసీఆర్, జూలూరు, నరసింహారావు

సాక్షి, హైదరాబాద్: జాతీయ రాజకీయాలపై సీఎం కేసీఆర్ అయిదేళ్లుగా చేసిన మేధోమథనానికి దర్పణంగా రూపొందించిన 'జెనిసిస్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)' తొలి ఆంగ్ల పుస్తకాన్ని గురువారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు రచించిన ఈ పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ప్రచురించారు. ఈ సందర్భంగా రచయితను, ప్రచురణకర్తను కేసీఆర్ అభినందించారు. వివిధ సందర్భాలలో, వివిధ వేదికల మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా సీఎం కేసీఆర్ చేసిన జాతీయ రాజకీయాల ప్రస్తావన దరిమిలా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి 2023 ఫిబ్రవరి 5న నాందేడ్‌లో జరిగిన బీఆర్ఎస్ సభ వరకు 35 వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

42 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసులు ఒక్కసారిగా పెరిగాయి. గురువారం ఏకంగా 42 మంది కరోనా బారినపడ్డారు. రాష్ట్రంలో జ్వరాలు, ఇన్‌ఫ్లూయెంజా కేసులు పెరగటం తదితర కారణాలతో కరోనా కూడా పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి.

కుటుంబ పాలనే బీఆర్ఎస్ మోడల్!

- 'కరీంనగర్ కవాతు' బహిరంగ సభలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్
- తెలంగాణలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవు
- కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు వచ్చాయి
- తాము రైతులకు మద్దతు ధర, పంట మార్పిడికి ప్రోత్సాహం ఇస్తున్నామని వెల్లడి
- తెలంగాణలో ఛత్తీస్‌గఢ్ మోడల్ అమలు చేస్తాం: రేవంత్‌రెడ్డి
- రాష్ట్రాన్ని హేళన చేసిన మోదీకి ఓట్లెందుకు వేయాలని నిలదీత
- కేసీఆర్ నిజాంను తలపిస్తున్నారు: జైరాం రమేశ్
- కాంగ్రెస్‌తోనే బడుగుల అభ్యున్నతి: మాణిక్‌రావ్ ఠాక్రే



బహిరంగసభలో ప్రసంగిస్తున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భాగేల్. వేదికపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి, జైరాం రమేశ్, జీవన్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ''తెలంగాణ వచ్చినా రైతులు, నిరుద్యోగులకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లభించలేదు. కానీ కేసీఆర్ కుటుంబంలోని కేటీఆర్, హరీశ్‌రావు, లిక్కర్ క్వీన్ కవితకు ఉద్యోగాలు వచ్చాయి..'' అని ఛత్తీస్‌గఢ్ సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ భాగేల్ మండిపడ్డారు. దేశ సంపద అంతా ఒకరిద్దరి చేతుల్లోకి వెళ్లిందని.. అది బీజేపీ గుజరాత్ మోడల్ అని.. అదే తెలంగాణలో కుటుంబ పాలన బీఆర్ఎస్ మోడల్ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర కరీంనగర్‌కు చేరుకున్న సందర్భంగా.. గురువారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో 'కరీంనగర్ కవాతు' పేరిట బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ జైరాం రమేశ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, సిరిసిల్ల రాజయ్య, వీహెచ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో భూపేశ్ భాగెల్ ప్రసంగిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో రైతుల ధాన్యానికి మద్దతు ధర రూ.2,640, నిరుద్యోగ భృతి కింద రూ.2,500, పంటమార్పిడికి రూ.9,000, పేడ కిలోకి రూ.2తోపాటు గోమూత్రానికి కూడా డబ్బులు చెల్లిస్తూ.. గ్రామీణుల జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌ను గెలిపించాలని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌ను అమలు చేద్దామని పిలుపునిచ్చారు.

రైతులు, నిరుద్యోగులకు పెద్దపీట: రేవంత్

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఛత్తీస్‌గఢ్ మోడల్‌తో రైతులకు, నిరుద్యోగులకు పెద్దపీట వేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. ''తెలంగాణ రాష్ట్రం ఇస్తే రాజకీయంగా ఏపీలో నష్టపోతామని తెలిసినా.. మాటకు కట్టుబడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. కానీ నీళ్లు, నిధులు, నియామకాల పేరిట తెలంగాణలో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ రైతులు, యువతను దగా చేశారు. కరీంనగర్ నుంచి కేసీఆర్, బి.వినోద్, బండి సంజయ్‌లు ఎంపీలుగా గెలిచి ఏం సాధించారు? అదే 2009లో పొన్నం ప్రభాకర్‌ను ఒక్కసారి ఎంపీగా గెలిపిస్తే.. తెలంగాణ తెచ్చి చూపించారు. తెలంగాణ బిల్లు పెట్టిన రోజున సమైక్యవాదులు స్పీకర్ కళ్లలో కారం కొట్టి బిల్లును ఆపాలని చూసినా.. జైపాల్‌రెడ్డి వ్యూహం, తెలంగాణ ఎంపీల తెగువతో బిల్లు ఆమోదం పొందింది. కానీ తల్లిని చంపి, బిడ్డను బతికించారంటూ ప్రధాని మోదీ తెలంగాణ ఆవిర్భావాన్ని అవహేళన చేశారు. ఆయనకు ఎలా ఓటేస్తారు?'' అని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ మనుగడ కోసం విభజన చట్టంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఐటీఐఆర్ ప్రాజెక్టు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ, ఐఐటీ వంటివాటిని చేర్చితే.. అవేవీ అమలుకు నోచుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ 3 వేల వైన్‌షాపులు, 60వేల బెల్టుల షాపులతో తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. మోసపూరిత గుజరాత్ మోడల్ కావాలో, తాగుబోతుల తెలంగాణ మోడల్ కావాలో, రైతులు-యువత అభ్యున్నతికి ఛత్తీస్‌గఢ్ మోడల్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు.

బలహీన వర్గాల కోసమే తెలంగాణ: మాణిక్‌రావ్ ఠాక్రే

ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, బీసీల అభ్యున్నతి కోసమే సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, కానీ గత 8 ఏళ్లలో ఈ ఆకాంక్షలేవీ నెరవేరలేదని మాణిక్‌రావు ఠాక్రే పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు పెరిగాయని ఆరోపించారు.

కేసీఆర్‌ను ఓడించాలి: జైరాం రమేశ్

ఛత్తీస్‌గఢ్ మోడల్‌లో రైతుల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని.. దానిని తెలంగాణలో అమలు చేయాలని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ''కేసీఆర్ నిజాంలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో'' అని పిలుపునిచ్చారు.

ఆదిశంకరాచార్య తర్వాత రాహులే: ఉత్తమ్

ఆది శంకరాచార్య తర్వాత దేశమంతా తిరిగిన వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. విద్వేషాన్ని విడిచి దేశ సమైక్యతను కాపాడాలని రాహుల్ సందేశం ఇచ్చారన్నారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

సామాజిక తెలంగాణ ఏర్పడలేదు: భట్టి

ప్రజలు కోరుకున్న సామాజిక తెలంగాణ ఏర్పడలేదని, ప్రాణహితకు అంబేద్కర్ పేరును తొలగించారని భట్టి విక్రమార్క చెప్పారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేకపోయారని, కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల నీటితోనే పంటలు పండుతున్నాయని పేర్కొన్నారు. భూమి లేని నిరుపేదలకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.7 వేలు ఇస్తోందని.. కానీ ఇక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ ఇవ్వడంలేదని విమర్శించారు.

జయరాం హత్య కేసులో రాకేశ్‌రెడ్డికి జీవితఖైదు



రాకేష్‌రెడ్డి(ఫైల్)

బంజారాహిల్స్: ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రవాసాంధ్రుడు, ఎక్స్‌ప్రెస్ టీవీ అధినేత చిగురుపాటి జయరాం హత్య కేసులో దోషి అయిన రాకేశ్‌రెడ్డికి నాంపల్లిలోని మొదటి అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం గురువారం జీవితఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించింది. న్యాయస్థానం ఇటీవలనే అతడిని దోషిగా నిర్ధారించింది. 2019 జనవరి 31వ తేదీన రాకేశ్‌రెడ్డి హనీట్రాప్ చేసి జయరాంను తన ఇంటికి రప్పించి హత్య చేశాడు. మృతదేహాన్ని కృష్ణా జిల్లా నందిగామ సమీపంలో ఐతవరం వద్ద పడేసి జారుకున్నాడు. ఈ కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు కీలక సమాచారాన్ని, ఆధారాలను సేకరించి నిందితుడిపై 23 పేజీల చార్జిషీట్ దాఖలు చేసి 73 మంది సాక్ష్యులను విచారించారు. కేసులో 12 మందిని నిందితులుగా చేర్చగా 11 మందిని నిర్దోషులుగా ప్రకటించారు. జయరాంను దారుణంగా హత్య చేసినట్లు అప్పటి బంజారాహిల్స్ ఏసీపీ, ఈ కేసు దర్యాప్తు అధికారి కేఎస్ రావు పక్కా ఆధారాలతో చార్జీషీట్ దాఖలు చేశారు. సాంకేతిక ఆధారాలు ఈ కేసులో కీలకంగా మారడంతో నిందితుడికి శిక్ష పడింది. రాకేశ్‌రెడ్డిపై మొత్తం ఎనిమిది సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా ఇందులో మూడు సెక్షన్ల కింద తీర్పునిచ్చారు. ఐపీసీ సెక్షన్ 347 కింద మూడేళ్ల జైలు, సెక్షన్ 302 కింద జీవిత ఖైదు, సెక్షన్ 201 కింద ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. రెండేళ్లపాటు ట్రయల్ జరగగా, తప్పించుకోవడానికి రాకేశ్‌రెడ్డి పెద్ద ఎత్తున ప్రయత్నించాడు. అయితే తప్పు చేసినవారికి శిక్ష తప్పదని ఈ తీర్పు నిరూపించినట్లయింది. గత నాలుగేళ్లుగా రాకేశ్‌రెడ్డి జైలులోనే ఉన్నాడు. ఆయన ప్రవర్తనతో కోర్టు కొద్ది రోజులపాటు మానసిక వైద్యాలయానికీ తరలించింది. కాగా, రాకేశ్‌రెడ్డి ఈ కేసును వాదిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తోపాటు ఇతర ప్రాసిక్యూటర్లపై వేధింపులకు పాల్పడి పోలీసులకు చిక్కాడు. నాలుగేళ్ల పాటు విచారణ జరగగా చివరికి రాకేశ్‌రెడ్డికి జీవితఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

క్లుప్తంగా...


జడ్జినే బెదిరించాడు!

జైపూర్: మార్ఫ్‌డ్ ఫొటోలను పంపి రూ.20 లక్షలివ్వకుంటే వాటిని బయటపెడతామంటూ మహిళా జడ్జిని బెదిరించిన ఘటన రాజస్తాన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆగంతకుడి కోసం పోలీసులు వేట ప్రారంభించారు. రాష్ట్రానికి చెందిన ఓ మహిళా జడ్జికి ఫిబ్రవరి 7న ఒక పార్సిల్ వచ్చింది. జడ్జి పిల్లలు చదివే స్కూలు నుంచి వచ్చిందంటూ ఓ అగంతకుడు పార్సిల్‌ను కోర్టు స్టెనోగ్రాఫర్‌కు ఇచ్చాడు. పేరు అడగ్గా చెప్పకుండానే వెళ్లిపోయాడు. ఆ పార్సిల్‌లో కొన్ని స్వీట్లతోపాటు అభ్యంతరకరంగా ఉన్న జడ్జి ఫొటోలు కనిపించాయి. రూ.20 లక్షలు ఇవ్వకుంటే ఆ ఫొటోలను ఆన్‌లైన్‌లో పెట్టి పరువు తీస్తాననే హెచ్చరికతో కూడిన ఉత్తరం ఉంది. జడ్జి చాంబర్‌లోని సీసీ కెమెరాలో ఓ 20 ఏళ్ల యువకుడు పార్సిల్ తెచ్చినట్లుగా రికార్డయింది. మరో 20 రోజుల తర్వాత జడ్జి ఇంటికి మళ్లీ ఒక పార్సిల్ వచ్చింది. 'రూ.20 లక్షలు సిద్ధంగా ఉంచు. సమయం, ప్రాంతం త్వరలోనే చెబుతా'అంటూ లేఖ ఉంది. బాధిత న్యాయమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు ఫిబ్రవరి 28వ తేదీన కేసు నమోదు చేశారు. ఆగంతకుడిని గుర్తించామని, అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

భారత సంతతి ప్రొఫెసర్‌పై
అమెరికాలో జాతి వివక్ష!



న్యూయార్క్: అమెరికాలో భారత సంతతికి చెందిన లక్ష్మీ బాలచంద్ర అనే అసోసియేట్ ప్రొఫెసర్ మసాచుసెట్స్‌లో తాను పని చేస్తున్న బాబ్సన్ కాలేజీపై జాతి, లింగ వివక్ష ఆరోపణలు చేశారు. వీటి కారణంగా కెరీర్ అవకాశాలను కోల్పోయానంటూ కాలేజీపై కేసు కూడా పెట్టారు. అంతేగాక ఆర్థిక నష్టానికి, మానసిక కుంగుబాటుకు లోనయ్యానంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''కాలేజీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డివిజన్‌కు సారథ్యం వహించిన ప్రొఫెసర్ ఆండ్రూ కార్బెట్ ఇందుకు ప్రధాన బాధ్యుడు. దీన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా విచారించి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. బాబ్సన్ కాలేజీ శ్వేత జాతీయులకు, అందులోనూ పురుషులకు మాత్రమే పెద్దపీట వేస్తుంది. వారికే ప్రివిలేజీలన్నీ కల్పిస్తుంది'' అని ఆరోపించారు. ఆమె 2012 నుంచి కాలేజీలో పని చేస్తున్నారు. ఇలాంటి ఆరోపణలను తాము చాలా సీరియస్‌గా తీసుకుంటామని కాలేజీ ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిపై విచారణ జరిపి తప్పిదాలను సరిదిద్దేందుకు పకడ్బందీ వ్యవస్థ అమల్లో ఉందని చెప్పుకొచ్చింది.



60 ఏళ్ల వయసు పైబడిన వారిలో కోటిమందికిపైగా బాధితులు

డిమెన్షియా డేంజర్ బెల్స్

డిమెన్షియా. మన దేశాన్ని కొత్తగా ఈ వ్యాధి పట్టిపీడిస్తోంది. వాస్తవానికి దీనిని పూర్తిగా వ్యాధి అని కూడా అనలేం. ఇదొక మానసిక స్థితి. వయసు మీద పడిన వారిలో డిమెన్షియా లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఆలోచనలు లేకుండా స్తబ్దుగా ఉండిపోవడం, రీజనింగ్ కోల్పోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి మానసిక సమస్యలు ఎవరిలోనైనా కనిపిస్తే దానిని డిమెన్షియా అని పిలుస్తారు. ఈ డిమెన్షియా కేసులపై మొట్టమొదటిసారిగా మన దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఒక అధ్యయనం నిర్వహించారు. అంతర్జాతీయ బృందం భారత్‌లో 31,477 మంది వృద్ధులకి సెమీ సూపర్‌వైజ్‌డ్ మిషన్ సహకారంతో పరీక్షలు నిర్వహించి ఈ అధ్యయనం చేపట్టింది. యూకేలో యూనివర్సిటీ ఆఫ్ సర్రే, అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్, న్యూఢిల్లీలో ఎయిమ్స్‌కు చెందిన పరిశోధనకారులు కృత్రిమ మేధ సహకారంతో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ అధ్యయనంలో అమెరికా, యూకే, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలతో సరిసమానమైన డిమెన్షియా కేసులు భారత్‌లో కూడా బయటపడడం ఆందోళనకరంగా మారింది. దీనికి సంబంధించిన నివేదికను న్యూరో ఎపిడిమాలజీ జర్నల్ ప్రచురించింది. దేశంలో 60 ఏళ్ల కంటే పైబడినవారిలో 8.44% మంది అంటే కోటి 8 లక్షల మంది డిమెన్షియాతో బాధపడుతున్నట్టు ఆ అధ్యయనంలో వెల్లడైంది. 2050 నాటికి డిమెన్షియా కేసులు దేశంలో విపరీతంగా పెరిగిపోతాయని, ఆ సమయానికి దేశ జనాభాలో 19.1శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారి ఉంటారని వారిలో డిమెన్షియా ముప్పు తీవ్రంగా ఉంటుందని ఆ నివేదిక వివరించింది. గతంలో భావించిన దాని కంటే ఈ వ్యాధి వ్యాప్తి అత్యంత తీవ్రంగా ఉందని తేలింది. డిమెన్షియాకు ప్రస్తుతానికైతే చికిత్స లేదు. కొన్ని మందుల వల్ల లక్షణాలన్ని కొంతవరకు తగ్గించగలుగుతారు. వృద్ధాప్యంలో డిమెన్షియా రాకుండా యుక్త వయసు నుంచే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని అధ్యయనకారులు చెబుతున్నారు.

తొలిసారిగా కృత్రిమ మేధ సాయంతో భారత్‌లో అధ్యయనం

ఢిల్లీ ఎయిమ్స్ సహా అంతర్జాతీయ యూనివర్సిటీల సంయుక్త అధ్యయనం

కశ్మీర్‌లో అధికం మన దేశంలో జమ్మూకశ్మీర్‌లో అత్యధికులు డిమెన్షియాతో బాధపడుతున్నారు. కశ్మీర్‌లోని 60 ఏళ్ల వయసు కంటే ఎక్కువ ఉన్నవారిలో 11% మందికి డిమెన్షియా ఉంది. ఇక ఢిల్లీలో తక్కువగా 4.5% మందిలో ఈ లక్షణాలున్నాయి.

డిమెన్షియా అంటే...? డిమెన్షియా అన్న పదం డి, మెంటియా అనే పదాల నుంచి వచ్చింది. డి అంటే విత్‌ఔట్ అని, మెంటియా అంటే మనసు అని అర్థం. డిమెన్షియా అనేది సోకితే రోజువారీ చేసే పనులకి చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. కొద్ది సేపటి క్రితం ఏం చేశారో వారికి గుర్తు ఉండదు. రోజూ తిరిగే దారుల్ని కూడా మరిచిపోతారు. మాట్లాడడానికి పదాలు వెతుక్కుంటూ ఉంటారు. చిన్న చిన్న లెక్కలు కూడా చెయ్యలేరు. స్థూలంగా చెప్పాలంటే బాధ్యతగా వ్యవహరించలేరు. దీనివల్ల మెదడుపై తీవ్రమైన దుష్ప్రభావాలు పడతాయి.

మహిళలే బాధితులు డిమెన్షియా ఎక్కువగా మహిళల్లో కనిపిస్తోంది. చదువు రాని గ్రామీణ ప్రాంతంలో ఉండే మహిళల్లో ఈ లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయని సర్వే తేల్చింది. మహిళల్లో 9% మందికి ఈ వ్యాధి ఉంటే , పురుషుల్లో 5.8% మందిలో గుర్తించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య కూడా అంతరం ఎక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాల (5.3%) కంటే గ్రామీణ ప్రాంతాల్లోని వారు (8.4%) ఈ సమస్యతో అధికంగా బాధపడుతున్నారు.


ఒంటరితనంతో డిమెన్షియా !

డిమెన్షియా వ్యాధి రావడానికి ఎన్నో కారణాలున్నాయి. చిన్నతనం నుంచి మెదడుని చురుగ్గా ఉంచే కార్యక్రమాల్లో ఉండకపోతే పెద్దయ్యేసరికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా నిరక్షరాస్యుల్లో ఈ వ్యాధి ఎక్కువ. పొగతాగడం, మద్యపానం, నిద్రలేమి, శారీరక వ్యాయామం లేకపోవడం వంటివి కూడా మనసుపై ప్రభావాన్ని చూపించి డిమెన్షియా, అల్జీమర్స్ వంటి వ్యాధులు సోకుతాయని ఇన్నాళ్లు శాస్త్రవేత్తలు భావించారు. ఇప్పుడు ఒంటరితనం కూడా ఈ వ్యాధి సోకడానికి కారణమవుతోందని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఒంటరి జీవితం గడిపే వారిలో డిమెన్షియా వ్యాధి సోకే ముప్పు 27% అధికంగా ఉంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



''భారత్‌లో డిమెన్షియా మీద అవగాహన తక్కువ. వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు కిందే దీనిని భావిస్తారు. ప్రభుత్వాలు కూడా ఈ వ్యాధిపై అంతగా దృష్టి సారించడం లేదు. 2050 నాటికి డిమెన్షియా కేసులు దేశంలో విపరీతంగా పెరిగిపోతాయి. ఆ సమయానికి దేశ జనాభాలో 19.1శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారి ఉంటారు. వారిలో డిమెన్షియా ముప్పు తీవ్రంగా ఉంటుంది. ప్రభుత్వాలు ఇప్పట్నుంచే జాగ్రత్తలు తీసుకుంటే వృద్ధులు తమ జీవితాన్ని ఆనందంగా గడిపే అవకాశాన్ని కల్పించవచ్చు.'' -ప్రొఫెసర్ హామియో జిన్, అధ్యయనం సహరచయిత, యూనివర్సిటీ ఆఫ్ సర్రే, యూకే



కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతల వల్లే జనాభా పెరిగింది

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సౌకర్యం లేనందునే, దేశంలో జనాభా పెరిగిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించారు. కర్ణాటకలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. 'అధికారంలోకి వస్తే ఉచితంగా కరెంటు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పుడు హామీ ఇస్తోంది కానీ, గతంలో ఆ పార్టీ ప్రభుత్వ హయాంలో కరెంటు సరఫరా సరిగా చేయలేకపోయింది, గ్రామాల్లో అస్సలే కరెంటు లేదు. ఫలితంగా జనాభా పెరిగిపోయింది'అని అన్నారు. ప్రధాని మోదీ హయాంలో 24 గంటలూ విద్యుత్ ఉంటోందని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే కారు ఉక్రెయిన్‌కే!!

రిగా(లాత్వియా): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన కార్లను లాత్వియా అధికారులు ఉక్రెయిన్‌కు పంపిస్తున్నారు. రష్యాతో జరిగే యుద్ధంలో ఉక్రెయిన్‌కు తమ ప్రయత్నం సాయంగా ఉంటుందని అంటున్నారు. ఈ కార్లను నడిపిన మాజీ యజమానుల రక్తంలో ఆల్కహాల్ స్థాయిలు 0.15% పైనే ఉందట. ఇప్పటికే ఇలా పట్టుబడిన 8 కార్లు ఉక్రెయిన్‌కు పంపామని లాత్వియా దేశ రెవెన్యూ విభాగం తెలిపింది. కొనుగోలు చేసిన, విరాళంగా అందిన కార్లను దెబ్బతిన్న, యుద్ధం జరిగే ప్రాంతాల్లో అత్యవసర సేవలకు వినియోగిస్తామని ఉక్రెయిన్‌కు చెందిన అగెండమ్ గ్రూప్ తెలిపింది. 2022 ఫిబ్రవరి నుంచి ఇలాంటి 1,200 కార్లను అందజేసినట్లు వెల్లడించింది. లాత్వియా రోడ్లపై మద్యం తాగి కార్లలో తిరిగే వారు 'పేలని కమికాజ్ డ్రోన్లు'వంటి వారని చమత్కరించింది. 'సాధారణంగా స్వాధీనం చేసుకున్న కార్లను అమ్మేయడమో, విడగొట్టి అమ్మేయడమో చేస్తుంటాం. అయితే, ఉక్రెయిన్ ప్రజలకు సాయం చేయాలనే వీటిని అక్కడికి పంపిస్తున్నాం'అని లాత్వియా అంటోంది. పట్టుబడిన కార్లను వారానికి 25 చొప్పున అగెండమ్‌కు అందజేస్తామని లాత్వియా అధికారులు హామీ ఇచ్చారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్... మావోయిస్టులకు గాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా దబ్బామార్క పోలీస్‌స్టేషన్ పరిధి సకిలేరు అటవీప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. దబ్బామార్క పోలీస్ క్యాంపు నుంచి కోబ్రా, ఎస్టీఎఫ్ బలగాలు కూంబింగ్‌కు బయలుదేరాయి. గురువారం ఉదయం 9 గంటలప్పుడు సకిలేరు సమీపంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువర్గాల నడుమ కాల్పులు జరిగాయి. ఇద్దరు కోబ్రా కమాండోలు గాయపడ్డారు. ఐదారుగురు మావోయిస్టులు గాయపడగా, అటవీప్రాంతంలోకి పారిపోయారు. ఘటనాస్థలి నుంచి భారీ స్థాయిలో పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అదనపు బలగాలను పంపించి కూంబింగ్ ముమ్మరం చేసినట్లు సుక్మా జిల్లా ఎస్పీ సునీల్ వెల్లడించారు.

మళ్లీ క్షిపణిని ప్రయోగించిన ఉత్తరకొరియా

సియోల్: ఉత్తరకొరియా మరోసారి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. గురువారం సాయంత్రం 6.20గంటల సమయంలో పశ్చిమ తీర నగరం నంపో నుంచి స్వల్పశ్రేణి క్షిపణిని ప్రయోగించినట్లు గుర్తించామని దక్షిణ కొరియా సైన్యం తెలిపింది. ఆ మిస్సైల్ ఎంత దూరం ప్రయాణించిందో వెల్లడించలేదు. అణు సామర్థ్యం కలిగిన బీ–52 బాంబర్ పరీక్షలను అమెరికా, దక్షిణకొరియా చేపట్టడంపై ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, దేశంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళ కిమ్ యో జోంగ్ మంగళవారం తీవ్ర హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే.

కాంగోలో ఉగ్ర ఘాతుకం.. 36 మంది మృతి

గోమా: ఆఫ్రికా దేశం కాంగోలో ఇస్లామిక్ స్టేట్ అనుబంధ ఉగ్ర సంస్థ అలైడ్ డెమొక్రటిక్ ఫోర్సెస్(ఏడీఎఫ్) జరిపిన మారణకాండలో 36 మంది పౌరులు చనిపోయారు. నార్త్ కివు ప్రావిన్స్ ముకోండి గ్రామంలోకి బుధవారం రాత్రి కత్తులు, తుపాకులతో ప్రవేశించిన ఉగ్రమూకలు ఇళ్లకు నిప్పుపెట్టాయి. బయటకు వచ్చిన పౌరులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డాయి. ఘటనలో 36 మంది చనిపోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. కొందరిని ఎత్తుకుపోయారు. ఏడీఎఫ్ ఉగ్రమూకలు చిన్నారులపైనా దారుణాలకు పాల్పడుతున్నాయి.

ఇకపై కవ్వింపులకు దిగితే...

పాక్‌తో సమరమే!?

మోదీ సర్కారు సహించబోదు ● అమెరికా నిఘా వర్గాల అంచనా

వాషింగ్టన్: పాకిస్తాన్, చైనాలతో భారత్ సంబంధాలు నానాటికీ మరింతగా క్షీణిస్తున్నాయని, పెరుగుతున్న ఉద్రిక్తతలు సాయుధ ఘర్షణకూ దారితీసే ఆస్కారం లేకపోలేదని అమెరికా నిఘా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముఖ్యంగా పాక్ కవ్వింపులను భారత్ గతంలోలా సహించే పరిస్థితి లేదు. మోదీ హయాంలో పాక్‌పై సైనిక చర్యకు దిగే అవకాశముంది'' అని అంచనా వేశాయి. అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన వార్షిక నివేదికలో ఈ మేరకు పొందుపరిచాయి. ''ముఖ్యంగా భారత వ్యతిరేక ఉగ్రవాద తండాలకు మద్దతిచ్చిన సుదీర్ఘ చరిత్ర పాక్‌ది. అందుకే ఇకపై పాక్ కవ్విస్తే మోదీ ప్రభుత్వం మౌనంగా ఉండబోదు'' అని నివేదిక అభిప్రాయపడింది. చైనాతో కూడా పలు సరిహద్దు సమస్యలను భారత్ చర్చల ద్వారా పరిష్కరించుకున్నా 2020 గల్వాన్ ఘర్షణ, తాజాగా అరుణాచల్ సరిహద్దుల వద్ద గొడవ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింతగా పెంచాయని పేర్కొంది.


చైనాతో అమెరికాకు పెనుముప్పు

అమెరికా జాతీయ భద్రతకు, అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వ స్థానానికి చైనా కమ్యూనిస్టు పార్టీ నుంచి అత్యంత ముప్పు పొంచి ఉందని యూఎస్ నిఘా విభాగపు నివేదిక అభిప్రాయపడింది. ''రష్యాతో ఏడాదిగా చైనా బంధం బలపడుతున్న తీరు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది. నానాటికీ పెరుగుతున్న ఈ చైనా సవాలును దీటుగా ఎదుర్కొనేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి'' అని ప్రభుత్వానికి సూచించింది. సెనెట్ సెలెక్ట్ కమిటీ సభ్యులకు నిఘా నివేదిక సమర్పించిన సందర్భంగా నేషనల్ ఇంటలిజెన్స్ డైరెక్టర్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

సిసోడియాను అరెస్ట్ చేసిన ఈడీ

మద్యం పాలసీ కేసులో మరో మలుపు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో తిహార్ జైలులో ఉన్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం ఆయన్ను అరెస్ట్ చేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఆయన సీబీఐ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. కోర్టు అనుమతితో ఈడీ అధికారులు బుధ, గురువారాల్లో తిహార్ జైలులో ఉన్న సిసోడియాను ప్రశ్నించారు. గురువారం పలు అంశాలపై ప్రశ్నించిన అనంతరం సిసోడియాను అరెస్ట్ చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. మనీ లాండరింగ్ ఆరోపణల కింద ఆయన్ను అరెస్ట్ చేస్తున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. రద్దయిన మద్యం విధానం విషయమై సీఎం కేజ్రీవాల్, ఇతర మంత్రులు, అధికారులతో జరిపిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపైనా తిహార్ జైలులో ఈడీ అధికారులు ప్రశ్నించారు. అయితే, విచారణకు సిసోడియా సహకరించడం లేదని, ప్రశ్నల నుంచి తప్పుదోవ పట్టిస్తున్నారని ఈడీ ఆరోపిస్తోంది. సిసోడియా పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై సీబీఐ కోర్టు 10న విచారించనుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. శుక్రవారం ఆయన్ను కోర్టులో ప్రవేశపెట్టనుంది. సిసోడియాకు ఇప్పటికే సీబీఐ కోర్టు విధించిన జ్యుడిషియల్ కస్టడీ గడువు ఈ నెల 20వ తేదీ వరకు ఉంది. శుక్రవారం బెయిల్ వచ్చినప్పటికీ ఈడీ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లి ఈ కేసులోని ఇతర నిందితులతోనూ కలిపి ఆయన్ను ప్రశ్నించే అవకాశాలున్నాయి. ఎక్సైజ్ శాఖ మంత్రిగా కూడా ఉన్న సిసోడియా మద్యం పాలసీ నిర్ణయాలకు సంబంధించి ఆధారాలు దొరక్కుండా చేసేందుకు తన వద్ద ఉన్న 170 వరకు సెల్‌ఫోన్లను ధ్వంసం చేయడం, మార్చడం చేసినట్లు ఈడీ ఆరోపిస్తోంది. కోర్టుకు సమర్పించిన చార్జిషీటులోనూ ఇవే విషయాలను పేర్కొంది.



జైల్లోనే ఉంచేందుకు కుట్ర: కేజ్రీవాల్

తప్పుడు ఆరోపణలపై తిహార్ జైలులో ఉన్న సిసోడియాకు బెయిల్ లభించవచ్చనే ఈడీ గురువారం ఆయన్ను అరెస్ట్ చేసిందని ఆప్ అగ్రనేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. 'మొదట సీబీఐ సిసోడియాను అరెస్ట్ చేసింది. ఆయన వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదు, దాడుల్లో డబ్బు కూడా లభ్యం కాలేదు. రేపు జరిగే విచారణలో కోర్టు ఆయనకు బెయిలిచ్చే అవకాశం ఉంది. అందుకే, ఈడీ అరెస్ట్ చేసింది. ఏది ఏమైనా తప్పుడు ఆరోపణలు మోపి, ఆయన్ను బయటకు రాకుండా చేయడమే ఈడీ ఏకైక లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజలు అంతా చూస్తున్నారు. వారు తగు సమాధానం ఇస్తారు'అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

రక్షణ బంధం బలోపేతం

ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్
- ఐఎన్ఎస్ విక్రాంత్ సందర్శన
- త్వరలో సంయుక్త నావికా విన్యాసాలు
- ఆస్ట్రేలియా ఆతిథ్యమిస్తుందని ప్రకటన
- నేడు ప్రధాని మోదీతో కీలక చర్చలు



ముంబైలో డబ్బావాలాలతో ముచ్చటిస్తున్న ఆల్బనీస్



ఐఎన్ఎస్ విక్రాంత్‌పై తేలికపాటి యుద్ధవిమానంలో ఆల్బనీస్

ముంబై/న్యూఢిల్లీ: భారత్‌తో సంయుక్త నావికా విన్యాసాలకు ఆస్ట్రేలియా త్వరలో ఆతిథ్యమివ్వనుందని ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ప్రకటించారు. 'ఎక్సర్‌సైజ్ మలబార్' పేరిట జరిపే ఈ విన్యాసాల్లో వీటిలో అమెరికా, జపాన్ కూడా పాల్గొంటాయన్నారు. ఆయన పూర్తి దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన విమాన వాహక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను గురువారం ముంబైలో సందర్శించారు. నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ ఆయనకు స్వాగతం పలికారు. నౌకలో కలియదిరిగి విశేషాలు తిలకించిన అనంతరం ఆల్బనీస్ పలు అంశాలపై మాట్లాడారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య రక్షణ రంగంలో సాన్నిహిత్యం నానాటికీ పెరుగుతోందని, బంధం మరింత బలపడుతోందని అభిప్రాయపడ్డారు. 'గతేడాది రికార్డు స్థాయిలో సంయుక్త విన్యాసాలు, చర్చలు జరిగాయి. త్వరలో ఆస్ట్రేలియాలో ఎక్సర్‌సైజ్ మలబార్ నిర్వహించనున్నాం. వాటిలో భారత్ తొలిసారిగా పాల్గొంటోంది' అని అన్నారు.

మోదీపై ప్రశంసల జల్లు

ఏ అంశాన్నైనా భవిష్యత్తును అంచనా వేసి మరీ ఆలోచించడం ప్రధాని నరేంద్ర మోదీలో ఉన్న గొప్పదనమని ఆల్బనీస్ ప్రశంసించారు. ''రక్షణ సంబంధాలను సుదృఢం చేసేది ఇలాంటి దూరదృష్టే. బంధాలను ఇప్పుడెలా ఉన్నాయని కాకుండా ముందు ఎదుగుదలకు ఉన్న అవకాశాల పరంగా మదింపు వేయగలగాలి. ఆ సామర్థ్యమున్న నేత మోదీ'' అని అభిప్రాయపడ్డారు. వర్తక, ఆర్థిక కార్యకలాపాల కోసం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత సముద్ర మార్గాలు ఇరు దేశాలకూ ఆవశ్యకమేనన్నారు. మోదీ ప్రతిపాదించిన జనరల్ రావత్ డిఫెన్స్ ఆఫీసర్స్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాం ఇరు దేశాల సైనిక సిబ్బంది మధ్య అవగాహన, సాన్నిహిత్యం పెంపొందేందుకు దోహదపడుతుందని ఆశాభావం వెలిబుచ్చారు.

రక్షణ మంత్రుల చర్చలు

రక్షణ రంగంలో ఆస్ట్రేలియాతో బంధాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నట్టు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చెప్పారు. ఆ దేశ ఉప ప్రధాని, రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్‌తో గురువారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయంలో ఇరు దేశాలకు ఉన్న చిత్తశుద్ధిని ప్రతిబింబించేలా తమ సంభాషణ సాగిందన్నారు.

వర్తకం, రక్షణ, కీలక ఖనిజాలు
మోదీతో చర్చల్లో ఇవే ప్రధానం

ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్‌తో మోదీ శుక్రవారం విస్తృతంగా చర్చలు జరపనున్నారు. కీలక ఖనిజాలు, ద్వైపాక్షిక వర్తకం, రక్షణ ప్రధానంగా ప్రస్తావనకు రానున్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా సైనిక దూకుడు, అందుకు అడ్డుకట్ట వేసే మార్గాలు తదితరాలపైనా నేతలు చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య 2021లో 27.5 బిలియన్ డాలర్ల విలువైన వర్తకం జరిగింది. 2022లో అమల్లోకి వచ్చిన ఆర్థిక సహకార వర్తక ఒప్పందం (ఈసీటీఏ)తో వచ్చే ఐదేళ్లలో ఇది 50 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.

టెస్ట్ మ్యాచ్ చూశారు

గురువారం ఉదయం మోదీ, ఆల్బనీస్ కలిసి అహ్మదాబాద్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగో అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆట ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. టాస్ అనంతరం ఇద్దరూ కలిసి కాసేపు మ్యాచ్‌ను ఆస్వాదించారు. అనంతరం ముంబైలో ఇండియా–ఆస్ట్రేలియా సీఈఓల ఫోరం సమావేశంలో ఆల్బనీస్ పాల్గొన్నారు.

రష్యా క్షిపణుల వాన

కీవ్: ఉక్రెయిన్‌పైకి గురువారం రష్యా మరోసారి క్షిపణుల వాన కురిపించింది. దీంతో ఉదయం నుంచి 7 గంటలపాటు దేశమంతటా ముందు జాగ్రత్తగా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. దేశంలోని 10 ప్రాంతాల్లోని నివాస భవనాలపై రష్యా జరిపిన దాడుల్లో కనీసం ఆరుగురు చనిపోయారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. గత మూడు వారాల్లో రష్యా జరిపిన అతి పెద్ద దాడి ఇదేనన్నారు. 'ఆక్రమణదారులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇది మాత్రమే వాళ్లు చేయగలరు' అని ఆయన ఆన్‌లైన్‌లో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



జార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లాలో స్వస్థలం నెమ్రా గ్రామంలో గురువారం సంప్రదాయ వస్త్రధారణలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్

గవర్నర్లకు నోరు తప్ప చెవుల్లేవు : స్టాలిన్



చెన్నై: గవర్నర్ల వ్యవహార శైలిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అన్ని రాష్ట్రాల గవర్నర్లకి మాట్లాడడానికి నోరు ఉందే తప్ప వినడానికి చెవుల్లేవని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అందుకే గవర్నర్లందరూ ఎక్కువగా మాట్లాడుతూ తక్కువగా వింటున్నారని వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్‌లో జూదం నిరోధక బిల్లుని తమిళనాడు గవర్నర్ ఆర్ఎస్ రవి వెనక్కి తిప్పి పంపిన నేపథ్యంలో స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉంగలిల్ ఒరువన్ అనే కార్యక్రమంలో గురువారం పాల్గొన్న స్టాలిన్ ప్రజలు వేసే ప్రశ్నలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమాధానాలిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో గవర్నర్లు జోక్యం చేసుకోకూడదని ఇటీవల సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలకు గవర్నర్లు కట్టుబడి ఉన్నారా? అని ప్రేక్షకుల నుంచి వచ్చిన ప్రశ్నకు స్టాలిన్ స్పందిస్తూ కొందరు గవర్నర్ల వ్యవహార శైలి చూస్తుంటే వారికి నోరు ఉందే తప్ప చెవులు లేవని అనిపిస్తోందని అన్నారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీశ్ సిసోడియా అరెస్టును ఆయన ప్రస్తావిస్తూ ప్రతిపక్ష పార్టీలను బీజేపీ బహిరంగంగానే ఎలా హెచ్చరిస్తుందో సిసోడియా అరెస్ట్ నిలువెత్తు నిదర్శనమని అన్నారు. రాజకీయ కారణాల కోసం దర్యాప్తు సంస్థల్ని బీజేపీ వాడుకుంటోందని మండిపడ్డారు. ప్రతిపక్షాలపై ఎన్నికల్లో గెలవడానికి బదులుగా, దర్యాప్తు సంస్థల్ని ప్రయోగించి విజయం సాధించాలని చూడడమేంటని ప్రధాని మోదీకి లేఖ రాసినట్టుగా స్టాలిన్ వెల్లడించారు.

నేపాల్ అధ్యక్షుడిగా రామచంద్ర పౌడెల్



ఖట్మాండు: నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామచంద్ర పౌడెల్ ఎన్నికయ్యారు. నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన రామచంద్రను ప్రజాప్రతినిధులు ఎన్నుకోవడంతో ప్రధానమంత్రి ప్రచండ ఆధ్వర్యంలోని సంకీర్ణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. అధికార సంకీర్ణ కూటమి అభ్యర్థి రామచంద్రను ఎన్నిక కోసం తెరవెనుక ప్రచండ పన్నిన రాజకీయ వ్యూహాలు ఫలించాయి. ప్రధాని ప్రచండ నేతృత్వంలోని సీపీఎన్ (మావోయిస్టు సెంటర్) తో పాటు ఎనిమిది పార్టీల సంయుక్త అభ్యర్థి రామచంద్ర తన ప్రత్యర్థి పార్లమెంటులో రెండో అతి పెద్ద పార్టీ సీపీఎన్–యూఎంఎల్ మద్దతునిచ్చిన అభ్యర్థి సుభాష్ చంద్ర నెబ్‌మాంగ్‌పై విజయం సాధించారు. రామచంద్రకు 214 మంది ఎంపీలు, 352 మంది ప్రావిన్షియల్ అసెంబ్లీ సభ్యుల ఓట్లు వచ్చాయి. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి అధ్యక్షుడిగా గెలిస్తే నేపాల్ ప్రభుత్వంపై ఆ ప్రభావం పడే అవకాశం ఉండేది.

చిలీలో రూ.262 కోట్ల దోపిడీకి యత్నం

శాంటియాగో: చిలీ రాజధాని శాంటియాగోలో వందల కోట్ల నగదును దోచుకునేందుకు సాయుధ దుండగులు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ ఘటనలో ఇద్దరు చనిపోయారు. అమెరికాలోని మియామి నుంచి శాంటియాగో విమానాశ్రయానికి బుధవారం చేరుకున్న విమానంలో 32 మిలియన్ డాలర్ల (రూ.262 కోట్లు) నగదు ఉంది. బ్యాంకుల్లో పంపిణీ చేయాల్సిన ఆ నగదును ట్రక్కులోకి తరలించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో, 10 మంది సాయుధ దుండగులు ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించారు. పక్కా ప్రణాళికతో అక్కడికి చేరుకున్న దుండగులు నగదును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందితో కొద్దిసేపు ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల్లో భద్రతా సిబ్బంది ఒకరు, ఒక దుండగుడు చనిపోయారు. దుండగులు వెంటనే తమ వాహనంలో అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం ఆ ప్రాంతంలో పూర్తిగా కాలిపోయిన మరో రెండు వాహనాలు కనిపించాయి. భద్రతా సిబ్బంది సకాలంలో స్పందించి ఈ భారీ దోపిడీని అడ్డుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నగదును తీసుకువచ్చిన లాతమ్ విమానంలోని ప్రయాణికులకు ఎటువంటి అపాయం కలగలేదన్నారు. ఇదే శాంటియాగో ఎయిర్‌పోర్టులో గతంలో రెండుసార్లు దోపిడీ దొంగలు తెగబడి మొత్తం 25 మిలియన్ డాలర్ల నగదును ఎత్తుకెళ్లారు.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 10 । మార్చి । 2023

పీజీ పరీక్షల టైంటేబుల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను గురువారం విడుదల చేశారు. ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి 1 గంట వరకు జరగనున్నాయి. వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు.

నేడు ఓయూకి యూజీసీ చైర్మన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకి శుక్రవారం యూజీసీ చైర్మన్ ప్రొ.జగదీష్ కుమార్ రానున్నారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ పక్కన నిర్మించిన ఓయూ యూజీసీ అకడమిక్ స్టాఫ్ కాలేజీ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఐఏఎస్ అధికారులు నవీన్ మిట్టల్, వి.కరుణ, ఓయూ వీసీ, ఇతర అధికారులు పాల్గొననున్నారు.

చర్లపల్లికి హరిహరకృష్ణ

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంజినీరింగ్ విద్యార్థి నవీన్ హత్య కేసులో ప్రధాన నిందితుడు హరిహరకృష్ణ పోలీస్ కస్టడీ ముగిసింది. గురువారం అతడికి వైద్య పరీక్షలు చేసి, తిరిగి చర్లపల్లి జైలుకు తరలించారు. నవీన్‌ను హత్య చేసేందుకు హరిహరకృష్ణకు సహకరించినట్లు హసన్, నిహారికారెడ్డి ఒప్పుకోవడంతో వారిద్దరిని కూడా రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా 1కే రన్



లోటస్‌పాండ్‌లో 1కే రన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: మహిళా దినోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం బంజారాహిల్స్ లోటస్‌పాండ్‌లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికుల 1కే రన్ కార్యక్రమాన్ని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. రన్‌లో గెలుపొందిన వారికి మేయర్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మహిళా పారిశుద్ధ్య కార్మికులు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చన్నారు. విధులు నిర్వహిస్తున్న చోట వేధింపులు ఎదురైతే ధైర్యంగా తన వద్దకు వచ్చి చెప్పవచ్చని ఆమె సూచించారు. అనంతరం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీఎంసీ రజినీకాంత్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

13న ఓటర్లకు సెలవు

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఈ నెల 13న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగులైన ఓటర్లకు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఉంటుందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఓటర్లకు సెలవు ఉండదని పేర్కొన్నారు. వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతించాలని సూచించారు. విధులకు ఆలస్యంగా రావడం వంటి వాటిని అనుమతించాలని, ఆ మేరకు షిఫ్టుల్లో తగిన సర్దుబాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

మలక్‌పేట మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



చాదర్‌ఘాట్: మిర్చి సీజన్ కావడంతో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మిర్చితో మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రాంతం కళకళలాడుతోంది. గురువారం మార్కెట్‌కు సుమారు 7,525 బస్తాల మిర్చి వచ్చింది. మొదటి రకం మిర్చి క్వింటాల్‌కు రూ. 14 వేల నుంచి రూ. 20 వేలు, రెండో రకం మిర్చి క్వింటాల్‌కు రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు పలికింది. మార్కెట్‌కు వచ్చిన బ్యాడిగ రకం మిర్చి క్వింటాల్‌కు రూ. 30 వేలు ధర పలికిందని అధికారులు తెలిపారు. బ్యాడిగ మిర్చి రాష్ట్రంలోని గద్వాల తదితర ప్రాంతాల్లో సాగు చేస్తారని తెలిపారు. అదేవిధంగా సూపర్ 10 రకానికి చెందిన మిర్చి క్వింటాల్‌కు రూ. 23 వేలు ధర పలికిందని వారు తెలిపారు.

విరుచుకుపడ్డ వీధి కుక్కలు



- రెండున్నరేళ్ల బాలుడికి తీవ్ర గాయాలు
- అత్తాపూర్ తేజస్వీనగర్ కాలనీలో ఘటన
- చికిత్స నిమిత్తం నిలోఫర్‌కు తరలింపు



సాయిచరణ్ పొట్ట, చేతికి గాయాలు



రాజేంద్రనగర్: రెండున్నరేళ్ల బాలుడిపై ఆరు వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన అత్తాపూర్ తేజస్వీనగర్ కాలనీ సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ వద్ద గురువారం చోటుచేసుకుంది. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. కోదాడకు చెందిన శేఖర్, మౌనిక దంపతులు. వీరికి ఆరేళ్ల కూతురుతో పాటు రెండున్నరేళ్ల శ్రీహాన్ అలియాస్ సాయిచరణ్ ఉన్నారు. బతుకుదెరువు కోసం వలస వచ్చి కార్వాన్ ప్రాంతంలో ఉంటున్నారు. కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం తేజస్వీనగర్ సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో నిర్మాణ పనుల కోసం వచ్చారు. కూతురుతో పాటు సాయిచరణ్‌ను పక్కనే కూర్చోపెట్టి పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సాయిచరణ్ ఆడుకుంటూ రోడ్డు వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న ఆరు వీధి కుక్కలు అతడిపై దాడి చేశాయి. వీపు, చేతులు, తొడ, పిక్కలు, పొట్ట భాగాలను పీకేందుకు ప్రయత్నించాయి. కుక్కలు దాడి చేయడంతో చిన్నారి అరుపులు విన్న అపార్ట్‌మెంట్ వాసులు, రోడ్డుపై వెళ్తున్న వారు, బాలుడి తల్లిదండ్రులు వెంటనే కుక్కలను తరిమివేశారు. గాయపడ్డ చిన్నారిని మొదట స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం నిలోఫర్‌కు పంపించారు.

కుక్కలు.. గుంపులు గుంపులు.. .

అత్తాపూర్ తేజస్వీనగర్ కాలనీలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళనలు కలిగిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. కు.ని ఆపరేషన్ చేసి అక్కడే వదిలి వేస్తాం తప్ప ఇతర ప్రాంతాలకు తరలించలేమని వారు చెబుతున్నారని వాపోతున్నారు.

నిమిషం ఆలస్యమైతే.. పీక్కు తినేవి

వీధి కుక్కల గుంపు చిన్నారిపై దాడి చేసి ఈడ్చుకు వెళ్లాయని స్థానికులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌పై నుంచి తాము చూసి అరవడంతో పాటు రోడ్డున వెళ్తున్న వారు కుక్కలను తరమడంతో ప్రమాదం తప్పిందన్నారు. నిమిషం లేటైనా బాలుడిని పీక్కు తినేవని చెప్పారు.

శాతవాహన నగర్‌లో బాలికపై..



గాయాల పాలైన లిఖిత

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శాతవాహన నగర్ కాలనీలో గురువారం సాయంత్రం కుక్కలు దాడి చేయడంతో లిఖిత అనే బాలిక గాయపడింది. స్థానికులు గమనించి వెంటనే కుక్కలను తరిమివేయడంతో బాలిక ప్రమాదం నుంచి బయట పడింది. చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించారు.

హ్యాపీ జర్నీ!

సిటీ ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

- మహిళలు, సీనియర్ సిటిజన్‌లకు టి- 6 టికెట్
- రూ.50కే ఆరు గంటలు ప్రయాణించే అవకాశం
- కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం ఎఫ్- 24
- రూ.300తో నలుగురికి ప్రయాణ సదుపాయం
- నేటి నుంచి నగరంలో అమలు: ఆర్టీసీ ఎండీ సజ్జనార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: సిటీ ప్రయాణికులకు గ్రేటర్ ఆర్టీసీ తీపికబురు అందించింది. నగరవాసులతో పాటు పర్యాటకులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. మహిళలు, సీనియర్ సిటిజన్స్ రూ.50 టికెట్‌పై 6 గంటల పాటు సిటీలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా జర్నీ చేయొచ్చు. ఫ్యామిలీ ప్యాకేజీలో భాగంగా నలుగురు కుటుంబ సభ్యులు కలిసి ప్రయాణం చేసేందుకు రూ.300తో ఎఫ్-24 టికెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ రెండు కొత్త ఆఫర్‌లు నేటి నుంచే అమల్లోకి వస్తాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గురువారం బస్‌భవన్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

అతివలు, వయోధికులకు ప్రయోజనం..

మహిళలు, సీనియర్ సిటిజన్ల సౌకర్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టి-6 టికెట్ రూ.50కు లభిస్తుంది. దీనిపై గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సిటి ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో 6 గంటల పాటు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఈ టికెట్‌లు చెల్లుబాటులో ఉంటాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ టికెట్‌ను బస్సులో కండక్టర్ ఇస్తారు. మధ్యాహ్నం 2 తర్వాత టి-6 టికెట్లు లభించవు. 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటీజన్‌లు సైతం టి-6 టికెట్‌లపై 6 గంటల పాటు ప్రయాణం చేయవచ్చు. టికెట్ తీసుకునే సమయంలో వయసు ధ్రువీకరణ కోసం కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుంది.

24 గంటల ప్రయాణ సదుపాయం..

వారాంతాలు, సెలవు దినాల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ప్రయాణించేందుకు వీలుగా ఫ్యామిలీ- 24 టికెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. రూ.300 చెల్లిస్తే.. నలుగురు కలిసి 24 గంటల పాటు సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో ప్రయాణించవచ్చు. అయిదేళ్లు దాటిన (5 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రయాణం ఉచితం) వారు ఫ్యామిలీ- 24 టికెట్ తీసుకోవచ్చు. శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లో మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ పర్యటనకు వచ్చే ఇతర ప్రాంతాలకు చెందిన వారు, వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు సైతం ఈ టికెట్‌పై రోజంతా ప్రయాణం చేయొచ్చు. ప్రస్తుతం నగరంలో టి-24 టికెట్ అందుబాటులో ఉంది. దీనిపై 24 గంటల పాటు ప్రయాణం చేయవచ్చు. టీ-24 ధర పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60 చొప్పున ఉంటుంది. టీ- 24 (ట్రావెల్ యాజ్ యూ లైక్) టికెట్‌కు కొనసాగింపుగానే తగ్గింపు ధరలతో ఫ్యామిలీ-24ను ప్రవేశపెట్టారు.

టీ- 24కి అనూహ్య స్పందన..

నగరంలో అందుబాటులో ఉన్న టీ-24 టికెట్‌కు ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు 33.38 కోట్ల మంది సిటీ బస్సుల్లో ప్రయాణం చేయగా, వారిలో 55.50 లక్షల మంది టీ- 24 టికెట్లను కొనుగోలు చేశారు. ప్రతి రోజు సగటున 25 వేల వరకు అమ్ముడవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ప్రయాణికులకు, పర్యాటకులకు మరింత చేరువయ్యేందుకు టి-6, ఫ్యామిలీ-24 టికెట్లను ప్రవేశపెట్టారు. 'సాధారణంగా టి-24 టికెట్ అయితే.. నలుగురికి రూ.400 చెల్లించాల్సి ఉంటుంది. ఫ్యామిలీ-24తో ముగ్గురికి రూ.300 చెల్లించి నలుగురు ప్రయాణం చేయొచ్చు' అని సజ్జనార్ చెప్పారు. ఆయా టికెట్లకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040- 23450033లను సంప్రదించాలని సూచించారు.

డబుల్ డెక్కర్లేవీ?

- పర్యాటక ప్రాంతాలపై పూర్తికాని సర్వే
- ఆ మూడు బస్సులతోనే సరి
- ఇంకా అందుబాటులోకి రాని మరో మూడు బస్సులు
- అలనాటి వైభవానికి ఆటంకాలెన్నో



సాక్షి, సిటీబ్యూరో: నిజాం కాలం నాటి డబుల్ డెక్కర్ బస్సుల వైభవాన్ని తలపించేలా హెచ్‌ఎండీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ ఎలక్ట్రిక్ బస్సులు నగరవాసులకు, పర్యాటకులకు ఇంకా దూరంగానే ఉన్నాయి. నగరంలోని పర్యాటక ప్రదేశాలు, చారిత్రక ప్రాంతాలను సందర్శించేందుకు అనుగుణంగా ఈ బస్సులను నడపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. 6 బస్సులతో డబుల్ డెక్కర్ సేవలను అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫార్ములా- ఈ సందర్భంగా 3 బస్సులను మాత్రం పరిచయం చేశారు. ఇంకా మరో 3 బస్సులు అందుబాటులోకి రావాల్సి ఉంది. మరోవైపు ఈ బస్సుల ప్రారంభోత్సవం సందర్భంగా దశలవారీగా 30 డబుల్ డెక్కర్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న మూడు బస్సులు మాత్రం పీపుల్స్ ప్లాజాకే పరిమితమయ్యాయి. అప్పుడప్పుడు ట్యాంక్‌బండ్‌పై మాత్రం వీటిని ప్రదర్శిస్తున్నారు.

కొరవడిన స్పష్టత..

నాలుగు వందల ఏళ్ల నాటి హైదరాబాద్ చారిత్రక కట్టడాలను సందర్శించే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకొనే విధంగా చార్మినార్, గోల్కొండ కోట, గోల్కొండ టూంబ్స్, చౌమొహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా వంటి ప్రాంతాలతో పాటు ట్యాంక్‌బండ్, బొటానికల్ గార్డెన్, కేబుల్‌బ్రిడ్జి, నెక్లెస్ రోడ్డు, లుంబిని పార్కు, పీపుల్స్‌ప్లాజా, గండిపేట్, జూపార్కు తదితర ప్రదేశాలను సందర్శించేందుకు అనుగుణంగా ఈ బస్సులను నడపాలని హెచ్‌ఎండీఏ భావించింది. కానీ.. వివిధ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ఇప్పటివరకు ఎలాంటి రూట్ సర్వేలు నిర్వహించకపోవడం గమనార్హం. బస్సులను ఏ రూట్ నుంచి ఏ రూట్‌లో, ఏయే ప్రదేశాలకు నడపవచ్చనే అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. మరోవైపు పలు మార్గాల్లో బస్సులను నడిపేందుకు కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయని మున్సిపల్ శాఖ అధికారి ఒకరు తెలిపారు. మార్చి మొదటి వారం నుంచే ఈ బస్సులను ప్రయాణికులకు, పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని భావించారు. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. వేసవి సెలవుల దృష్ట్యా ఈ బస్సులు పిల్లలు, పెద్దలను విశేషంగా ఆకట్టుకొనే అవకాశం ఉంది.

బస్సులు నడిపేదెవరు...

మరోవైపు ఈ డబుల్ డెక్కర్ ఎలక్ట్రిక్ బస్సులను హెచ్‌ఎండీఏ సొంతంగా నిర్వహిస్తుందా లేక ఆర్టీసీ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థలకు నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తుందా అనే అంశంలోనూ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. అంతర్జాతీయ ప్రమాణాల మేరకు తయారు చేసిన ఈ బస్సులను ఒక్కొక్కటి రూ.2.16 కోట్ల చొప్పున హెచ్‌ఎండీఏ కొనుగోలు చేసింది. మొదటి దశలో వచ్చిన మూడింటితో పాటు మరో మూడు బస్సులు ఈ నెలలోనే వస్తాయని అధికారులు చెబుతున్నారు. రూ.కోట్లు వచ్చించి బస్సులను కొనుగోలు చేసినప్పటికీ వినియోగంలోకి రాకపోవడం గమనార్హం. వీకెండ్స్‌లో మాత్రం అప్పుడప్పుడు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఈ బస్సులు కనువిందు చేస్తున్నాయంతే.

కళ్లు లేవు.. కనికరించరే!

- తండ్రి పెన్షన్ కోసం అంధ తనయుడి ప్రదక్షిణలు
- సీఎంను కలవాలని ప్రగతి భవన్ వద్దకు..
- అడ్డుకుని పంజాగుట్ట ఠాణాకు తరలించిన అధికారులు
- తన గోడు పట్టించుకోవట్లేదని అభాగ్యుడి ఆవేదన



రాఘవేంద్ర

సాక్షి, సిటీబ్యూరో: పోలీసు విభాగంలో డీఎస్పీగా సుదీర్ఘకాలం సేవలు అందించి పదవీ విరమణ చేశారాయన. ఆ తర్వాత అనారోగ్యంతో కన్నుమూశారు కె.పాండు రంగారావు. తండ్రి పెన్షన్ నుంచి రావాల్సిన తన వాటా కోసం ఆయన కుమారుడు కె.రాఘవేంద్ర (గతంలో కెమికల్ రియాక్షన్‌తో రెండు కళ్లూ కోల్పోయాడు) పదకొండేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులతో పాటు రాష్ట్రపతి, గవర్నర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకునేందుకు గురువారం ప్రగతి భవన్ వద్దకు వెళ్లినా ఫలితం దక్కలేదు. ఆయనను అడ్డుకున్న పోలీసులు పంజగుట్ట ఠాణాకు తరలించి కౌన్సెలింగ్ అనంతరం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర 'సాక్షి'కి తన దయనీయ పరిస్థితులను ఇలా వివరించారు. అవి ఆయన మాటల్లోనే..

'మా నాన్న పాండురంగారావు పోలీసు విభాగంలో సబ్-ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి డీఎస్పీ, ఏసీపీ హోదాలో పలు జిల్లాల్లో పనిచేశారు. 1986లో పదవీ విరమణ పొందారు. మా అమ్మ 1994లో చనిపోగా.. నాన్న అనారోగ్యంతో 2010లో కన్నుమూశారు. నేను చెన్నైలో ఇంటీరియర్ డిజైనింగ్ పని చేసేవాడిని. 2009లో కెమికల్ రియాక్షన్ కారణంగా రెండు కళ్లనూ కోల్పోయాను. నిబంధనల ప్రకారం పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆయన పెన్షన్‌లో 50 శాతం భార్యకు చెల్లించాలి. ఆమె కూడా లేని పక్షంలో వికలాంగులు, భర్తను కోల్పోయిన పిల్లలు ఉంటే వారికి 20 నుంచి 25 శాతం చెల్లించాలి. అంధుడిగా మారిన నేను.. మా తండ్రి పెన్షన్ నుంచి రావాల్సిన మొత్తం కోసం పదకొండేళ్లుగా పోరాటం చేస్తున్నాను.

తోబుట్టువుల దయాదాక్షిణ్యాలతో..

ప్రస్తుతం నేను ఎల్బీనగర్‌లో నివసిస్తున్నా. నాకు ఇద్దరు సంతానం. భార్య దూరమైంది. ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరాలు చదువుతున్న పిల్లల ఆలనాపాలనా నేనే చూసుకోవాలి. నెలవారీ ఖర్చులతో పాటు పిల్లల చదువు కోసమూ తోబుట్టువులపై ఆధారపడ్డాను. నాకు రావాల్సిన పెన్షన్ కోసం సంబంధిత అధికారులను 2010లోనే సంప్రదించాను.

- మొత్తం 19 రకాలైన సర్టిఫికెట్లు కావాలంటూ సూచించడంతో అవన్నీ సేకరించి పదకొండేళ్ల క్రితం దరఖాస్తు చేశా. నలుగురు ఎస్పీలు, అయిదుగురు ఏసీపీలు, దాదాపు పది మంది ఇన్‌స్పెక్టర్ల వద్దకు వెళ్లి ఈ పత్రాలు సేకరించాను. అప్పటి నుంచి పెన్షన్ కోసం నగర పోలీసు కమిషనరేట్, డీజీపీ కార్యాలయం, ఏజీ ఆఫీస్, పెన్షన్ ఆఫీస్, కలెక్టరేట్ తదితర కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. నా దీనావస్థను వివరిస్తూ ఇద్దరు రాష్ట్రపతులు (శీతాకాల విడిదికి వచ్చినప్పుడు), నలుగురు గవర్నర్లు, ఇద్దరు హోంమంత్రులకు వినతులు అందించినా ఇప్పటి వరకు ఫలితం లేకుండాపోయింది.

సీఎంకు నివేదిద్దామంటే అవకాశం ఇవ్వట్లేదు

గడిచిన పదకొండేళ్లుగా అనేక ప్రయత్నాలు చేస్తే ఇప్పటికి ఫైల్ నగర పోలీసు కమిషనర్ కార్యాలయం నుంచి డీజీపీ ఆఫీస్ ద్వారా ఏజీ కార్యాలయానికి చేరింది. ప్రస్తుతం అక్కడే ఆగిపోయింది. నా పరిస్థితిని వివరించి, న్యాయంగా నాకు రావాల్సిన పెన్షన్ ఇప్పించాలని కోరడానికి కొన్నేళ్లుగా ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేస్తున్నా. ప్రతిసారీ పోలీసులు నన్ను అడ్డుకుంటున్నారు. కనీసం నా అభ్యర్థనను కూడా సీఎం వరకు తీసుకువెళ్లట్లేదు' అని రాఘవేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజుతో పీటముడి

- కాలేజీ లాగిన్‌లో హాల్ టికెట్లు
- ఫీజులు చెల్లించాలని సందేశాలు
- అదనంగా బలవంతపు వసూళ్లు
- ఇబ్బందుల్లో ఇంటర్ విద్యార్థులు



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ఇంటర్మీడియట్ హాల్ టికెట్ల జారీకి ఫీజులతో ముడిపెడుతున్నాయి. కాలేజీ వార్షిక ఫీజులతోపాటు లైబ్రరీ, ల్యాబ్, ఇతరాత్ర పేరిట అదనపు ఫీజులను బాదేస్తున్నాయి. ఇంటర్మీయట్ బోర్డు వెబ్‌సైట్‌లో కేవలం కాలేజీ లాగిన్ ద్వారా మాత్రమే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అనుమతితో పాటు వాటిపై ప్రిన్సిపాల్ సంతకం ఉండాలనే నిబంధనతో ఫీజుల వసూళ్లకు మరింత కలిసి వస్తోంది. ఇప్పటికే 80 శాతం ఫీజులు వసూలు చేసుకున్న యాజమాన్యాలు మిగతా ఫీజుల వసూళ్లు చేసే పనిలో పడ్డారు. దీంతో ఏకంగా కాలేజీ పూర్తి స్థాయి ఫీజుల చెల్లించి హాల్‌టికెట్ పొందాలని బాహాటంగా విద్యార్థుల తల్లిదండ్రులకు సంక్షిప్త సమాచారం పంపించడం విస్మయానికి గురి చేస్తోంది. ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా అప్పులు చేసి కాలేజీ పూర్తి స్థాయి వార్షిక ఫీజులకు సిద్ధమవుతున్నా.. వివిధ పద్దుల పేరిట అదనపు ఫీజు వసూళ్లకు దిగుతున్నారు. అవి క్లియర్ చేస్తేనే హాల్ టికెట్లను ఇస్తామని తెగేసి చెబుతున్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంతో పాటు ప్రథమ సంవత్సరం విద్యార్థులకూ ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రైవేటు విద్యా సంస్థలు 74 శాతంపైనే

హైదరాబాద్-రంగారెడ్డి- మేడ్చల్ జిల్లాలో మొత్తం మీద ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు 74 శాతం పైనే ఉండగా, సర్కారు కాలేజీల్లో 26 శాతం విద్యార్థులు ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద ఇంటర్మీడియట్ విద్యార్థులు సుమారు 4,17,740 ఉండగా, అందులో 2,19,790 మంది ప్రథమ సంవత్సరం, 1,97,950 మంది ద్వితీయ సంవత్సం విద్యార్థులున్నట్లు తెలుస్తోంది.

తప్పనిసరి కాదు..

హాల్ టికెట్లపై ప్రిన్సిపాళ్ల సంతకాలు తప్పనిసరి కాదని బోర్డు అధికారులు స్పష్టం చేస్తున్నారు. వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అయితే.. కాలేజీ లాగిన్ ద్వారా కాకుండా హాల్ టికెట్ డౌన్‌లోడ్ కావడం లేదని విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్‌కు ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఫీజులతో ముడిపెడితే చర్యలు

ఇంటర్ హాల్ టికెట్లకు ఫీజులతో ముడి పెట్టవదని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారులు కాలేజీ యాజమాన్యాలకు సూచించాయి. ఫిర్యాదు అందితే మాత్రం చర్యలు తప్పవని పేర్కొంటున్నారు. హాల్ టికెట్లు జారీ చేయకుంటే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

మద్యం షాపు వద్ద ఘర్షణ: ఒకరి మృతి



ఘటనా స్థలం వద్ద రామారావు మృతదేహం

అమీర్‌పేట: మద్యం దుకాణం వద్ద నలుగురు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పరిధి జవహర్‌నగర్ సతీష్ వైన్ షాపు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కార్మిక నగర్‌కు చెందిన రామారావు (40) సెంట్రింగ్ మేస్త్రీ. గురువారం రాత్రి వైన్ షాపు వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న ముగ్గురు యువకులు అతనితో గొడవ పడ్డారు. రామారావుపై పిడిగుద్దుల కురిపించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి వచ్చిన ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలు నుంచి ఖైదీ పరారీ

కుషాయిగూడ: జైలులో శిక్ష అనుభవిస్తున్న జీవితఖైదీ పరారైన సంఘటన గురువారం తెల్లవారుజామున చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే.. ఖమ్మం జిల్లా, కొణిజెర్ల మండలం, మేకలకుంటతండాకు చెందిన మాలోతు హుస్సేన్ హత్య కేసులో నిందితుడు. నేరం రుజువు కావడంతో ఖమ్మం జిల్లా కోర్టు అతడికి 2015లో జీవితఖైదు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పడంతో అతడిని వరంగల్ జైల్‌కు తరలించారు. హుస్సేన్ పలుమార్లు పేరోల్‌పై వెళ్లి వచ్చాడు. వరంగల్ జైల్ తొలగించడంతో అతడిని ఇటీవల చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైల్‌కు తరలించారు. అతడి ప్రవర్తనను దృష్టిలో ఉంచుకుని ఓపెన్ జైల్‌లో వంట మనిషిగా పెట్టారు. గత జనవరిలోనూ 30 రోజులు పేరోల్ వెళ్లి వచ్చిన హుస్సేన్ గురువారం తెల్లవారుజామున జైల్ నుంచి తప్పించుకుని పారిపోయాడు. జైల్ సూపరింటెండెంట్ కళాసాగర్ ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారైన ఖైదీ ఆచూకీ దాదాపు గుర్తించినట్లు సమాచారం.

చిక్కడు.. దొరకడు..

పింకూ మోస్ట్ వాంటెడ్. 2016లో గ్రేట్ ఎస్కేప్!

- అప్పట్లో పంజా విసిరిన బవారియా గ్యాంగ్
- పింకు, మంగళ్‌లను పట్టుకున్న నగర పోలీసులు
- సిబ్బంది కళ్లుగప్పి తప్పించుకు పారిపోయిన పింకు
- ఆపై అక్కడి కోర్టు వరకు వెళ్లిన ఇతడి వ్యవహారం
- ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మరోసారి పరారీ
- ఈ కారణంగానే ఇప్పటికీ వాంటెడ్‌గానే


పింకు


దీపక్


సెహ్వాగ్


మంగళ్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని రెండు కమిషనరేట్ల పరిధిలో వరుస నేరాలకు పాల్పడిన సీరియల్ స్నాచర్స్ గ్యాంగ్ లీడర్ పింకు ఇక్కడి పోలీసులు 'సుపరిచితుడే'. ఆరేళ్ల క్రితం పంజా విసిరినప్పుడు ప్రత్యేక బృందాలను పరుగులు పెట్టించాడు. అప్పట్లో గ్యాంగ్ మెంబర్‌గా వచ్చిన అతను ఈసారి గ్యాంగ్ లీడర్‌గా మారాడు. 2016లో ఇతడు నగర పోలీసులను పరుగులు పెట్టించాడు. 'చిక్కడం-పారిపోవడం-దొరకడం-ఎస్కేప్ కావడం' ఈ ఎపిసోడ్ నేపథ్యంలో ఇప్పటికీ నాటి కేసుల్లో పింకు వాంటెడ్‌గానే ఉన్నాడు.

నాటి గ్యాంగ్‌కు మంగళ్ లీడర్...

ఉత్తరప్రదేశ్, షామ్లీ జిల్లాలోని 12 గ్రామాలకు చెందిన పలువురు దేశ వ్యాప్తంగా స్నాచింగ్స్ చేయడాన్నే వృత్తిగా ఎంచుకున్నారు. పోలీసు పరిభాషలో వీటిని బవరియా గ్యాంగ్స్‌గా పిలుస్తారు. ఆ జిల్లాలోని బడా కాన్పూర్ గ్రామానికి చెందిన మన్‌ప్రీత్ అలియాస్ మంగళ్ నేతృత్వంలో పని చేసిన ముఠాలో పింకుతో పాటు రాజీవ్, గోవింద్ సభ్యులుగా ఉన్నారు. 2016 ఫిబ్రవరిలో సిటీకి వచ్చిన మంగళ్ గ్యాంగ్ శాస్త్రీపురంలో డెన్ ఏర్పాటు చేసుకుని సైబరాబాద్ పరిధిలో స్నాచింగ్స్ చేసింది. ఆ ముఠాలో సభ్యుడిగా ఉన్న గోవింద్‌ను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. అప్పుడు తప్పించుకుని పారిపోయిన మంగళ్ పది రోజుల్లోనే మళ్లీ సిటీని టార్గెట్ చేశాడు.

గాయం కావడంతో ఆస్పత్రికి...

గత నెలలో పంజా విసిరిన బవారియా గ్యాంగ్‌కు నేతృత్వం వహించిన పింకు అప్పట్లో పోలీసులను పరుగులు పెట్టించి, ముచ్చెమటలు పోయించాడు. 2016లో రెండో దఫా జరిగిన స్నాచింగ్స్‌ను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ముమ్మరంగా వేటాడి వారం రోజుల్లోనే పింకును పట్టుకున్నారు. ఇతడిని అదుపులో ఉంచుకుని మిగిలిన వారి కోసం ప్రయతిస్తుండగా అదును చూసుకుని ఎస్కేప్ అయ్యాడు. దీనిని తీవ్రంగా పరిగణించిన అధికారులు నయాబస్ గ్రామంలో అతడి ఆచూకీ కనిపెట్టి మరోసారి పట్టుకున్నారు. ఈ ప్రయత్నాల్లో అతడికి గాయం కావడంతో మన పోలీసులే అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. దీనిని పింకు తనకు అనువుగా మార్చుకున్నాడు.

చికిత్స పొందుతూ మరోసారి...

పింకుకు ప్రాథమిక చికిత్స పూర్తయిన తర్వాత నగరానికి తీసుకురావాలని పోలీసులు భావించారు. అయితే అనూహ్యంగా ఈ విషయం అక్కడి న్యాయస్థానం వరకు వెళ్లడంతో చికిత్స పూర్తయ్యే వరకు అరెస్టు చేయవద్దని ఆదేశాలు వచ్చాయి. దీంతో అతడి కోసం ఓ ప్రత్యేక బృందం కొన్ని రోజులు అక్కడే ఉండి కన్నేసి ఉంచింది. గాయాల నుంచి కోలుకున్న పింకు ఆ విషయం బయటపడనీయకుండా నటిస్తూ అదును చూసుకుని హాస్పిటల్ నుంచి పారిపోయాడు. దీంతో అవాక్కైన అధికారులు నగరం నుంచి అదనపు సిబ్బందిని పంపారు. వీరి కృషి ఫలితంగా సోను చిక్కగా... పింకు సహా ముగ్గురూ పరారీలోనే ఉండిపోయారు. ఆ కేసులతో పాటు తాజా కేసుల్లోనూ పింకు వాంటెడ్‌గా ఉన్నాడు.

3 రోజుల్లో 14 నేరాలు...

షామ్లీ జిల్లాలోని అహ్మద్‌ఘడ్, బడా కాన్పూర్ కాలా, నయాబస్ గ్రామాలకు చెందిన సోను కుమార్, రాజీవ్ ఖోఖ్లీ, పింకు కుమార్‌లతో ముఠా కట్టిన మంగళ్ 2016 మార్చి రెండో వారంలో సిటీకి చేరుకున్నాడు. వస్తూవస్తూ ఢిల్లీ నుంచి రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసి తీసుకువచ్చాడు. పీర్జాదిగూడ ఆదర్శనగర్ కాలనీలో డెన్ ఏర్పాటు చేసుకున్న వీరు 2016 మార్చి 13, 14, 15 తేదీల్లో జంట కమిషనరేట్ల పరిధిలో 12 స్నాచింగ్స్ చేశారు. వీటితో పాటు మరో రెండు చోట్ల స్నాచింగ్‌కు యత్నించారు. అప్పట్లో ఈ కేసులను ఛేదించడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

మూడు దఫాల్లోనూ ఒక్కరు చొప్పునే...

బవారియా గ్యాంగ్ 2016–23 మధ్య నగరంపై మూడుసార్లు పంజా విసిరింది. 2016 ఫిబ్రవరిలో మంగళ్ నేతృత్వంలో పింకు సహా నలుగురు వచ్చి స్నాచింగ్స్ చేయగా... గోవింద్ ఒక్కడే చిక్కాడు. అదే ఏడాది మార్చిలో మంగళ్ లీడర్‌గా పింకుతో పాటు మరో ఇద్దరితో కలిసి వచ్చి నేరాలు చేశారు. ఆ కేసుల్లో కేవలం సోను మాత్రమే చిక్కాడు. తాజాగా గత నెలలో పింకు నేతృత్వంలో మంగళ్, లక్ష్మణ్, సెహ్వాగ్ రాచకొండ, హైదరాబాద్‌ల్లో ఏడు స్నాచింగ్స్ సహా తొమ్మిది నేరాలు చేశారు. ఈసారి మంగళ్ మాత్రమే చిక్కగా... పింకు సహా ముగ్గురూ పరారీలోనే ఉన్నారు. సొత్తు సైతం వారి వద్దే ఉండిపోవడంతో ఏమాత్రం రికవరీ కాలేదు.

వృత్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్..ప్రవృత్తి గంజాయి విక్రయం


నిందితులు రాజు సింగ్, దేవానంద్

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటు పడిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జీతం సరిపోకపోవడంతో గంజాయి విక్రేతగా మారాడు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని ఛత్రపతి శివాజీనగర్‌కు చెందిన రాంతీర్థ్ దేవానంద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను గంజాయికి బానిసయ్యాడు. జీతం సరిపోకపోవడంతో తానే గంజాయి విక్రయాలు చేపట్టాడు. ఈ నెల 7న అతను ఫిలింనగర్‌లో గంజాయి సరఫరాదారు రాజుసింగ్ నుంచి రెండు కేజీల గంజాయి ప్యాకెట్‌ను తీసుకుంటూ పట్టుబడ్డాడు. తరచూ ఇదే ప్రాంతంలో దేవానంద్‌కు అతను గంజాయి తెచ్చిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందడంతో నిఘా వేసిన పోలీసులు నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి 4.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఎన్డీపీఎస్ యాక్ట్ నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

సైబరాబాద్ కమిషనరేట్ పరిశీలన

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్‌లోని సైబర్ అకాడమీ, పాలసీ అడ్వకసీ, సైబర్‌ల్యాబ్, స్కిల్లింగ్ టీమ్‌ను కేంద్ర హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి శివగామిసుందరినంద, రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. సైబరాబాద్ కమిషరేట్‌లో వీటి ఏర్పాటు, పనితీరుపై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, జాయింట్ సీపీ అవినాష్‌మహంతి వారికి వివరించారు. రాష్ట్ర పోలీస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మొదటి సారిగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణకు దక్కుతుందన్నారు. టీఎస్‌పీసీసీని అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేశారని, డేటా కూడా అదే స్థాయిలో ఉందన్నారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు రాజేష్‌కుమార్, నారాయణ్‌నాయక్, యోగేష్‌గౌతమ్, కల్మేశ్వర్, విశ్వజిత్ కంపాటి పాల్గొన్నారు.

పెట్రోల్ పంపు దాడి కేసులో నిందితుల రిమాండ్

- పీడీ యాక్ట్‌కు ప్రతిపాదనలు
- నిందితుల కుటుంబాల సాంఘిక బహిష్కరణ

మణికొండ: అర్ధరాత్రి పెట్రోల్ పంపులో ఓ యువకుడిపై దాడి చేసి అతడి మృతికి కారణమైన కేసులో ముగ్గురు నిందితులను నార్సింగి పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జన్వాడ గ్రామానికి చెందిన నరేందర్, అనోక్, మల్లేష్ ఈ నెల 6న కారులో పెట్రోల్ పోయించుకునేందుకు గ్రామ చౌరస్తాలోని పార్వతి పెట్రోల్ పంపునకు వెళ్లారు. పెట్రోల్ పోయించుకున్న అనంతరం వారు కార్డు ఇవ్వగా, స్వైపింగ్ మిషన్ లేదని నగదు ఇవ్వాలని కోరడంతో సిబ్బందిపై దాడి చేశారు. ఈ సందర్భంగా ప్రొద్దటూరు గ్రామానికి చెందిన సంజయ్ అనే వ్యక్తి కణతపై కొట్టడంతో అతను కుప్పకూలాడు. నిందితులు అక్కడినుంచి పారిపోగా తోటి సిబ్బంది సంజయ్‌ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెట్రోల్ పంపు యజమాని మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గురువారం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించిందని ఏసీపీ తెలిపారు.


ఆరు కేసులు గుర్తింపు

నిందితులపై గతంలో పలు కేసులు ఉండటంతో వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ వి.శివకుమార్ తెలిపారు. వారిపై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నట్లు గుర్తించామని, గ్రామంలో పలువురిని భయ భ్రాంతులకు గురిచేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. వాటన్నింటినీ క్రోడీకరించి సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు.

సాంఘిక బహిష్కరణ...

సంజయ్ అనే యువకుడి హత్యతోపాటు గతంలోనూ అనేక నేరాలకు పాల్పడి గ్రామ ప్రతిష్టను దెబ్బతీస్తుండటంతో జన్వాడ గ్రామస్తులు వారి కుటుంబాలను సాంఘిక బహిష్కారం చేశారు. గ్రామంలోని కులసంఘాలు, గ్రామపంచాయతీ అందుకు అనుగుణంగా తీర్మాణాలు చేసి వాటి పత్రాలను నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు సీఐని కోరారు.

రాజస్థానీ దొంగల ముఠా అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

చంచల్‌గూడ: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న రాజస్థానీ దొంగల ముఠాను గురువారం మాదన్నపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జానయ్య, డీఐ అర్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత నెల 24న రాత్రి మాదన్నపేట మార్కెట్‌లోని జీకే ట్రేడర్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి రూ. 1.9 లక్షల నగదు, రూ. 25 వేల విలువైన సిగరెట్ బాక్స్‌లు ఎత్తుకెళ్లారు. షాపు యజమాని మహ్మద్ ఆదమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం మాదన్నపేట పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సిగరెట్ ప్యాకెట్లను విక్రయించేందుకు వచ్చిన బాగారామ్ చున్నీలాల్ చౌదరి అనే వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించాడు. బుండా రామ్, దినేష్‌కుమార్, మాణిక్‌చంద్ కుమావత్‌తో కలిసి దొంగలించిన బైక్‌పై తిరుగుతూ మార్కెట్‌లో రెక్కీ నిర్వహించి జీకే ట్రేడర్స్ షాప్‌లో చోరీకి పాల్పడినట్లు వెల్లడించాడు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి రూ. 84 వేల నగదు, హోండా యాక్టీవా, 150 సిగరెట్ ప్యాకెట్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

2 నెలలు..రూ.7 కోట్లు!

ఇదీ సైబర్ నేరస్తులు కొట్టేసిన మొత్తం

- సైబరాబాద్‌లో ఇప్పటివరకు 388 కేసులు నమోదు
- అత్యధికంగా 181 పెట్టుబడుల పేరిట మోసాలే
- బాధితుల్లో ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ నిపుణులే అధికం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో సైబర్ మోసాలు నానాటికి పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది తొలి రెండు నెలల్లో సైబరాబాద్‌లో 388 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో బాధితులు రూ.7 కోట్లు మోసపోయారు. వీటిలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులే అత్యధికంగా కావడం గమనార్హం. 181 పెట్టుబడి మోసాల కేసుల్లో బాధితులు రూ.6.60 కోట్లు కోల్పోగా.. 94 కస్టమర్ కేర్ మోసాల్లో రూ.3.70 కోట్లు, 113 అడ్వర్టైజ్‌మెంట్ ఫ్రాడ్స్‌లో రూ.95 లక్షలు మోసపోయారు. గతేడాది సైబరాబాద్‌లో 657 పెట్టుబడి మోసాలు జరిగాయి. సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ రితిరాజ్ గురువారం వివరాలు వెల్లడించారు.

ఈ ప్రాంతాల్లోనే బాధితులు ఎక్కువ..

విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ నిపుణులు, గృహిణులు ప్రత్యామ్నాయ మార్గాల్లో డబ్బు సంపాదించాలనే అత్యాశతో సైబర్ మోసాలకు గురవుతుంటారు. బాధితుల్లో 21–30 ఏళ్ల వయసు వారే ఎక్కువగా ఉంటున్నారు. వర్గాల వారీగా చూస్తే.. గత రెండు నెలల్లో 167 మంది ప్రైవేట్ ఉద్యోగులు, 48 మంది ఐటీ, 28 మంది వ్యాపారస్తులు, 24 మంది గృహిణులు, 21 మంది విద్యార్థులు, 13 మంది ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయిస్, ఏడుగురు నిరుద్యోగులు, ఐదేసి మంది కార్మికులు, వైద్యులు ఉన్నారు. గేమింగ్ యాప్‌ల పేరుతో పిల్లలను, వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి వృద్ధులనూ మోసం చేస్తున్నారు. మాదాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల నుంచే ఎక్కువగా సైబర్ ఉచ్చులో పడుతున్నారు. బాధితులు ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ నిపుణులే ఎక్కువగా ఉండటం గమనార్హం.



అత్యాశే కారణం

షార్ట్ కట్‌లో డబ్బులు సంపాదించాలనే అత్యాశే సైబర్ మోసాల బారిన పడటానికి ప్రధాన కారణం. నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లతో సైబర్ నేరస్తులు అమాయకులను వలలో వేసుకుంటున్నారు. తొలుత చిన్న మొత్తంలో పెట్టుబడులకు లాభాలను ఇచ్చి.. నమ్మించి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్‌మెంట్ చేయగానే మాయమైపోతారు.

– రితిరాజ్, డీసీపీ సైబరాబాద్ సైబర్ క్రైమ్స్

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- నగర పోలీసు అధికారిణులకు కొత్వాల్ సూచన
- ఐసీసీసీలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: 'మహిళలు ఓ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. వారికి అవకాశాలు ఎవరూ ఇవ్వరు... వారే అందిపుచ్చుకోవాలి' అని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పోలీసు అధికారిణులకు సూచించారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిషనరేట్‌లో పని చేస్తున్న మహిళా హోంగార్డు నుంచి మహిళా ఇన్‌స్పెక్టర్ వరకు మొత్తం 117 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. 'గతేడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్‌స్పెక్టర్ మధులతకు శాంతిభద్రతల విభాగంలో లాలాగూడ ఠాణా ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చాం. ఆ తర్వాత ఇలాంటి కీలక బాధ్యతలు తీసుకోవడానికి మహిళా అధికారులు ముందుకు రావట్లేదు. ఈ కారణంగానే ప్రస్తుతం మధులతతో పాటు ట్రాఫిక్ వింగ్‌లో ఇద్దరు మాత్రమే మహిళా ఎస్‌హెచ్‌ఓలు ఉన్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన యువ మహిళా ఎస్సైలు సైతం నా కార్యాలయానికి వచ్చి శాంతిభద్రతల విభాగం, ట్రాఫిక్ వింగ్ కాకుండా సున్నితమైన విభాగాలకు మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సిటీ పోలీసులో ఉన్న 18432 మందిలో 11.5 శాతం మహిళ సిబ్బంది, అధికారులు ఉన్నారు' అని కొత్వాల్ ఆనంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ (పరిపాలన) పరిమళ హన నూతన్, ఐసీసీసీ డీసీపీ డి.సునీత రెడ్డి, అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ (ఎస్బీ) ఎం.విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనూ ముందుండాలి

- రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్
- సైబరాబాద్ కమిషనరేట్‌లో ఘనంగా మహిళాదినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీజీపీ అంజనీకుమార్

రాయదుర్గం: స్వీయ రక్షణతోపాటు సామాజిక సేవలోనూ మహిళలు ముందుండాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో గురువారం మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి డీజీపీ బహుమతులను అందజేశారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ ఒక పెద్ద కుటుంబం లాంటిదన్నారు. మహిళా సిబ్బంది తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ సమాజానికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ 'ఎంబ్రేస్ ఈక్విటీ– డిజిటల్: ఇన్నోవేషన్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ' అనే థీమ్‌తో ఈ ఏడాది మహిళాదినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఐటీ కారిడార్‌లో అత్యధిక సంఖ్యలో మహిళలు విధులు నిర్వహిస్తున్నారని, వారందరికీ షీటీమ్స్ రక్షణ కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు, అబ్బాయిలను, అమ్మాయిలను సమానంగా చూడాలన్నారు. సిబ్బంది తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. వృత్తిపరంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ నికిత్‌పంత్, డీసీపీ కవిత, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, ఏడీసీపీ క్రైమ్స్ కవిత, ఏడీసీపీ రాజేంద్రనగర్ సాధనా రష్మి పెరుమాల్, సీఏఓ అడ్మిన్ చంద్రకళ, గీత, షీటీమ్స్ ఇన్‌స్పెక్టర్ సునీత, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

మాటువేసి.. కత్తులతో దాడి చేసి..

- గిరిజన యువకుడి దారుణ హత్య
- బాలాపూర్‌లో వరుస ఘటనలు
- నిందితులపై చర్యలకు బీజేపీ, గిరిజన సంఘాల డిమాండ్


పవన్ నాయక్ (ఫైల్)

పహాడీషరీఫ్: ప్రేమ వ్యవహారం కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో చోటుచేసుకున్న గిరిజన యువకుడి హత్యోదంతం ఘటన మరువక ముందే బాలాపూర్‌లో మరో గిరిజన యువకుడు బుధవారం రాత్రి దారుణ హత్యకు గురికావడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలం, కుప్పగండ్ల కేస్లీతండాకు చెందిన డెకావత్ పూల్‌సింగ్ భార్యాపిల్లలతో 20 ఏళ్ల క్రితం షాహీన్‌నగర్‌లోని వాదే ఉమర్ బస్తీకి వలస వచ్చారు. మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు పవన్ నాయక్(22) సంతానం. ఇంటర్‌తో చదువు మానేసిన పవన్ ఏడాదిగా సమీప బస్తీలో ఉండే మరో వర్గానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం యువతి ఇంట్లో తెలియడంతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి మూత్ర విసర్జన కోసం బయటికి వచ్చిన పవన్‌ను అప్పటికే కాపుకాసి ఉన్న యువతి కుటుంబ సభ్యులు సద్దాం, గౌస్ కత్తులతో దాడి చేశారు. కడుపు, వీపు, మెడ భాగాల్లో విచక్షణా రహితంగా పొడిచి పరారయ్యారు. కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మహేశ్వరం డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పవన్ మృతి విషయం తెలుసుకున్న బంధుమిత్రులు పెద్ద ఎత్తున బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితులకు నేర చరిత్ర ఉన్నట్లు తెలిసింది.


బాలాపూర్ పోలీస్ స్టేషన్ ముందు గిరిజనుల ఆందోళన

క్లుప్తంగా

అవయవదానం చేసిన మహిళలకు సత్కారం



లివర్ దానం చేసిన మహిళలతో డాక్టర్ చెరియన్

బంజారాహిల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూట్ గురువారం నగరంలోని ఫిమేల్ ఆర్గాన్ డోనర్స్‌ను ఘనంగా సత్కరించిందింది. వారి ధైర్యాన్ని కొనియాడుతూ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. అవయదానం చేసిన వారిని సీనియర్ లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ టామ్ చెరియన్ సత్కరించారు. ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న వీరు నిజమైన త్యాగమూర్తులని కొనియాడారు.

'విరించి'లో కిడ్నీ దినోత్సవం



వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

వెంకటేశ్వరకాలనీ: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని విరించి ఆస్పత్రిలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'వేచి ఉండొద్దు.. ఆలస్యం చేయవద్దు.. మీ మూత్రపిండాలను ప్రతిరోజూ సంరక్షించుకోండి' అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చికిత్స ముగిసిన తర్వాత జీవనంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈఓ డాక్టర్ సాయి రవి శంకర్, డాక్టర్ కేఎస్ నాయక్ మాట్లాడుతూ, తమ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి అత్యంత ఆధునిక పద్ధతుల్లో అత్యున్నత శ్రేణిలో చేస్తున్నామని, చివరి దశ మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వారిలో అత్యుత్తమ ఫలితాలు రాబడుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

'టీఎక్స్' ఆధ్వర్యంలో వాకథాన్



పాల్గొన్న టీఎక్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది

బంజారాహిల్స్: ప్రపంచ కిడ్నీ డే, నో స్మోకింగ్ డేల సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని టీఎక్స్ హాస్పిటల్స్ గురువారం 5కే రన్ నిర్వహించింది. ఆస్పత్రి వైద్యులు, నర్సులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నో స్మోకింగ్ అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ పొగ తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు.

రక్త శుద్ధిలో కిడ్నీలే కీలకం



పంజగుట్ట: మూత్ర పిండాల మార్పిడితో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చునని డక్కన్ ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగం హెడ్ డాక్టర్ పవన్ కుమార్‌రావు అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారికి, కిడ్నీ దాతలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసి శరీరభాగాలకు సరఫరా చేయడంలో కిడ్నీల పాత్ర గణనీయంగా ఉంటుందన్నారు. అటువంటి కిడ్నీల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి వైస్ ప్రసిడెంట్ ప్రేమ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలక మండలిని నియమించాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలక మండలిని నియమించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముడి మార్టిన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన దళిత హక్కుల పోరాట సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, కమిషన్‌కు మూడేళ్లుగా చైర్మన్, సభ్యులను ప్రభుత్వం నియమించలేదన్నారు. దీంతో దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఆ వార్గలపై దాడులు జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలక మండలిని నియమించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మార్టిన్ కోరారు.

87 బస్తీలకు పాక్షిక నీటి సరఫరా

- 201 ట్యాంకర్ల ద్వారా గల్లీలకు నీరు
- తొలి రోజు ఒక్క ఫిర్యాదు రాలేదన్న అధికారులు



నీటి సరఫరా బంద్ కావడంతో బస్తీలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: గోదావరి పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 9, 10 తేదీల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గత వారం రోజులుగా జలమండలి డివిజన్–6 పరిధిలో విస్తృత ప్రచారం చేసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టికాన, వెంగల్‌రావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, ఎస్పీఆర్‌హిల్స్, ఎస్ఆర్‌నగర్, ఫతేనగర్, సోమాజిగూడ, ఎల్లారెడ్డిగూడ సెక్షన్ల పరిధిలో జలమండలి సిబ్బంది నీటి సరఫరాలో అంతరాయంపై మైక్‌ల ద్వారా ప్రచారం చేయడమే కాకుండా ఈ రెండు రోజులూ నీటిని పొదుపుగా వాడుకోవాలని కూడా సూచించారు.

- ఇలా ఉండగా, గురువారం పలుచోట్ల పాక్షికంగా నీటి సరఫరా చేపట్టారు. ట్యాంకర్లు వెళ్లలేని గల్లీల్లో 20 నిమిషాల పాటు నీటి సరఫరా చేపట్టి గృహావసరాల కోసం సమస్యలు చాలా వరకు తగ్గించగలిగారు. పాక్షిక నీటి సరఫరాతో ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు.
- సుమారు 20,700 కనెక్షన్లకు మంచినీటి పాక్షిక సరఫరా చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరో వైపు నీటి సరఫరా తగ్గిన ప్రాంతాలకు ఒక్క రోజే 201 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. ఇందులో బస్తీలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ హాస్టళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు కూడా ఉన్నాయి.
- డివిజన్–6 పరిధిలోని 11 సెక్షన్ల పరిధిలో 87 బస్తీలకు పాక్షిక నీటి సరఫరా చేపట్టిన జలమండలి అధికారులు మిగతా చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూశారు. శుక్రవారం కూడా ఇదే రీతిలో నీటి సరఫరా చేపడతామని అధికారులు పేర్కొన్నారు.

కమర్షియల్ ట్యాంకర్లు బంద్



గోదావరి పైప్‌లైన్ మరమ్మతుల వల్ల ఈ నెల 9, 10 తేదీల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వారం రోజుల నుంచి విస్తృత ప్రచారం చేసి ప్రజలను అప్రమత్తం చేశాం.గురువారం 87 బస్తీల్లో పాక్షికంగా నీటిని సరఫరా చేశాం. మా పరిధిలో మొత్తం 160 బస్తీలు ఉన్నాయి. ఈ రెండు రోజులూ కమర్షియల్ ట్యాంకర్ల నీటి సరఫరాను బంద్ చేశాం . వాటిని ఉచిత నీటి సరఫరా కోసం వినియోగిస్తున్నాం. 11 సెక్షన్ల పరిధిలో మొత్తం 109 ట్యాంకర్లు ముమ్మరంగా నీటిని సరఫరా చేస్తున్నాయి. మా పరిధిలో 112 మంది అధికారులు, సిబ్బందితో కలిసి ఓ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాం. ప్రజలకు నీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నాం. ఈ గ్రూప్ ద్వారా ఎక్కడెక్కడ నీళ్లు అవసరం, ట్యాంకర్లు సక్రమంగా వెళ్తున్నాయా లేదా..? అన్నది పర్యవేక్షిస్తున్నాం. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, అధికారులు టీమ్ వర్క్‌తో మొదటి రోజు విజయవంతంగా నీటిని సరఫరా చేశారు. రెండో రోజూ కూడా సమస్యలు రాకుండా సరఫరా చేస్తాం. ఎక్కడా చిన్న ఫిర్యాదు కూడా అందలేదు. ఇదిలా ఉండగా, ఫిలింనగర్ సెక్షన్ పరిధిలో ప్రశాసన్‌నగర్ రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు సరఫరా అవుతాయి. ఈ సెక్షన్‌లో మాత్రం ఎలాంటి నీటి అంతరాయం లేదు. మరో వైపు నిమ్స్, ప్రగతి భవన్, ఐఏఎస్ క్వార్టర్స్, ఆలయాలు, మసీదులకు కూడా ఇబ్బందులు తలెత్తకుండా నీటిని సరఫరా చేశాం.

– హరిశంకర్, జీఎం, జలమండలి డివిజన్–6

బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆయుర్వేద వైద్యులు

వెంగళరావునగర్: యుక్త వయసులో ఉన్న బాలికలు తప్పనిసరిగా తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల వైద్యులు పి.యశోద, సులోచన, సుష్మ, రేష్మ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం తెలంగాణ రాష్ట్ర విశ్వ ఆయుర్వేద పరిషత్ మహిళా విభాగం, ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఖైరతాబాద్ విద్యాశాఖ మండల పరిధిలోని పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, బహిష్ట సమయంలో అనేక రకమైన చికాకులు వస్తుంటాయని, ముఖ్యంగా నీరసంగా, మానసిక ఆందోళనగా కూడా ఉంటుందన్నారు. ఈ విషయంలో బాలికలు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన రోజుల్లాగానే మంచి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, శరీరం, దుస్తులు, పరిసరాలు మరింత పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు: డీఎంసీ

వెంగళరావునగర్: సర్కిల్ పరిధిలో ఎక్కడైనా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ ఎ.రమేష్ హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో గురువారం ఫుట్‌పాత్‌లను తొలగించారు. ఈ క్రమంలో పలువురు షాపుల నిర్వాహకులు జీహెచ్ఎంసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దాంతో జీహెచ్ఎంసీ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ వచ్చి ఆయా దుకాణదారులతో చర్చించారు. అనంతరం మైసమ్మ ఆలయం నుంచి దాదాపు రత్నదీప్ మార్కెట్ వరకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ, గతంలో చాలాసార్లు హెచ్చరించామని, అయినప్పటికీ అనేక మంది దుకాణదారులు వినకపోవడంతో పాటు మళ్లీ అదేరీతిలో ఆక్రమణలు చేస్తున్నారన్నారు. ఇకపై ఇలా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే మరింత కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ మంజుభార్గవి, న్యాక్ ఇంజనీర్లు రాజేష్, అభినవ్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సీవరేజి సమస్యను పరిష్కరించండి

రహమత్‌నగర్: బస్తీలోని సీవరేజి సమస్యను పరిష్కారించాలని జలమండలి ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆశయ్యనగర్ బస్తీ బ్రాంచి ఎంఐఎం అధ్యక్షుడు షేక్ జహంగీర్ ఆరోపించారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని ఆశయ్యనగర్‌లో గురువారం బస్తీ వాసులతో కలిసి మురుగునీటి సమస్యను ఆయన పరిశీలించారు. తమ బస్తీలోని సమస్యను పరిష్కరించాలని ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు పలుమార్లు జలమండలి ఉన్నతాధికారులకు లేఖలు రాసిన ఇప్పటి వరకు పరిష్కరించలేదని జహంగీర్ వాపోయాడు. ఎంఐఎం నాయకులు ఖాజామోహినొద్దీన్, నబీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నగర్ బస్తీ కమిటీ ఎన్నిక

రహమత్‌నగర్: కేసీఆర్ నగర్ బస్తీ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాధవ్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, రాజు, జనరల్ సెక్రటరీగా ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా రాము, మేఘన పద్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా దుర్గయ్య, పరశురాములు, కమాలొద్దీన్, కుమార్, కోశాధికారి ఆంజనే యులును ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులు బస్తీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్సూర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

12న 'స్టడీ అబ్రాడ్ ఫండింగ్ ఎక్స్‌పో'

పంజగుట్ట: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి స్కాలర్‌షిప్, బ్యాంకు రుణం పొందేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా ఉచితంగా 'స్టడీ అబ్రాడ్ ఫండింగ్ ఎక్స్‌పో (సేఫ్ 2023)' నిర్వహిస్తున్నట్లు వుయ్ మేక్ స్కాలర్స్ నిర్వాహకులు అర్జున్ ఆర్ కృష్ణ తెలిపారు. గురువారం సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో ఆయన దామిని మహాజన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12వ తేదీన బేగంపేట లోని మనోహర్ హోటల్‌లో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటలవరకు ఈ ఎక్స్‌పో కొనసాగుతుందన్నారు.

షుగర్, బీపీ అదుపులో ఉంటే ఆరోగ్యం పదిలం



లక్డీకాపూల్ : నగరంలో కిడ్నీ సమస్యలు నానాటికి పెరుగుతున్నాయని నిమ్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. నివారణే సమస్యకు ప్రధాన మార్గంగా ఆయన పేర్కొన్నారు. గురువారం నిమ్స్‌లో అంతర్జాతీయ కిడ్నీ డే సందర్భంగా కిడ్నీ అవేర్‌నెస్ వాక్ నిర్వహించారు. అనంతరం లెర్నింగ్ సెంటర్‌లో నిమ్స్ నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ షుగర్, బీపీ అదుపులో ఉంచుకోగలిగితే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఇప్పటికే నగరవాసులు ఆరోగ్య సమస్యలపై చైతన్యవంతులవుతున్నారని, మరింత అవగాహనతో అనారోగ్యాన్ని అధిగమించాలని కోరారు. మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిమ్స్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రభుత్వ సహకారంతో ఆస్పత్రిలో ఎన్నో క్లిష్టతరమైన ఆరోగ్య సమస్యలకు సైతం సునాయాసంగా చెక్ పెట్టగలుగుతున్నామన్నారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ నాయడు కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, నెఫ్రాలజీ విభాగం అధిపతులు డాక్టర్ గంగాధర్, శ్రీభూషణ్‌రాజు, స్వర్ణలత పాల్గొన్నారు.

నేడు నిమ్స్‌మేలో ఉమెన్ హ్యాకథాన్

వెంగళరావునగర్: పరిశ్రమలు, టెక్నాలజీ రంగాల్లో లింగ విభేదాన్ని అధిగమించే లక్ష్యంతో శుక్రవారం యూసుఫ్‌గూడ పరిధిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్ మే) లో ఉమెన్ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిశ్రమలు, అకాడమీ, రీసెర్చ్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లోని మహిళలకు ఎదురయ్యే సమస్యలపై పరిష్కారాలు తెలిపేందుకు, ఇన్నోవేటర్స్‌గా వారిలో విశ్వాసాన్ని నింపేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందన్నారు. నిమ్స్‌మే క్యాంపస్‌లో ఉదయం 10 గంటలకు హ్యాకథాన్ ప్రారంభమవుతుందని, ఆసక్తిగల మహిళలు పాల్గొనాలని కోరారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందజేసిన విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్ (వాసవి సేవా కేంద్రం)లో బ్రూస్‌లీ డ్రాగన్ సాయి మార్షల్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం కరాటేలో నెల రోజుల పాటు శిక్షణ ఇప్పించారు.శిక్షణ పూర్తయిన విద్యార్థినులకు గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోన్ డిప్యూటీ ఈఓ శ్యాముల్ రాజు, స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ సింగ్, కరాటే కోచ్‌లు సాయి యాదవ్, శ్రీధర్, శ్రీకాంత్, కిషోర్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు బహుముఖంగా రాణించడం గర్వకారణం



మహిళలను సన్మానించిన కాంగ్రెస్ నాయకురాలు ఆలీస్

వెంగళరావునగర్: మహిళలు ఇటు గృహిణులుగానే కాకుండా అటు వివిధ రంగాల్లో రాణించడం ఎంతో గర్వకారణంగా ఉందని కాంగ్రెస్ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ సీనియర్ నాయకురాలు జింకా ఆలీస్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని రంగాల్లో తమ శక్తి, యుక్తులతో రాణిస్తున్న మహిళలు సమాజాభివృద్ధి కోసం తప్పనిసరిగా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై మరింతగా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ మహిళా నేతలు, జవహర్‌నగర్ బస్తీ మహిళలు పాల్గొన్నారు.

కరీంనగర్ సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



రాజ్యసభ సభ్యుడు జయరాం రమేష్‌కు స్వాగతం పలుకుతున్న రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యేందుకు వచ్చిన అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మీడియా కన్వీనర్, రాజ్యసభ సభ్యుడు జయరాం రమేష్, కొప్పుల రాజుకు గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. జాతీయ నేతలకు స్వాగతం పలికిన అనంతరం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర గురువారం ముగియనున్న నేపథ్యంలో అంబేడ్కర్ మైదాన్‌లో నిర్వహించిన బహిరంగ సభకు ఖైరతాబాద్ నియోజక వర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు నేతలు హాజరయ్యారన్నారు. 2004లో సోనియా గాంధీ ఇదే మైదానంలో బహిరంగ సభలో తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తానని హామీ ఇచ్చారని, మళ్లీ ఇదే చోటు నుంచి ఆమెకు కృతజ్ఞతను తెలిపేందుకు ఈ సభను వేదికగా మల్చుకోవడం జరిగిందన్నారు.

చల్లా వెంకట్రామిరెడ్డికి అభినందనల వెల్లువ



వెంకట్రామిరెడ్డిని అభినందిస్తున్న నేతలు

బంజారాహిల్స్: గద్వాల జోగులాంబ జిల్లా ఆలంపూర్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిని ఎమ్మెల్యే కోటాలో శాసనమండలి సభ్యుడిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు నేతలు పెద్ద సంఖ్యలో విచ్చేసి అభినందనలు తెలిపారు. ఆలంపూర్ నియోజక వర్గంలో వడ్డేపల్లి మండలం, పైపాడు గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం అధ్యక్షుడు ఎం.నాగేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, శాంతి నగర్ రమణ, లోకేష్‌రెడ్డి, రాజోలి గోవర్ధన్‌రెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నియోజక వర్గం నుంచి నేతలు, కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి తన సంతోషాన్ని పంచుకున్నారు. నియోజక వర్గ ప్రజల ఆశీస్సులతోనే తనకు సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి అన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ జ్ఞానేందర్‌రెడ్డి

ఫిలింనగర్: ఈ నెల 4వ నుంచి 10వ తేదీ వరకు జరుపుకుంటున్న జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎస్ఎస్ఎల్ బిల్డింగ్‌లో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ జ్ఞానేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉద్యోగులకు రోడ్డు భద్రత, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎల్ గ్రూప్ డైరెక్టర్ రత్నగోపాల్, దివ్యరాజ్ పిళ్లై, వై. మధుబాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెంగళరావునగర్: అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులు, టీచర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) టీము ఏరియా ఇన్‌చార్జి కొండప్ప అన్నారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం డీఆర్ఎఫ్ టీమ్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగితే ఆందోళన చెందకుండా వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కొండప్ప అన్నారు. మంటలు, పొగ వస్తున్న ప్రాంతం నుంచి దూరంగా వెళ్లాలన్నారు. సాధ్యమైతే దూరం నుంచే నీటిని, మట్టిని, ఇసుకను మంటలపై చల్లాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు తబితా జాసన్, శాంతి, హనుమంతరావు, మహ్మద్ ఆలీ, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

క్రిస్టియన్లకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

- వైఎస్ఆర్‌టీపీ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు శాంతిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్ శాంతిరాజ్

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 9 సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం క్రిస్టియన్లకు చేసింది ఏమీలేకపోగా, తీవ్రంగా మోసం చేసిందని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు జి.డేవిడ్ శాంతిరాజ్ అన్నారు. ప్రతీ క్రిస్మస్ పండక్కి క్రిస్టియన్ ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపనలు చేయడం తప్ప నిర్మించింది లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన డేవిడ్ శాంతిరాజ్‌కు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. క్రిస్టియన్ ఆత్మగౌరవ భవనం కావాలని తాము అడగలేదని, వారే ప్రకటించి మొదట మహేంద్రహిల్స్‌లో స్థలం కేటాయించారన్నారు. అది వివాదంలో ఉండగా, రెండోసారి నాగోల్, తర్వాత యాప్రాల్, కోకాపేట, ఇప్పుడు ఉప్పల్‌లో కడతామని ప్రతీ క్రిస్మస్‌కు ఒకచోట శంకుస్థాపనలకే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, అయితే, నిధులు లేకపోవడంతో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న ఒక్కరికీ ఇవ్వడంలేదన్నారు. క్రిస్టియన్లపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌టీపీ సేవాదల్ ప్రతినిధి ఆనంద్, మేడ్చల్ కోఆర్డినేటర్ డానియల్, మల్కాజిగిరి కో ఆర్డినేటర్ ఫ్రాన్సిస్, సంజీవ్, సునీల్, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్‌లోని ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీలో జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎస్ రెడ్డి పాల్గొని పలువురు మహిళలను సన్మానించారు.మేఘన పద్మ, నాగమణి, లక్ష్మి, వెంకటేష్, ముద్దంగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న కార్పొరేటర్ సీఎస్ రెడ్డి

అర్ధంతరంగా నిలిచిన 'ఇంటింటికీ తెలుగుదేశం'

ఫిలింనగర్: సీనియర్ నేతనైన తనకు సమాచారం ఇవ్వకుండా డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇది సబబు కాదని జూబ్లీహిల్స్ డివిజన్ టీడీపీ నేత ఎండీ సలీం నిరసన వ్యక్తం చేశాడు. గురువారం ఫిలింనగర్‌లో ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమాన్ని విగ్రహాల చౌరస్తాలోని టీడీపీ జెండా దిమ్మె వద్ద జెండా ఎగురవేసి ప్రారంభించాలని ఆ పార్టీ నేతలు తలపెట్టారు. ఈ నేపథ్యంలో అక్కడికి వచ్చిన ఎండీ సలీం డివిజన్ అధ్యక్షుడు నర్సింహ, ఇతర నేతతో వాగ్వాదానికి దిగాడు. ఈ ఘర్షణలో సలీం కిందపడిపోవడంతో పాటు చొక్కా చిరిగింది. తనపై జరిగిన దాడిని ఖండిస్తూ జెండా దిమ్మెపై కూర్చొని నిరసన తెలిపాడు. అక్కడికి చేరుకున్న సీనియర్‌నేత అరవింద్ కుమార్‌గౌడ్, ఆరిఫ్‌లకు తన గోడు వెల్లబోసుకున్నాడు. దీంతో ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమం అర్ధంతరంగా నిలిచిపోయింది.

మందుబాబులకు జరిమానా

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం తాగి పట్టుబడ్డ 14 మంది మందుబాబులను గురువారం నాంపల్లిలోని 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వీరికి ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 23 మంది వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడగా వీరికి న్యాయమూర్తి జరిమానా విధించారు.

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో...

బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 24 మంది మందుబాబులు పట్టుబడగా గురువారం వీరిని నాంపల్లిలోని 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వీరికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వీరికి జరిమానా విధించారు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు



గన్‌పార్కులో అమరవీరుల స్తూపం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా శాసనమండలి బీఆర్‌ఎస్ అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. పార్టీ అభ్యర్థులు దేశపతి శ్రీనివాస్, నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి తమ నామినేషన్ పత్రాలను శాసనసభలో రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కార్యక్రమానికి మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బాల్క సుమన్, గువ్వల బాల్‌రాజ్, శంబీపూర్‌రాజు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థులు గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థికి మద్దతు



సాక్షి, హైదరాబాద్: టీటీజేఏసీ, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ మద్దతు ప్రకటించింది. పీఆర్‌టీయూటీఎస్ నేతలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌ను గురువారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ నేతలు శ్రీకాంత్, నరేష్‌గౌడ్ కలిసి ఈమేరకు మద్దతు ప్రకటించారు.

గాల్‌రెడ్డిని గెలిపించండి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఉపాధ్యాయ ఓటర్లకు గురువారం బహిరంగ లేఖ రాశారు.

'కాగ్' నివేదికలోనూ..

'స్కిల్' సిత్రాలు

ప్రాజెక్టు రూ.370 కోట్లు.. చూపింది రూ.3,300 కోట్లు

ప్రభుత్వ వాటా 10శాతం కింద రూ.37 కోట్లు విడుదల చేయాలి

కానీ, విడుదల చేసింది రూ.370కోట్లు

- అలా రూ.333 కోట్లు కొల్లగొట్టారు
- దీనికి రూ.22 కోట్ల వడ్డీ నష్టం అదనం
- వెరసి ఖజానాకు రూ.355 కోట్ల మేర గండి
- ప్రాజెక్టులో కాలేజీలకు భాగస్వామ్యమే లేదు
- ఇదీ చంద్రబాబు ప్రభుత్వ దోపిడీ 'స్కిల్'

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ముసుగులో సాగిన కుంభకోణాన్ని రాజ్యాంగ ప్రతిపత్తిగల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు చెందిన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కూడా నిగ్గుతేల్చింది. యువతకు నైపుణ్యాభివృద్ధి ముసుగులో సీమెన్స్ కంపెనీ పేరిట చంద్రబాబు ప్రభుత్వం నడిపించిన ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలను కడిగిపారేసింది. 2015 నుంచి 2018 వరకు సాగిన ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టు రికార్డులను కాగ్ 2018 మే 29 నుంచి జూన్ 22 వరకు పరిశీలించింది. అందులో రూ.355 కోట్ల మేర ఖజానాకు గండిపడిందని తేల్చింది. కాగ్ లేవనెత్తిన అభ్యంతరాలివే..



రూ.370 కోట్ల ప్రాజెక్టును రూ.3,300 కోట్లుగా..

సీమెన్స్ కంపెనీ పేరిట ప్రాజెక్టు నివేదిక రూపకల్పనలోనే చంద్రబాబు ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. ఆ ప్రాజెక్టులో పేర్కొన్న వివరాల ప్రకారం ఆ ఒప్పందం విలువ రూ.370కోట్లు మాత్రమే. ప్రైవేటు కంపెనీ సరఫరా చేస్తామని చెప్పిన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర అంశాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను పరిశీలిస్తే ఆ ప్రాజెక్టు విలువ రూ.370 కోట్లుగానే లెక్కతేలిందని పేర్కొంది. కానీ, అది రూ.3,300 కోట్ల ప్రాజెక్టుగా భ్రమింపజేసేలా అంచనాలను అమాంతంగా పెంచేసి నివేదికను రూపొందించారు. దాంతోనే ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి ఆస్కారం ఏర్పడింది.

ఇంతవరకూ లెక్కాపత్రం లేదు

ఇక ప్రాజెక్టు ఒప్పందంలో భాగంగా సరఫరా చేసిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విలువ ఎంత అన్నది కనీసం నిర్ధారించలేదు. నిపుణులైన ఏజెన్సీలతో నిర్ధారించాలని 2017, నవంబరు 25న నిర్వహించిన ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. కానీ, ఆ మేరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ఖజానాకు రూ.355 కోట్ల గండి

నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు రూపకల్పన, నిధుల విడుదలతో మొత్తం రూ.355 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. ప్రాజెక్టులో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రాజెక్టు విలువలో ప్రభుత్వం 10శాతం నిధులు కేటాయించాలి. అంటే, ప్రాజెక్టు వాస్తవ విలువ రూ.370 కోట్లుగా చూపించి ఉంటే.. ప్రభుత్వం రూ.37 కోట్లు మాత్రమే విడుదల చేయాలి. కానీ.. అంచనాలను అమాంతం పెంచేసి రూ.3,300 కోట్లుగా చూపించి.. ప్రభుత్వ వాటా 10 శాతంతో పాటు జీఎస్టీ, ఇతర అంశాలను కలుపుతూ ఏకంగా రూ.370 కోట్లు విడుదల చేశారు. అలా రూ.333 కోట్లు కొల్లగొట్టారు. అంతేకాదు, ఒక ఏడాది ముందే.. అది కూడా ప్రాజెక్టు మొదలుకాకుండానే ప్రభుత్వం నిధులు విడుదల చేయడం గమనార్హం. దాంతో రూ.22 కోట్ల వడ్డీ రూపంలో రావల్సిన ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. వెరసి ప్రభుత్వ ఖజానాకు రూ.355 కోట్ల నష్టం వాటిల్లింది.

నకిలీ ఇన్వాయిస్‌లతో రూ.241కోట్లు కొల్లగొట్టారు

ఇక షెల్ కంపెనీలు సరఫరా చేసినట్లుగా నకిలీ ఇన్వాయిస్‌లు చూపించి కనికట్టు చేశారు. ఆ విధంగా రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించారు. అక్కడ నుంచి హవాలా మార్గంలో టీడీపీ పెద్దలకు ఆ నిధులు చేరాయని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

ఒప్పందంలో కాలేజీలకు భాగస్వామ్యంలేదు

అలాగే, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం చేసుకున్నామని చెబుతున్న ఈ ఒప్పందంలో సంబంధిత కాలేజీలను భాగస్వాములను చేయనేలేదు. దాంతో ఆ కాలేజీలకు ఎలాంటి పాత్రా లేకుండాపోయింది. వాటిల్లో నెలకొల్పిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విలువ ఎంతన్నది మదింపు చేయనేలేదు. ఆ కాలేజీల యాజమాన్యాలకు కూడా ఆ విషయంపై ఎలాంటి అవగాహనలేదు.

విచారణ రికార్డ్ చేయాలని ఆదేశించండి

తెలంగాణ హైకోర్టులో కడప ఎంపీ అవినాశ్ రెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై కొన్ని అనుమానాలు వ్యక్తం చేస్తూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి గురువారం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు తాను సహకరిస్తున్నప్పటికీ విచారణ అధికారి సరైన విధానాలు అనుసరించడం లేదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని హైకోర్టును కోరారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 'నన్ను మొదటిసారి విచారించినప్పటి నుంచి సీబీఐ అధికారులు అడిగినవి, అడగనివి కూడా చిలువలు పలువలు చేస్తూ దుష్ప్రచారం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలకు కొమ్ముకాసే పత్రికలు, టీవీ చానళ్లు, సోషల్ మీడియా వేదికలు ప్రజల్లో అపోహలు కలిగించేలా అవాస్తవాలను వ్యాప్తిలోకి తీసుకొచ్చాయి. ప్రజల్లో అపోహలు తొలగించేందుకే సీబీఐ విచారణను రికార్డు చేయాలని విచారణ అధికారిని లిఖితపూర్వకంగా కోరాను. రెండోసారి విచారణకు పిలిచినప్పుడు కూడా రికార్డు చేయాలని సీబీఐ డైరెక్టర్‌ను, విచారణ అధికారి రామ్‌సింగ్‌ను లిఖితపూర్వకంగా కోరాను. అయినా పట్టించుకోలేదు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించాను' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌లో ఆయన పలు కీలక అంశాలను కూడా ప్రస్తావించారు.

వివేకా, సునీత మధ్య మనస్పర్థలు

'2010లో షేక్ షమీమ్‌ను వైఎస్ వివేకా రెండో వివాహం చేసుకున్నారు. 2015లో వీరికి ఓ కుమారుడు కూడా పుట్టాడు. అప్పటి నుంచి వివేకా కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయి. షమీమ్‌ను సునీత, ఆమె భర్త ఎన్.రాజశేఖరరెడ్డి, బావ ఎన్.శివప్రకాశ్‌రెడ్డి శత్రువుగా చూసేవారు. సునీత, రాజశేఖరరెడ్డితో పాటు వివేకా పలు కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నారు. వారు వివేకానందరెడ్డి చెక్ పవర్‌ను కూడా రద్దు చేశారు. దీంతో ఆయన ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివేకా మొదటి భార్య, కూతురు హైదరాబాద్‌లో ఉండగా, ఆయన మాత్రం పులివెందులలోనే ఎక్కువ రోజులు గడిపేవారు. ఒక దశలో ఆయన వారసుడిగా షమీమ్ కుమారుడినే ప్రకటిస్తారని, ఆ మేరకు విల్లు కూడా రాశారని పుకార్లు వచ్చాయి. హత్య అనంతరం నిందితుల (ఏ1 నుంచి ఏ4) ఇళ్లలో ఈ పత్రాల కోసం వెతికినట్లు కూడా సమాచారం. ఇవన్నీ పరిశీలిస్తే.. సొంత కుటుంబ సభ్యులే ఆయన్ని వదిలించుకునే పథకం వేసినట్లు అర్థమవుతుంది. వివేకా మరణానంతరం సునీత, ఆమె కుటుంబీకులు బెదిరించినట్లు షమీమ్ దర్యాప్తు అధికారులకు కూడా చెప్పారు. తన కుమారుడి పేరుమీద రూ.2 కోట్లు బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తానని వివేకా చెప్పినట్లు వెల్లడించారు' అని అవినాశ్‌రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు.

బీటెక్ రవి, చంద్రబాబు ప్రభావంతోనే

'వివేకా హత్య తర్వాత సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్సీ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి)ని కలిశారు. రవి ద్వారా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో మంతనాలు జరిపారు. హత్య జరిగిన సంవత్సరం వరకు సునీత నాపై ఆరోపణలు చేయలేదు. పైగా, ప్రెస్‌మీట్ పెట్టి నా విజయం కోసం వివేకా చాలా శ్రమించారని, జమ్మలమడుగులో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారని ఆమె చెప్పారు. కానీ చంద్రబాబు ప్రభావానికి లోనైన తర్వాతే నాపై ఆరోపణలు చేశారు' అని తెలిపారు.

వారికి నచ్చినట్లు దర్యాప్తు

'దస్తగిరి అక్కడా ఇక్కడా విని చెప్పిన మాటల ఆధారంగానే సీబీఐ దర్యాప్తు సాగుతోంది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినా ఈ కేసులో నన్ను ఇరికిస్తున్నారు. సునీల్ యాదవ్ గూగుల్ టేక్‌ఔట్ ఫోన్ లొకేషన్ అనే పేరుతో సీబీఐ నన్ను వేధిస్తోంది. హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన లేఖపై దర్యాప్తు చేయటంలేదు. దర్యాప్తు అధికారి తప్పుడు ప్రచారానికి ప్రభావితమై ఆ కోణంలోనే, పక్షపాతంతో విచారణ చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పేలా కొందరిపై ఒత్తిడి తెస్తున్నారు. నేను విచారణలో చెప్పిన విషయాలను విచారణ అధికారి మార్చి వారికి అవసరమైనట్లుగా మీడియాకు లీకులిస్తున్నారు. నోటీసుల దశలో దర్యాప్తు సాగుతుండగా చార్జిషీట్‌లో నేరస్తునిగా సీబీఐ చిత్రీకరిస్తోంది. రాజకీయ అవసరాల కోసం చంద్రబాబు ఈ కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్నారు. అందువల్ల నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా దర్యాప్తు అధికారులను ఆదేశించాలి' అని అవినాశ్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు.

నేడు విచారణ

అవినాశ్ రెడ్డి పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సంబంధించిన కేసులు విచారించే బెంచ్‌కు పంపారు. ఈ పిటిషన్‌ను జస్టిస్. కె.లక్ష్మణ్ బెంచ్ శుక్రవారం విచారించనుంది.

బీఆర్‌ఎస్‌కు వనపర్తి జెడ్పీ చైర్మన్ రాజీనామా

ఇద్దరు ఎంపీపీలు, 11 మంది సర్పంచ్‌లు కూడా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇలాకా వనపర్తి జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)లో ముసలం మొదలైంది. మంత్రికి సన్నిహితులుగా పేరొందిన ముఖ్య నాయకులు సైతం పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డితోపాటు వనపర్తి, పెద్దమందడి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. ఈ మేరకు ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పత్రాలు ప్రదర్శించారు. వీరితో పాటు మరో 11 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, పలువురు ఉపసర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తున్నట్లు స్వయంగా ప్రకటించడమే కాకుండా బీఆర్‌ఎస్ లో తాము ఎదుర్కొన్న బాధలను వెళ్లగక్కారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేక..: ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మామూలు కార్మికులు సైతం ఆత్మగౌరవం కోరుకుంటారని.. అలాంటిది అధికారంలో ఉండి కూడా ఆత్మగౌరవాన్ని పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేకే రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

నిరంజన్‌రెడ్డికి పేరొచ్చిందంటే మేమే కారణం

పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి మాట్లాడుతూ మంత్రి నిరంజన్‌రెడ్డికి నీళ్ల నిరంజన్‌రెడ్డి అనే పేరు వచ్చేందుకు తమ శ్రమే కారణమన్నారు. ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చింది ఎవరో వారి మనసులో ఉందని.. త్వరలోనే వారు బాహాటంగా చెప్పే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియంత పాలన అంతం కోసం ఇక నుంచి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని చెప్పారు. కాగా, నియోజకవర్గంలో ఇప్పటివరకు తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న మంత్రి నిరంజన్ రెడ్డికి అతడి సొంత సెగ్మెంట్ నుంచే వ్యతిరేకత పెల్లుబికడంతో పాటు తాజా పరిణామాలు ఎదురుదెబ్బేనని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.


నగర వార్తలు

మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు



బంజారాహిల్స్: మూగ జీవాలకు నీటిని అందిద్దాం అనే సంకల్పంతో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ సభ్యులు బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. వాటర్ ఫర్ ద వాయిస్ లెస్ అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా అక్కడక్కడ ఏర్పాటు చేసి నీటి తొట్టెలను గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు బిందు గుప్తా, రష్మి దోషి, లాహర్ అగర్వాల్, రోమా గాంధీ, లతా సొంతాలియా, భగవతి అగర్వాల్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో సత్తాచాటుతున్న మహిళలు



గోల్కొండ: మహిళలు అన్ని రంగాల్లో మగవారిని అధిగమిస్తూ సత్తాచాటుతున్నారని హైదరాబాద్‌లోని యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ ఇన్ లీడర్ షిప్ కాంక్లేవ్‌పై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐఐ ఐడబ్ల్యూఎన్ తెలంగాణ చాప్టర్ జి.శ్రీవిద్యారెడ్డితో కలిసి వీఐఎల్‌సీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్య, కళలు, టెక్నాలజీతో పాటు వ్యాపారంలోనూ మహిళలు ప్రచండ శక్తిలా దూసుకుపోతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచే కాకుండా పేదింటి ఆడపిల్లలు సైతం వంశపార్యపరంగా వ్యాపారంలో ధనిక మహిళలకు పోటీ ఇస్తుండటం మహిళలు ఎదుగుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్యానెల్ డిస్కషన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి జయేష్ రంజన్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఐఏఎస్ అధికారిణి హరిచందన దాసరి, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ సుమతి బడుగులతోపాటు చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, వనిత దాట్ల తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు మరో అవకాశం!

- 2020 నాటికి ఆక్రమణలో ఉన్న వాటికి వర్తింపు?
- నెల రోజుల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- తాజాగా మంత్రి మండలిలో నిర్ణయం
- మహానగరంలో మరో లక్షల కుటుంబాలకు లబ్ధి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు మరో అవకాశం లభించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఒక నెల గడువు విధిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. 2020 నాటికి ఆక్రమణలో ఉన్న ఇళ్లకు వర్తించనుంది. ఇందుకు సంబంధించి విధి విధానాలను ఖరారు చేయాల్సి ఉంది. నివాస స్థలాల క్రమబద్ధీకరణ, హక్కుల బదలాయింపునకు అవకాశం దక్కడంతో మరో లక్ష కుటుంబాలకు లబ్ధి చేకూరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2014 నాటికి ఆక్రమణలోని నివాస స్థలాల క్రమబద్ధీకరణ కోసం జారీ చేసిన జీవో నంబర్ 58, 59లకు అనుగుణంగా గతేడాది మరో జీవో 14ను జారీ చేసి దరఖాస్తులు స్వీకరించారు. హైదరాబాద్–రంగారెడ్డి–మేడ్చల్ జిల్లాల్లో సుమారు 1.14 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిపై క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తయి 54 వేల దరఖాస్తులు అర్హత సాధించినా క్రమబద్ధీకరణ ప్రక్రియ మాత్రం తుది దశకు చేరుకోలేదు. ఈ నేపథ్యంలో మరో మారు అవకాశం కల్పించడం పేదలకు కలిసి వచ్చినట్లయింది.

మరో లక్ష కుటుంబాలు...

- ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోని కుటుంబాలు మరో లక్ష వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తాజా నిర్ణయంతో 2020 నాటికి ఆక్రమణలో ఉన్నట్టు రుజువులున్న స్థలాలకు మాత్రమే క్రమబద్ధీకరణ వర్తించే అవకాశం ఉంది. అర్హులైన పేద కుటుంబాలు తమ ఆధార్ కార్డు లేదా ఏదైనా డాక్యుమెంట్‌తోపాటు.. స్థలం తమ ఆధీనంలో ఉన్నట్టు నిరూపించే ఆస్తి పన్ను రశీదు, విద్యుత్, నల్లా బిల్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌లలో ఏదైనా ఒకటి జత చేసి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఇప్పటికే ప్రభుత్వ భూముల్లోని 70 శాతం పైగా నివాసాలను జీవో 166, 58, 59, 179, 134ల కింద క్రమబద్ధీకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన ఆధారాలు సమర్పించక పోవడం, అర్హత సాధించినా వాయిదాల్లో నిర్దేశిత ఫీజు మొత్తాన్ని చెల్లించకపోవడంతో కొన్ని దరఖాస్తులను తిరస్కరించారు. మరి కొన్ని పెండింగ్‌లో పడిపోయాయి. తాజాగా మంత్రివర్గ నిర్ణయంతో క్రమబద్ధీకరణకు మరో మారు అవకాశం లభించింది.

కార్లు అద్దెకు తీసుకుని విక్రయం

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

జీడిమెట్ల: అద్దెకు కార్లు తీసుకుని వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వికారాబాద్ జిల్లా రామాయగూడ గ్రామానికి చెందిన మణిరాజ్(29) వృత్తిరీత్యా క్యాబ్ డ్రైవర్. అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు మణిరాజ్ కార్లను అద్దెకు తీసుకుని వాటిని విక్రయించేందుకు పథకం వేశాడు. మణిరాజ్‌కు అతని తల్లి ప్రేమలత సైతం సహకరిస్తుండటంతో ఇద్దరు కలిసి కార్లను అద్దెకు తీసుకుని పులివెందులకు చెందిన శంకర్‌రెడ్డికి విక్రయించేవారు. అదే విధంగా గతేడాది డిసెంబర్ 28వ తేదీన షాపూర్‌నగర్‌కు చెందిన షాకీర్ వద్ద నెల రోజులకు గాను కారు అద్దెకు తీసుకున్నారు. రెండు నెలల తర్వాత షాకీర్ కారు గురించి మణిరాజ్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు.

- దీంతో అనుమానం వచ్చిన షాకీర్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్సై హరీష్ సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని మణిరాజ్‌గా గుర్తించాడు. అతని కదలికలపై నిఘా పెట్టిన జీడిమెట్ల పోలీసులు మణిరాజ్‌ను గురువారం రామంతాపూర్‌లో పట్టుకున్నారు. సంగారెడ్డిలో 9కార్లు, జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో 8కార్లు, జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఒక కారును తీసుకుని అమ్మేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. మణిరాజ్‌కు సహకరించిన అతని తల్లి ప్రేమలత, కార్లను కొనుగోలు చేసిన శంకర్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మణిరాజ్‌ను మేడ్చల్ కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

విద్యార్థుల మెస్ చార్జీలు 50 శాతం పెంచాలి

బీసీ సంక్షేమ శాఖ మంత్రికి ఆర్.కృష్ణయ్య వినతి



మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా 8 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలేజీ హాస్టల్, పాఠశాల హాస్టల్ విద్యార్థులు, రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను 50 శాతం వరకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యార్థుల హాస్టల్ ఫీజు విషయమై గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను బీసీ సంక్షేమ సంఘం నేతలతో కలిసి ఆయన చర్చించి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... కాలేజీ కోర్సులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలన్నారు. 119 బీసీ గురుకుల పాఠశాలలు ప్రారంభించి సొంత భవనాలు నిర్మించాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గడచిన ఆరేళ్లుగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచలేదని ఆయన గుర్తు చేశారు. పాఠశాల హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను గత 14 సంవత్సరాలుగా పెంచలేదని, వీటిని నెలకు రూ.400 వరకు పెంచాలని కోరారు. విదేశీ విద్యనభ్యసించేందుకు దరఖాస్తు చేసినవారిలో అర్హత ఉన్న బీసీ విద్యార్థులందరికీ స్టైఫండ్ మంజూరు చేయాలన్నారు. త్వరలోనే మెస్ చార్జీలు 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలనే ప్రతిపాదనను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు పెంచుతూ నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాజ్‌కుమార్, వేముల రామకృష్ణ, వెంకట్ యాదవ్, నంద గోపాల్, నిఖిల్, నిమ్మల వీరన్న పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మాట్లాడుతున్న అర్వింద్‌కుమార్

చార్మినార్: భావితరాల సుస్థిర మనుగడ కోసం ప్రతి మనిషికీ పర్యావరణ స్పృహ ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణ ఎరుకతో జీవ వైవిధ్యాన్ని సంరక్షిస్తూ మనుషులు తమ జీవనశైలిని తీర్చిదిద్దుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల, తెలుగు విభాగం నిర్వహిస్తున్న 'తెలుగు సాహిత్యం–పర్యావరణ చైతన్యం'పై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో గౌరవ అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... మన పిల్లల కోసం ఎన్ని ఆస్తులు కూడబెట్టామన్నది ముఖ్యం కాదన్నారు. వారు ఆరోగ్యంగా జీవించేందుకు నివాసయోగ్యమైన వాతావరణం కల్పిస్తున్నామా? లేదా? అన్నదే ప్రధానమన్నారు. ఈ దృష్టితోనే రాష్ట్రంలో 24 శాతం ఉన్న పచ్చదనాన్ని 33 శాతంగా పెంచడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని సంకల్పించారన్నారు. మానవుల దురాశ, విచ్చలవిడితనానికి మరో నాలుగు భూగోళాలైనా సరిపోవని పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐజాజ్ సుల్తానా అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, సంచాలకులు డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, డాక్టర్ జె.నీరజ, ప్రజాకవులు సుద్దాల అశోక్‌తేజ, జయరాజు, అంబటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శిలాశాసనాల అచ్చు పద్ధతులపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న సభ్యులు

సైదాబాద్: ఎస్టాంప్ పేజ్ మేకింగ్ (శిలాశాసనాలు అచ్చుతీసుకునే పద్ధతి) ద్వారా ప్రాచీన శాసనాల్లో ఉన్న ప్రాచీన విజ్ఞానాన్ని భావితరాలకు అందించవచ్చని ఎస్టాంప్ పేజ్ మేకింగ్ నిపుణుడు జి.వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం సైదాబాద్ డివిజన్ రెవిన్యూ బోర్డ్ కాలనీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ కార్యాలయంలో ఎస్టాంప్ పేజ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి.ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వర్క్‌షాప్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ సభ్యులు, ఆర్కియాలజీ విద్యార్థులు పాల్గొన్నారు. నాంపల్లిలోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి స్టేట్ మ్యూజియంలో ఎస్టాంప్ పేజ్‌పై శిక్షణ ఇచ్చిన నిపుణుడు వెంకటరత్నం వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి శాసనాల పరిరక్షణ గురించి వివరించారు. సీసీఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ... పురాతన కాలంలో వైద్య వారసత్వ సంపదను రాళ్లు, రాగి రేకులపై చెక్కించి భద్రపరిచేవారని తెలిపారు. కార్యక్రమంలో హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ అధికారులు నాగరాజు, రాములు నాయక్, గిరిధర్, డాక్టర్ శ్రీదేవి, సంతోష్ మానే, క్రిస్ ఆంటోని, బిస్వ రంజన్‌దాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైల్వేలో ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం రైల్ నిలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు జనరల్ మేనేజర్ పి.ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ రాజీవ్ కిషోర్, చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.పద్మజ, ప్రముఖ టీవీ నటి రామిశెట్టి పల్లవి, ఎస్‌ఎఫ్ఐఆర్ జోనల్ సెక్రటరీ ఎం.భరణి భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. – సాక్షి, సిటీబ్యూరో



పీఆర్‌ఎస్ఐ మహిళా విభాగం కన్వీనర్‌గా అనిత

నాంపల్లి: పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్ఐ) మహిళా విభాగం ప్రథమ కన్వీనర్‌గా బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ కలువోయ అనిత బాధ్యతలు స్వీకరించారు. బుధవారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన సభలో ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. పీఆర్‌ఎస్ఐ జాతీయ సెక్రటరీ జనరల్ బాట్షీ అధ్యక్షతన జరిగిన సభకు ప్రముఖ విద్యావేత్త అంజలి రజ్దాన్, భారత వాయుసేన పబ్లిక్ రిలేషన్స్ విభాగంలో పనిచేసిన గ్రూపు కెప్టెన్ జేజే రావు, పీఆర్‌ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రాము, కార్యదర్శి యాదగిరి కంభంపాటి విచ్చేసి ప్రసంగించారు.

మోడీ ఏజెంట్లుగా సీబీఐ, ఈడీ: గజ్జెల కాంతం

పంజగుట్ట: రాజ్యాంగ పరిధిలో పనిచేయాల్సిన సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి సంస్థలు ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా పనిచేస్తున్నాయని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు దేశవ్యాప్తంగా లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే తెలంగాణ ఆడబిడ్డను విచారణ పేరుతో వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశంగౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కర్నాటక, మధ్యప్రదేశ్‌లలో మంత్రులు వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడుతున్నా వారిపై ఎలాంటి ఈడీ, సీబీఐ దర్యాప్తులు లేవన్నారు. పారిశ్రామికవేత్త అదాని దేశ సంపదను దోచుకుంటుంటే ఎందుకు విచారణ చేపట్టరని నిలదీశారు. తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఢిల్లీలో కవిత చేసే ధర్నాకు హాజరై సంఘీభావం తెలుపుతామని, 11వ తేదీన కవితను విచారణ జరిపే రోజు ఢిల్లీ ఏపీ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతామన్నారు.






ఫ్యాషన్

నాడు..
గిరిజనుల ఎంబ్రాయిడరీ దుస్తులు, ఆభరణాలు
వారిని ఎక్కడ ఉన్నా ప్రత్యేకంగా చూపేవి.
ఏ కొండ కోనల్లో ఉన్నప్పటికీ వారి ఆహార్యం ఇట్టే పట్టించేది.
నేడు...
ఆ కళ నగరవాసులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.
దేశ, విదేశీ వేదికల మీదా వెలిగిపోతోంది.
ఇండో-వెస్ట్రన్ డ్రెస్సుల మీదా తన హవా చాటుతోంది.

నగరానికి వచ్చిన కోన సింగారం




ఇండియన్ ట్రైబల్ డిజైన్స్ ఇప్పుడు ప్రతి ఔట్‌ఫిట్‌లోనూ, జ్యువెలరీలోనూ తమ వైభవాన్ని చూపుతున్నాయి. ప్లెయిన్ డ్రెస్సుల మీద ఒక చిన్న ట్రైబల్ హంగు జతగా చేరి వైవిధ్యమైన కళను ప్రదర్శిస్తోంది. నలుగురిలో ప్రత్యేకతను చాటుతోంది. అందుకే, నవతరం ఈ కళ కోసం పోటీపడుతోంది. నగర డిజైనర్లు కోనల్లోకి వెళ్లి మరీ ఈ తరహా కళను అడిగి నేర్చుకుంటున్నారు. లేదంటే, తమకు కావల్సిన డిజైనర్ ఉత్పత్తుల కోసం అడవి బిడ్డల దగ్గర పయనమవుతున్నారు. కళ ఎక్కడ ఉన్నా అది విస్తృతమవుతుందనడానికి ఈ డిజైన్స్ ఓ ఉదాహరణ.

● గెలుపు దారి

చదువుల బంగారం

చదువు కోసం స్వదేశం అఫ్గానిస్తాన్ దాటి మన దేశంలోకి అడుగుపెట్టే ముందు... తల్లిదండ్రులకు దూరం అవుతున్నాననే బాధ కంటే, చదువుకు దగ్గరవుతున్నాననే సంతోషమే రజియా మరాదిలో కనిపించింది. ఆ ఇష్టమే తనను చదువులలో బంగారం చేసింది...

ఆఫ్గానిస్థాన్‌కు చెందిన రజియా మరాదికి చదువు అంటే చాలా ఇష్టం. తనకంటూ ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి. తన కలలకు ఒక రూపం వస్తున్న సమయంలో తాలిబాన్ల రాజ్యం వచ్చేసింది!

'అమ్మాయిలకు ఉన్నత చదువు అక్కర్లేదు' అన్నారు.

'ఏం చేస్తాం. నా ప్రాప్తం ఇంతే' అనుకోలేదు రజియా.

చదవు కోసం మన దేశంలోకి అడుగు పెట్టింది. సౌత్ గుజరాత్ వీర్ నర్మద్ యూనివర్శిటీలో చేరింది.


రజియ మరాది

చదువు కోసం మూడు సంవత్సరాల పాటు కుటుంబాన్ని చూసే అవకాశం రాలేదు. అయితే చదువుపై ఇష్టం వల్ల అదేమీ తనకు లోటుగా అనిపించలేదు.

చదువు కోసం రజియా పడిన కష్టం వృథా పోలేదు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో గోల్డ్ మెడల్ సాధించింది!

'ఈ సమయంలో తల్లిదండ్రుల దగ్గర ఉంటే ఎంత సంతోషించేవారో' అంటుంది రజియ.

చదువులోనే కాదు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ గుర్తింపు తెచ్చుకుంది రజియా

'అఫ్గానిస్తాన్‌లోని ఎంతోమంది అమ్మాయిలకు రోల్‌మోడల్‌గా స్ఫూర్తి ఇవ్వనుంది' అంటున్నాడు అసిస్టెంట్ ప్రొఫెసర్ మధు థావనీ.

పీహెచ్‌డీ చేయాలనేది రజియా కల.

'నా పీహెచ్‌డీ పూర్తయ్యేనాటికి మా దేశంలోని పరిస్థితులలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాను' అంటుంది రజియా.

బ్యూటిప్స్

● పెరుగులో ముల్తాన మట్టి కలిపి ముఖానికి పట్టించి బాగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగితే చర్మంపై మురికిపోయి కాంతివంతంగా కనిపిస్తుంది.

● పెరుగులో పంచదార గాని, ఉప్మారవ్వ గాని కలిపి ముఖానికి పట్టించి మసాజ్ చేస్తే మృతకణాలు తొలగిపోతాయి.

● గోరువెచ్చని నీళ్లలో ఆలివ్ నూనె లేదా కొబ్బరినూనె కొద్దిగా నిమ్మరసం వేసి ఆ నీటిలో పాదాలను పావుగంటసేపు ఉంచాలి. తర్వాత పీచుతో రుద్ది శుభ్రం చేసుకోవాలి. బాగా ఆరిన తర్వాత కలబంద క్రీమ్ రాయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల మీ పాదాలు కోమలంగా తయారవుతాయి. పగుళ్ల మధ్య, గోళ్ల మధ్య ఉన్న మురికిపోకుండా క్రీములు రాయడం వల్ల ప్రయోజనం ఉండదు.



● సాయంత్రం ఇంటికి రాగానే నేరుగా సబ్బుతో ముఖాన్ని శుభ్రపరచకుండా ముందుగా క్లెన్సింగ్ మిల్క్‌ను తగినంత దూది ఉండకు అద్దుకొని, ముఖాన్ని, మెడను తుడుచుకోవాలి. తర్వాత ఫేస్ వాష్‌తో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై చేరిన మలినాలు, దుమ్ము త్వరగా తొలగిపోతాయి.

● నాలుగు బాదం పప్పులను రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పాలు వేసి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూసుకొని, ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

● భలే మంచి రోజు

క్వీన్స్ ఎక్స్‌ప్రెస్




'టికెట్ కలెక్టర్‌గా అమ్మాయి!'
'ట్రైన్ డ్రైవర్ అమ్మాయట!'
'ట్రైన్ గార్డ్‌గా అమ్మాయి!'... ఇలాంటి ఎన్నో ఆశ్చర్యాలను చూసింది కాలం. వివిధ హోదాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్న వారిని చూసి గర్వించింది కాలం.
పరుగెత్తే కాలంలో ప్రత్యేక సందర్భాలు ఉంటాయి.
ఆరోజు అచ్చంగా అలాంటిదే!

కాస్త సరదాగా చెప్పుకోవాలంటే 'కన్నుల పండగ' అనేది పండగరోజు మాత్రమే రావాల్సిన అవసరం లేదు. ప్రత్యేక దినాలలో కూడా రావచ్చు. మొన్నటి మహిళా దినోత్సవం రోజు అలాంటి కన్నుల పండగ జరిగింది.

సెంట్రల్ రైల్వే ముంబై డివిజన్ అందరూ మహిళలే ఉన్న బృందానికి ముంబై-పుణె దక్కన్ క్వీన్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించే బాధ్యతను అప్పగించింది.

ఆరోజు ఆ ట్రైన్‌లోకి అడుగు పెడితే...


లోకో-పైలట్ సురేఖ యాదవ్, అసిస్టెంట్ లోకో-పైలట్ లీనా ఫ్రాన్సిస్

డ్రైవర్ సీట్లో దర్జాగా కూర్చున్న లోకో-పైలట్ సురేఖ యాదవ్, టికెట్ కలెక్టర్‌లుగా విధులు నిర్వహిస్తున్న నీతు, రుబినా, బీనా, సురక్ష, జెన్, దీపలతో రైలు కొత్తగా కనిపించింది.

'ఈరోజు నిజంగా మరిచిపోలేని రోజు. రైలును మహిళలే నడిపిస్తున్నారనే భావన గర్వంగా ఉంది. నా వృత్తిజీవితంలో ఇది గుర్తుంచుకోదగిన రోజు' అంటుంది లోకో-పైలట్ సురేఖ యాదవ్.

లోకో-పైలట్‌గా వృత్తిజీవితంలోకి అడుగుపెట్టడానికి ముందు...

'అది కఠినమైన వృత్తి. ఎప్పుడు ఎక్కడ ఉంటామో తెలియదు. మహిళలకు ఎంతమాత్రం సరిపడని వృత్తి' అని వెనక్కిలాగే ప్రయత్నం చేశారు.

వాటిని పట్టించుకొని ఉంటే ఆమె పేరు పక్కన 'లోకో-పైలట్' అనే విశేషణం గర్వంగా కాలర్ ఎగరేసేది కాదు.

'ఇలాంటి రోజులు మళ్లీ మళ్లీ రావాలి' అంటుంది అసిస్టెంట్-లోకో పైలట్ లీనా ఫ్రాన్సిస్.

చిన్నప్పుడెప్పుడో ట్రైన్ ముందు బోగీలో గంభీరంగా కూర్చున్న డ్రైవర్‌ను చూసిన తరువాత తాను కూడా డ్రైవర్ కావాలనుకుంది.

'అలా కుదరదు. వీలు కాదు' అనే మాటల మధ్య కూడా తన ఆశను కోల్పోలేదు.

వృత్తిజీవితంలోకి అడుగు పెట్టిన తరువాత కూడా 'హాయిగా ఫ్యాన్ కింద కూర్చొని చేసే ఉద్యోగం కాకుండా ఈ ఉద్యోగం ఎందుకు ఎంచుకున్నావు తల్లీ. ట్రైన్ యాక్సిడెంట్లు పెరుగుతున్నాయి. జాగ్రత్త' అన్నవాళ్లు కూడా ఉన్నారు.

శుభమా అని ఉద్యోగంలోకి అడుగు పెడుతుంటే ఈ మాటలేమిటని లీనా ఫ్రాన్సిస్ చిన్నబుచ్చుకోలేదు. 'వాళ్లంతేలే!' అని మాత్రమే అనుకుంది.

సురేఖ యాదవ్ నుంచి రుబినా వరకు తమకు ఇష్టమైన వృత్తిలోకి రావడానికి ముందు ఎంతో కష్టపడి ఉంటారు. అందుకే ఈ బండి ప్రయాణికులనే కాదు వారి విజయాలను కూడా మోసుకుంటూ వెళ్లింది!

వంటిల్లు

వడలు కాదు వడియాలు

ఎండలు ముదిరాయి.
మామిడికాయలింకా ముదరలేదు.
మామిడి టెంక కట్టే లోపు వడియాలు పెట్టుకుందాం.
వడలను పోలిన వడియాలు ఈ వారం వంటిల్లులో...
ఇవి వడల్లా కనిపిస్తున్నాయా?
వడలు కాదు... వడియాలే!

సగ్గుబియ్యం- బొరుగులు



కావలసినవి: బొరుగులు– కప్పు; సగ్గుబియ్యం– కప్పు; ఉప్పు– టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఎండుమిర్చి – 3 (పలుకుగా పొడి చేయాలి).

తయారీ: సగ్గుబియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మూడు కప్పుల నీటిని మరిగించి సగ్గుబియ్యాన్ని వేసి చిక్కబడే వరకు ఉడికించి (సగ్గుబియ్యం పూర్తిగా కరిగిపోకూడదు) అందులో మిర్చి పొడి, ఉప్పు వేసి కలపాలి. వెడల్పు పాత్రలో బొరుగులు వేసి అందులో సగ్గుబియ్యం మిశ్రమాన్ని వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న నిమ్మకాయంత తీసుకుని అరచేతిలో వడలా వత్తి స్టీల్ ప్లేట్ మీద ఎండబెట్టాలి. రెండు లేదా మూడు రోజుల పాటు ఎండబెట్టాలి. మరుగుతున్న నూనెలో దోరగా వేయించుకోవాలి.

తెలగపిండి వడియాలు



కావలసినవి: తెలగపిండి – కప్పు; ఎండుమిర్చి – 10; జీలకర్ర– టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 10; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: తెలగపిండిలో రెండు కప్పుల నీటిని పోసి చపాతీ పిండిలా కలపాలి. ఎండుమిర్చి, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు మిక్సీలో గ్రైండ్ చేసి ఈ మిశ్రమాన్ని తెలగపిండిలో వేసి సమంగా కలిసేటట్లు కలపాలి. ఈ పిండిని చిన్న నిమ్మకాయంత తీసుకుని వడల్లా చేసి ఎండలో ఆరబెట్టాలి.

దోసకాయ - బొరుగులు



కావలసినవి: బొరుగులు – 2 కప్పులు; దోసకాయ తురుము – కప్పు; జీలకర్ర – టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; నువ్వులు – టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – కప్పు; పసుపు – చిటికెడు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; మిరప్పొడి – టీ స్పూన్;

తయారీ: బొరుగులను రాళ్లు, దుమ్ము లేకుండా శుభ్రం చేసి వెడల్పు పాత్రలో వేయాలి. అందులో దోసకాయ తురుముతోపాటు మిగిలిన దినుసులన్నీ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గుప్పెడు తీసుకుని గట్టిగా ముద్ద చేసి అరచేతిలో వేసి వడల్లా వత్తి పాలిథిన్ పేపర్ మీద లేదా తడి నూలు వస్త్రం మీద ఎండబెట్టాలి. రెండు రోజులు ఎండబెట్టి వలిచి మూడవ రోజు తిరగేసి ఎండబెట్టాలి. ఈ వడియాలను నూనెలో నేరుగా వేయించడమే.

టొమాటో- పోహా



కావలసినవి: నువ్వులు – 50 గ్రాములు; టొమాటోలు – పావు కేజీ; అటుకులు – ఒక కప్పు; మిరప్పొడి – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; జీలకర్ర – టీ స్పూన్; పచ్చిమిర్చి– 3; ఉల్లిపాయలు – 3 (తరగాలి); కరివేపాకు – నాలుగు రెమ్మలు.

తయారీ: ● నువ్వులను కడిగి వడపోసి ఆరబెట్టాలి. ● టొమాటోలను శుభ్రంగా కడిగి మెత్తగా గ్రైండ్ చేసి వెడల్పుగా ఉన్న పాత్రలో వేయాలి ● పచ్చిమిర్చి, జీలకర్ర, మిరప్పొడి, ఉప్పు కలిపి మెత్తగా రుబ్బి టొమాటో ప్యూరీలో కలపాలి. ఇందులో కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అటుకులు వేసి కలిపి పది నిమిషాల సేపు నాననివ్వాలి. చివరగా నువ్వులు వేసి కలిపి ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న గోళీలుగా చేసుకోవాలి. తడి వస్త్రం మీద లేదా పాలిథిన్ పేపర్ మీద ఒక్కో గోళీని వడల్లా వత్తి ఎండబెట్టాలి. రెండు రోజులు ఎండిన తర్వాత మూడవ రోజు ఉదయం క్లాత్ నుంచి ఒలిచి రెండవ వైపు ఎండబెట్టాలి.

గమనిక: ఈ వడియాలను వేయించడం కూడా ప్రత్యేకమే. బాణలిలో నూనె వేడి చేసి వడియాలను ఒక్కొక్కటిగా నీటిలో ముంచి (నానకూడదు) వెంటనే నూనెలో వేయాలి. రెండువైపులా దోరగా కాలిన తర్వాత నూనెలో నుంచి తీసి అదనంగా ఉన్న నూనె వదలడానికి శుభ్రమైన పేపర్ మీద వేయాలి. ఈ వడియాలను భోజనంలో తినవచ్చు. ఈ వడియాలతో కూర చేయవచ్చు. పులుసులో కూడా వేసుకోవచ్చు.

● సక్సెస్ స్టోరీ

ఫిల్మ్ మేకర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు కోల్‌కతాకు చెందిన శౌనక్ సేన్. అతడి ఫీచర్-లెంగ్త్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్' మన ఫ్యూచర్ గురించి మౌనంగానే ఎన్నో ప్రశ్నలు రేకెత్తిస్తోంది. జీవజాలంపై కాస్త కరుణ చూపమని చెప్పకనే చెబుతోంది...



లోకం మెచ్చిన దర్శకుడు

ఢిల్లీలోని ఏజేకె మాస్ కమ్యూనికేషన్ రిసెర్చ్ సెంటర్ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో పట్టా పుచ్చుకున్న శౌనక్‌సేన్ జెఎన్‌యూలోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఈస్థెటిక్స్‌లో పీహెచ్‌డీ చేశాడు. ఫిల్మ్స్ డివిజన్ ఆఫ్ ఇండియా డాక్యుమెంటరీ ఫెలోషిప్, డిజిటల్ అండ్ సోషల్ మీడియా ఫెలోషిప్‌కు ఎంపిక కావడం, కేంబ్రిడ్జి యూనివర్శిటీ అర్బన్ ఎకోలజీస్ ప్రాజెక్ట్‌లో విజిటింగ్ స్కాలర్‌గా భాగం కావడం తన ప్రపంచాన్ని విస్తృతం చేసింది.

సేన్‌లోని కళకు సామాజిక స్పృహ తోడైంది.

తొలి డాక్యుమెంటరీ 'సిటీస్ ఆఫ్ స్లీప్'కు పెద్ద పేరే వచ్చింది. ఈ డాక్యుమెంటరీకి ఫిల్మ్స్ డివిజన్ ఆఫ్ ఇండియా ఫండింగ్ చేసింది. ఇది న్యూయార్క్ ఇండియన్ ఫిల్మ్‌ఫెస్టివల్, తైవాన్ ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫెస్టివల్, ముంబై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఇరవై చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రత్యేక ప్రశంసలు పొందింది. ఆరు అవార్డ్‌లు అందుకుంది.



● 'ఆల్ దట్ బ్రీత్స్'లో ఓ దృశ్యం

సేన్ రెండో ఫీచర్ లెంగ్త్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్' సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోతూనే ఉంది.

వరల్డ్ సినిమా గ్రాండ్ జ్యూరీ ప్రైజ్(సన్‌డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, యూఎస్) గెలుచుకుంది. 'హాస్యం, వ్యంగ్యం మేళవించి పర్యావరణ విధ్వంసాన్ని కళ్లకు కట్టిన చిత్రం' అని జ్యూరీ సభ్యులు ప్రశంసించారు. ఈ డాక్యుమెంటరీ మరో ప్రసిద్ధ అవార్డ్ గోల్డెన్ ఐ (కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్) గెలుచుకుంది.

'ఆల్ దట్ బ్రీత్స్'కు సంబంధించిన ప్రపంచవ్యాప్త హక్కులను అమెరికన్ టెలివిజన్ నెట్‌వర్క్ హెచ్‌బీవో తీసుకుంది.

ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన మరో ఘనత ఆస్కార్ 'బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్'కు నామినేట్ కావడం.

మనుషుల కార్యకలాపాల వల్ల జీవజాలం స్థితిగతుల్లో వస్తున్న మార్పుకు ఈ చిత్రం అద్దం పడుతుంది.

'ఎక్కడ పడితే అక్కడ పక్షులు చచ్చిపోయి కనిపిస్తుంటాయి. అయ్యో! అని మనకు అనిపించదు. మన దారిన మనం వెళుతూనే ఉంటాం. రోజువారి పనుల్లో క్షణం తీరిక లేకుండా గడుపుతూనే ఉంటాం. క్షణం కూడా వాటి గురించి ఆలోచించం. ఇది ఎంత ఆశ్చర్యం, ఎంత విషాదం!' అంటుంది ఈ చిత్రంలో ఒక పాత్ర. జీవజాలానికి సంబంధించి మనుషులలోని స్పందనారాహిత్యాన్ని, మొద్దుబారినతనాన్ని దుమ్ము దులుపుతుంది ఆల్ దట్ బ్రీత్స్. మనుషులలోని స్పందనారాహిత్యం గురించి 'చీమ కుట్టినట్లైనా లేదు' అంటారు.

'ఆల్ దట్ బ్రీత్స్' చీమ నుంచి పిచ్చుక వరకు సమస్త జీవజాలం గురించి ఆలోచించమని చెబుతుంది.

'నేను మాత్రమే..అనే స్వార్థం ఉంటే నువ్వు కూడా మిగలవు' అనే మార్మిక సందేశాన్ని ఇస్తుంది.

'యాంత్రికంగా నేచర్-వైల్డ్‌లైఫ్ డాక్యుమెంటరీ తీయాలని ఎప్పుడూ అనుకోలేదు. ప్రజలు ఎన్ని మంచి పనులు చేస్తున్నారో తెలుసా!లాంటి స్వీట్ ఫిల్మ్ తీయాలనే ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదు. మనం వేగంగా పరుగులు తీస్తున్నాం. ఆ పరుగు కొన్ని నిమిషాల పాటు అయినా ఆపి చుట్టు ఏం జరుగుతుందో ఆలోచించాలి. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ విధానాలకు సంబంధించిన విషయం కాదు. ప్రతి ఒక్కరి బాధ్యత' అంటున్నాడు సేన్.

సేన్ ఇష్టాల గురించి చెప్పాలంటే...

సామాజిక పరిస్థితుల గురించి లోతుగా తెలుసుకోవడం అంటే ఇష్టం. సృజనాత్మకత నిండిన సినిమాలు చూడడం అంటే ఇష్టం. సామాజిక అంశాలకు, సృజనాత్మకత జోడించి తనదైన శైలిలో సరికొత్త చిత్రాన్ని ఆవిష్కరించడం అంటే మహా ఇష్టం.

● అవును...ఇది నిజమే!

అమెరికాలోని గోల్డ్ విన్ కార్పొరేషన్(1924) లోగో కోసం 'స్లాట్' అనే సింహాన్ని ఉపయోగించారు. 1928లో కొత్త లోగో కోసం 'జాకీ' అనే సింహం వచ్చింది. దీని గర్జనను రికార్డ్ చేయడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ జాకీ గోల్డ్‌విన్ నిర్మించిన వందకు పైగా బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో కనిపించి గర్జించింది. 'జాకీ' తరువాత కాఫీ, ట్యానర్, జార్జ్, లియో అనే సింహాలు లోగోలో కనిపించాయి. స్లాట్ నుంచి లియో వరకు సింహాలను కెమెరా ముందు కుదురుగా కూర్చోబెట్టడం కత్తి మీద సాముగా ఉండేది. ఇదొక విషయం అయితే షూటింగ్ సమయంలో సింహం కెమెరామెన్ మీద దాడి చేసిందని, ఇద్దరు ముగ్గురిని చంపేసిందని ఇలాంటి పుకార్లు ఎన్నో వినిపిస్తుండేవి!



రేడియో అంటేనే న్యూస్ కదా! అయితే బీబీసి రేడియో ఒకసారి చిన్న సర్‌ప్రైజ్ ఇచ్చింది. 1930 గుడ్‌ఫ్రైడే రోజు న్యూస్ రీడర్ ఇలా పలికింది...'శ్రోతలకు నమస్కారం. ఈరోజు గుడ్‌ఫ్రైడే. వార్తలు లేవు' కొన్ని సెకండ్ల నిశ్శబ్దం తరువాత పదిహేను నిమిషాల పాటు క్లాసిక్ పియానో మ్యూజిక్ వినిపించారు. అయితే ఇది చాలామంది శ్రోతలకు నచ్చలేదు. 'బీబీసి టైమ్ వృథా చేసింది' అని విమర్శించారు. చెప్పడానికి పెద్దగా వార్తలేవీ లేకపోవడం వల్లే బీబీసి ఈ మ్యూజిక్ స్టంట్ చేసిందనేది అనధికారిక వార్త.

● టెక్.. టాక్

కాస్త కొత్తగా...



ఎప్పుడూ ఉపయోగించే సెర్చ్ ఇంజిన్ కాకుండా కొత్తగా ట్రై చేయాలనుకుంటే వీటిపై ఒక లుక్ వేయండి...

బ్రేవ్: ప్రైవసీ-ఫోకస్‌డ్ సెర్చ్ ఇంజిన్ మరియు వెబ్ బ్రౌజర్ ఇది. యాడ్ బ్లాకింగ్, కుకీ కంట్రోల్...మొదలైన ఆప్షన్స్ ఉన్నాయి. తమ సందేహాలకు యూజర్లు 'టు-ది-పాయింట్ ఆన్సర్స్' ఫీచర్‌తో సవివరమైన సమాధానాలు తెలుసుకోవచ్చు. దీనిలో త్వరలో ఏఐపవర్డ్ ఫీచర్స్‌ను తీసుకురానున్నారు.

నీవా ఏఐ: ప్రైవసీ-ఫోకస్డ్ యాడ్ ఫ్రీ సెర్చ్ ఇంజిన్ ఇది. 'గెట్ ఆన్సర్స్. నాట్ యాడ్స్' అనేది కంపెనీ నినాదం. ఆన్‌లైన్ షాపింగ్ నుంచి వోల్డ్ ఇమెయిల్స్ సెర్చింగ్ వరకు రకరకాలుగా ఉపయోగపడుతుంది. గత నెల ఏఐ వరల్డ్ ఫీచర్స్‌ను తీసుకువచ్చింది. దీనిలో రెండు సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌లు ఉన్నాయి. ఒకటి...ఫ్రీ(లిమిటెడ్ సెర్చెస్, లిమిటెడ్ ఫీచర్స్), రెండు...ప్రీమియం(అన్ లిమిటెడ్ సెర్చ్‌స్, అన్ లిమిటెడ్ ఫీచర్స్).

పర్‌ప్లెక్సిటీ ఏఐ: యూజర్‌లు అడిగే ప్రశ్నలకు సంబంధించిన సమాచారం కోసం 'లింక్స్' జాబితాను అందిస్తుంది. దీంతో మల్టీపుల్ పేజీలను క్లిక్ చేయాల్సిన అవసరం ఉండదు. సంబంధం లేని సమాచారంతో టైమ్ వృథా కాదు. అవసరమైన సమాచారంతో పాటు ఆసక్తికరమై సమాచారాన్ని అందిస్తుంది. 'పర్‌ప్లెక్సిటీ ఆస్క్' స్టాండ్‌బొట్ ఫీచర్‌గా పేరు తెచ్చుకుంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

సమస్యల్లో ఉన్నప్పుడు, ప్రమాదకరమైన పరిస్థితుల్లో పడినప్పుడు, ఇబ్బందికరంగా, నిస్సహాయంగా అనిపించినప్పుడు ఉపయోగించే ఇడియమ్ ఇది.

ఉదా: వెన్ ది చిప్స్ ఆర్ డౌన్ యూ నో హూ యువర్ రియల్ ఫ్రెండ్స్ ఆర్



ఇక దీని మూలల్లోకి వెళితే...గ్యాంబ్లింగ్ ఆటల్లో నుంచి పుట్టిన ఇడియమ్ ఇది. గ్యాంబ్లింగ్ ఆటలో డబ్బుకు బదులుగా చిప్స్ వాడేవారు. బెట్ సందర్భంలో ఈ చిప్స్‌ను టేబుల్‌పై పెట్టాలి. ఇక అదే ఫైనల్. వెనక్కి తీసుకోవడానికి లేదు. గెలుపు, ఓటములలో ఏది సొంతం చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. గెలుపు, ఓటములపైనే చిప్స్ వెనక్కి వస్తాయా? చేజారిపోతాయా అనేది ఆధారపడి ఉంటుంది.

● గ్యాడ్జెట్ బజార్

హానర్ మ్యాజిక్ 5 ప్రో



సైజ్: 6.81 అంగుళాలు
రిజల్యూషన్: 1312x2848 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 5100 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
ర్యామ్: 12జీబి
బరువు: 219 గ్రా.
ఇంటర్నల్ స్టోరేజ్: 512 జీబి
కలర్స్: గ్రీన్, బ్లాక్

ప్లేపల్స్ వన్

ప్లేపల్స్ అనేది గేమింగ్‌బైక్. వర్కవుట్ చేస్తూనే సినిమాలు, ఓటీటీ కంటెంట్ చూడవచ్చు.

స్క్రీన్: 24" ఫుల్ హెచ్‌డీ
10 పాయింట్ మల్టీ టచ్
సౌండ్: ఇన్‌టిగ్రేటెడ్ స్పీకర్
బ్లూ టూత్ కనెక్టివిటీ
3.5 ఎంఎం హెడ్‌ఫోన్ జాక్
హార్డ్‌వేర్: ఇన్‌టెల్ 15-9400ఎఫ్ సీపియు
8జీబి ర్యామ్
గ్రాఫిక్స్ కార్డ్: 2 జీబి వి ర్యామ్




● గేమింగ్

అదిగో వస్తున్నారు.. ఎటాక్

యాక్షన్ అండ్ అడ్వెంచర్ గేమ్ 'స్కల్ అండ్ బోన్స్' నిన్న విడుదలైంది. ఓపెన్ వరల్డ్ ఎన్విరాన్‌మెంట్‌లో థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడే ఆట ఇది. సముద్రంలో జరిగే యుద్ధంలో విండ్ పొజిషన్ అనేది అడ్వాంటేజి అవుతుంది. గేమ్‌లో ప్లేయర్స్ అడిషినల్ షిప్స్‌ను కలెక్ట్ చేసుకోవచ్చు. మోర్టర్‌ల నుంచి రాకెట్ లాంచర్‌ల వరకు రకరకాల ఆయుధాలు ఉపయోగించవచ్చు. ఈ గేమ్‌కు సంబంధించిన వాటర్ టెక్నాలజీపై పనిచేసిన లీడ్ టెక్నికల్ డైరెక్టర్ క్రిష్ 'ఆటలో కాదు సముద్రంలోనే ఉన్నాం అనుకునేలా గేమ్‌ను తీర్చిదిద్దాం. ఫన్ ఎలిమెంట్స్ కూడా జోడించాం' అంటున్నాడు.

పదిహేడవ శతాబ్దానికి చెందిన షిప్‌లను దృష్టిలో పెట్టుకొని ఈ గేమ్‌కు సంబంధించి రకరకాల షిప్‌లను డిజైన్ చేశారు. గేమ్ ఫ్రేమ్ రేట్ అండ్ రిజల్యూషన్:60 ఎఫ్‌పీఎస్.



ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/5
జానర్: టాక్టికల్ యాక్షన్ గేమ్ మోడ్స్: సింగిల్ ప్లేయర్/మల్టీ ప్లేయర్

సినిమా



● నాగార్జున ● ఎన్టీఆర్ ● రామ్ చరణ్ ● అల్లు అర్జున్

స్టార్స్ ఎప్పటికప్పుడు తమ ఫ్యాన్స్‌ను అలరించాలనే అనుకుంటారు. ఏడాదికో సినిమా.. వీలైతే రెండు సినిమాల్లోనైనా కనిపించాలనుకుంటారు. అయితే కొన్నిసార్లు ప్లాన్ తారుమారు అవుతుంది. ఓ ఏడాది వరకు వారు థియేటర్స్‌లో కనిపించకపోవచ్చు. ఇలా కొంతమంది స్టార్స్ 'సీన్ కట్ చేస్తే.. వచ్చే ఏడాదే!' అంటున్నారు. ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై కనిపించని ఆ స్టార్స్ ప్రస్తుతం చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

సీన్ కట్ చేస్తే వచ్చే ఏడాదే!

పండగకి ప్రకటన

గత ఏడాది సంక్రాంతికి 'బంగార్రాజు' (ఈ చిత్రంలో మరో హీరోగా నాగచైతన్య నటించారు)గా, దసరాకు 'ది ఘోస్ట్'గా థియేటర్స్‌కి వచ్చారు నాగార్జున. ఆ తర్వాత ఆయన హీరోగా నటించనున్న సినిమా గురించి ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. దర్శకుడు మోహన్ రాజా, రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ నాగార్జునకు కథలు వినిపించారు. ముందుగా బెజవాడ ప్రసన్నకుమార్ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట నాగార్జున. ఉగాదికి ఈ చిత్రాన్ని ప్రకటించి, టైటిల్, ఫస్ట్ లుక్‌ను కూడా రిలీజ్ చేయాలనే ఆలోచనలో నాగార్జున అండ్ టీమ్ ఉన్నట్లుగా తెలుస్తోంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రివెంజ్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాలో 'అల్లరి' నరేశ్ కీ రోల్ చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారట. ఇదే నిజమైతే నాగార్జున ఈ ఏడాది తెరపై కనిపించకపోవడం అక్కినేని ఫ్యాన్స్‌ను నిరుత్సాహపరిచే విషయం. అయితే అక్కినేని వారసులు నాగచైతన్య చేస్తున్న 'కస్టడీ', అఖిల్ 'ఏజెంట్' ఈ ఏడాదే విడుదలవుతాయి. సో... ఆ విధంగా బ్యాలెన్స్ అయిపోతుంది.

వచ్చే వేసవిలోనే..

'జనతా గ్యారేజ్' (2016) చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రారంభం కావాల్సిన ఈ సినిమా షూటింగ్ పలు కారణాల వల్ల ఆలస్యం అవుతూ వస్తోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నట్లు ఎన్టీఆర్, కొరటాల అండ్ కో ఆల్రెడీ ప్రకటించారు. ప్రస్తుతం 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు..' పాట ఆస్కార్ ప్రమోషన్స్ కోసం అమెరికాలో ఉన్నారు ఎన్టీఆర్. ఆస్కార్ వేడుక (ఈ నెల 12) పూర్తి కాగానే ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. హైదరాబాద్ శివార్లలో ఆల్రెడీ ఈ సినిమా కోసం ఓ పోర్టు సెట్ వేస్తున్నారు. కళ్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మించనున్న ఈ సినిమాతో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నారు.

సంక్రాంతి బరిలో...

వచ్చే సంక్రాంతికి థియేటర్స్‌లోకి రానున్నారట రామ్ చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాను ముందు ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ అటు 'ఇండియన్ 2'కి, ఇటు చరణ్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు శంకర్. మరోవైపు రామ్‌చరణ్ కూడా 'నాటు నాటు..' పాట ఆస్కార్ ప్రమోషన్స్‌తో బిజీగా ఉంటున్నారు. ఈ కారణాల వల్ల రామ్‌చరణ్-శంకర్‌ల సినిమా రిలీజ్ వచ్చే ఏడాదికి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేసే ప్లాన్ ఉన్నట్లు నిర్మాత 'దిల్' రాజు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సో... రామ్‌చరణ్ ఈ ఏడాది థియేటర్స్‌లో కనిపించకపోవడం ఆల్మోస్ట్ కన్ఫార్మ్ అయినట్లే. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఆలస్యంగా పుష్పరాజ్

ఈ ఏడాదే రావాల్సిన పుష్పరాజ్ ('పుష్ప'లో అల్లు అర్జున్ పాత్ర పేరు) వచ్చే ఏడాది థియేటర్స్‌కు వస్తాడు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై సూపర్ డూపర్ హిట్ అయింది. దీంతో మలి భాగం 'పుష్ప: ది రూల్'పై మరింత ఫోకస్ పెట్టింది టీమ్. ఈ సినిమాను ముందు ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ స్క్రిప్ట్ అండ్ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను లాక్ చేయడానికి కాస్త టైమ్ పట్టింది. ఇలా పుష్పరాజ్ ఈ ఏడాది థియేటర్స్‌లో కనిపించడు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీ రోల్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

మరికొందరు స్టార్స్ కూడా ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై మిస్సయ్యే చాన్స్ ఉంది.

యాక్షన్ ఆరంభం



● 'ఇండియన్-2' సెట్‌లో కమల్‌హాసన్

ఫారిన్ స్టంట్ మాస్టర్స్ డిజైన్ చేసిన యాక్షన్ సీన్స్‌లో పాల్గొంటున్నారు ఇండియన్. 1996లో కమల్‌హాసన్ హీరోగా శంకర్ డైరెక్షన్‌లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') అద్భుత విజయం సాధించిన విషయం తెలిసిందే. పాతికేళ్ల తర్వాత కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. ఇటీవల ఆరంభమైన నెలరోజుల షెడ్యూల్‌లో భాగంగా మొన్నటివరకు నైట్ సీన్స్ తీసిన చిత్ర యూనిట్ ఇప్పుడు యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేసింది. 'ఇండియన్ 2' సినిమాకు ఓ హైలైట్‌గా ఉండనున్న ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను ఫారిన్ స్టంట్ కొరియోగ్రాఫర్స్ డిజైన్ చేస్తున్నారు.

తెలుసా తెలుసా...



మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీ ప్రసన్న కలిసి నటించిన తొలి చిత్రం 'అగ్ని నక్షత్రం'. వంశీకృష్ణ మళ్ల దర్శకత్వంలో లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. అచ్చు రాజమణి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'తెలుసా తెలుసా...' అంటూ సాగే పాటను హీరోయిన్ సమంత సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ పాటలో లక్ష్మీ ప్రసన్నతో పాటు ఆమె కుమార్తె విద్యా నిర్వాణ కూడా నటించింది. ''తెలుసా తెలుసా...' పాటకు మంచి స్పందన వస్తోంది. త్వరలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ తెలిపింది. సిద్ధిక్, విశ్వంత్, చైత్ర శుక్ల తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: గోకుల్ భారతి.

ప్రేమకథ షురూ



● వీవీ వినాయక్, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా కొత్త సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా విశ్వ కరుణ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. శివం సెల్యులాయిడ్స్‌పై రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాతలు డి. సురేష్‌బాబు, ఏఎమ్ రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ కొట్టారు. ''సరికొత్త ప్రేమకథా చిత్రమిది. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఉంటుంది'' అన్నారు రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి. ఈ చిత్రానికి సహనిర్మాతలు: బి. సురేష్ రెడ్డి, సంతోష్, సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: విశ్వాస్ డానియేల్.

ఉగాదికి ధమ్కీ



● విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తొలి పాన్ ఇండియా చిత్రం 'దాస్ కా ధమ్కీ' రిలీజ్‌కి రెడీ అయ్యింది. ఉగాది సందర్భంగా ఈ నెల 22న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. విశ్వక్ హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించారు. వన్మయే క్రియేషన్స్, విశ్వక్‌సేన్ సినిమాస్‌పై కరాటే రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన ఈ చిత్రంలో నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటించారు. రిలీజ్ డేట్ ప్రకటించి, విడుదల చేసిన పోస్టర్‌లో క్లాస్‌తో పాటు మాస్ లుక్‌లో కనిపించారు విశ్వక్ సేన్. ''దాస్ కా ధమ్కీ'ని తెలుగుతో పాటు తమిళ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం. ఇప్పటివరకు విడుదల చేసిన మూడు పాటలు చార్ట్ బస్టర్స్ అయ్యాయి. థియేట్రికల్ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ కె. బాబు, సంగీతం: లియోన్ జేమ్స్.

నటుడు-దర్శకుడు సతీష్ కౌశిక్ కన్నుమూత



బాలీవుడ్ ప్రముఖ సీనియర్ నటుడు, దర్శకుడు సతీష్ కౌశిక్ (66) గుండెపోటుతో కన్నుమూశారు. హోలీ వేడుకల కోసం ఢిల్లీలోని తన స్నేహితుడు, రచయిత జావేద్ అక్తర్ ఇంటికి వెళ్లిన ఆయన గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంట్లో కాస్త నలతగా ఉండటంతో ఆస్పత్రికి వెళుతుండగా మార్గమధ్యంలోనే గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు తెలిసింది. జావేద్ అక్తర్ కుటుంబంతో కలిసి సంతోషంగా జరుపుకున్న హోలీ ఫొటోలను కూడా ట్విట్టర్‌లో షేర్ చేశారాయన. ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకుంది. 'ఉత్సవ్', 'సాగర్', 'మిస్టర్ ఇండియా', 'రాజాజీ', 'భాఘి 3' వంటి దాదాపు 100కి పైగా హిందీ సినిమాల్లో కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సతీష్ కౌశిక్ నటించారు. అనిల్ కపూర్, శ్రీదేవిలతో 'రూప్ కీ రాణి చోరోన్ కా రాజా' సినిమాకి తొలిసారి సతీష్ కౌశిక్ దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'తేరే నామ్', 'షాదీ సే పెహ్లే', 'ప్రేమ్' వంటి దాదాపు 20 సినిమాలకు దర్శకత్వం వహించారాయన. సతీష్ దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'కాగజ్' (2021). నటుడిగా ఆయన ఆఖరి సినిమా 'ఎమర్జెన్సీ'. కంగనా రనౌత్ లీడ్ రోల్ చేసిన ఈ మూవీలో ఓ కీలక పాత్ర చేశారు కౌశిక్. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. సతీష్ కౌశిక్ హఠాన్మరణంతో పలువురు రాజకీయ, హిందీ చిత్రరంగ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు.

చిత్రం చూడర...



● 'చిత్రం చూడర...' ఫస్ట్ లుక్

వరుణ్ సందేశ్ హీరోగా, ధన్‌రాజ్, కాశీ విశ్వనాథ్ ప్రధాన పాత్రల్లో ఆర్ఎన్ హర్షవర్ధన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'చిత్రం చూడర...'. బీఎం సినిమాస్ బ్యానర్ పై శేషు మారంరెడ్డి, బోయపాటి భాగ్యలక్ష్మి నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గురువారం రిలీజ్ చేశారు. 'అల్లరి' రవిబాబు, తనికెళ్ల భరణి, రాజా రవీంద్ర, శివాజీ రాజా, శీతల్ భట్, మీనా కుమారి, అన్నపూర్ణమ్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు రధన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో 'నేనింతే' ఫేం అదితీ గౌతమ్ స్పెషల్ సాంగ్ చేస్తారని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహనిర్మాత: ధన తుమ్మల.

కొత్త పాత్రలో...



● లైలా

'వైశాలి' వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఆది పినిశెట్టి-దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'శబ్దం'. 7ఎ ఫిల్మ్స్, ఆల్ఫా ఫ్రేమ్స్‌పై 7ఎ శివ నిర్మిస్తున్నారు. లక్ష్మీ మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నటి లైలా కీలక పాత్ర పోషిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. ''తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న చిత్రం 'శబ్దం'. మునుపెన్నడూ చూడని కొత్త పాత్రలో లైలా కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: భాను ప్రియ శివ, సంగీతం: తమన్, కెమెరా: అరుణ్ పద్మనాభన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. బాలకుమార్, రచన-దర్శకత్వం-లైన్ ప్రొడ్యూసర్: అరివళగన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
542	165
59,806	17,590

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	11,566	▽	10
డోజోన్స్	32,759	▽	30
ఎఫ్‌టీఎస్ఈ 100	7,880	▽	50
డాక్స్	15,633	△	1
షాంఘై	3,276	▽	7
నికాయ్	28,623	▽	179

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	55,286	△	41
బంగారం (22 క్యారట్)	55,065	△	41
వెండి (కేజీ)	61,793	▽	90

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.17	82.84
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	95.53	98.77
€	యూరో	ఎస్‌బీఐ	84.97	88.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.92	60.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.96	55.27
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.61	61.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.87	22.54
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.42	23.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.65	12.73

కాంపా కోలా మళ్లీ వచ్చేసింది..

- కొత్త అవతారంలో సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్
- ఆవిష్కరించిన రిలయన్స్
- ముందుగా ఏపీ, తెలంగాణ మార్కెట్లలో లభ్యం



న్యూఢిల్లీ: 1970లు, 80లలో ఓ వెలుగు వెలిగి కనుమరుగైన సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్ కాంపా కోలాను దేశీ దిగ్గజం రిలయన్స్ తిరిగి ప్రవేశపెట్టింది. అదానీ, ఐటీసీ, యూనిలీవర్ తదితర దిగ్గజాలకు దీటుగా పోటీనిచ్చే క్రమంలో రిలయన్స్ రిటైల్‌లో భాగమైన రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (ఆర్‌సీపీఎల్) దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ముందుగా తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో కాంపా కోలా శీతల పానీయాలు లభ్యమవుతాయని ఆర్‌సీపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ తర్వాత దశలవారీగా ఇతర రాష్ట్రాలకు విస్తరించనున్నట్లు వివరించింది. 'ది గ్రేట్ ఇండియన్ టేస్ట్'ను తిరిగి పరిచయం చేస్తున్నామంటూ అప్పటి కాంపా ట్యాగ్‌లైన్‌ను ఉటంకిస్తూ పేర్కొంది. తొలుత కాంపా కోలా, కాంపా లెమన్, కాంపా ఆరెంజ్ అని మూడు పానీయాలు ఉంటాయని వివరించింది. ఇవి అయిదు సైజుల ప్యాక్‌లలో (200 ఎంఎల్, 500 ఎంఎల్, 600 ఎంఎల్, 1,000 ఎంఎల్, 2,000 ఎంఎల్ హోమ్ ప్యాక్స్) లభ్యమవుతాయి. నాణ్యమైన ఈ ఉత్పత్తులను అందుబాటు ధరల్లో అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. కాంపా కోలా బ్రాండ్‌కు దాదాపు యాభై ఏళ్ల చరిత్ర ఉంది. 1949 నుంచి 1970ల వరకూ భారత్‌లో కోకా కోలా శీతల పానీయాలకు ప్యూర్ డ్రింక్స్ గ్రూప్ అనే సంస్థ పంపిణీదారుగా ఉండేది. 1970లలో అది కాంపా కోలా పేరిట తమ సొంత బ్రాండ్‌ను ప్రవేశపెట్టి.. ఆ సెగ్మెంట్‌లో లీడరుగా ఎదిగింది. కానీ, 1990లలో దేశీయంగా తిరిగి కోకా కోలా, పెప్సీకో లాంటి దిగ్గజాల రీఎంట్రీతో కాంపా కనుమరుగైపోయింది. కొన్నాళ్ల క్రితం ప్యూర్ డ్రింక్స్ గ్రూప్ నుంచి కాంపా బ్రాండ్‌ను ఆర్‌సీపీఎల్ రూ. 22 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది జనవరిలోనే సోస్యో హజూరీ బెవరేజెస్ అనే సంస్థలో 50 శాతం వాటా దక్కించుకుంది. తాజాగా కాంపా బ్రాండ్‌ను ఆవిష్కరించింది.



లాభాలకు బ్రేక్

సెన్సెక్స్ 542 డౌన్ • 60,000 స్థాయి దిగువన ముగింపు • నిఫ్టీ 165 పాయింట్ల క్షీణత

ముంబై: మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ట్రేడింగ్ గడిచేకొద్దీ అమ్మకాలు ఊపందుకోవడంతో దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 542 పాయింట్లు క్షీణించి 59,806 వద్ద ముగిసింది. వెరసి 60,000 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. ఇక నిఫ్టీ 165 పాయింట్లు క్షీణించి 17,590 వద్ద నిలిచింది. ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్లు అంచనాలను మించి పెరిగే వీలున్నట్లు సంకేతాలివ్వడంతో సెంటిమెంటు బలహీనపడింది. మరోవైపు 10ఏళ్ల యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ 0.34 శాతం పుంజుకుని 3.99కు చేరడంతో యూరప్, ఆసియా మార్కెట్లు నీరసించాయి. జపనీస్ జీడీపీ, చైనీస్ ద్రవ్యోల్బణం నిరాశపరచడంతో మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు మరింత పెరిగినట్లు మార్కెట్ విశ్లేషకులు తెలియజేశారు.

నిలదొక్కుకున్న మెటల్స్

ఎన్ఎస్ఈలో దాదాపు అన్ని రంగాలూ వెనకడుగు వేశాయి. మెటల్స్ నష్టపోకుండా నిలదొక్కుకోగా.. ఆటో, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఐటీ, బ్యాంకింగ్ తదితరాలు 2-1 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎంఅండ్ఎం, ఎస్‌బీఐ లైఫ్, ఆర్ఐఎల్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌ద్వయం, ఐసీఐసీఐ, ఐషర్, టెక్ మహీంద్రా, టీసీఎస్, మారుతీ, టాటా మోటార్స్, హీరో మోటో, ఐటీసీ 5-1.5% మధ్య పతనమయ్యాయి. అయితే టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, అపోలో హాస్పిటల్స్, ఎయిర్‌టెల్, సిప్లా, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ 1.6-0.5 శాతం మధ్య బలపడ్డాయి. బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.55 శాతం నీరసించింది. ట్రేడైన షేర్లలో 1,987 నష్టపోగా.. 1,502 లాభపడ్డాయి. కాగా, అదానీ గ్రూప్‌లోని నిఫ్టీ స్టాక్స్‌లో అమ్మకాలు నమోదైనప్పటికీ ఇతర 4 లిస్టెడ్ కౌంటర్లకు భారీ డిమాండ్ నెలకొంది. అవి 5% చొప్పున లాభపడ్డాయి.

మెర్సిడెస్ కార్లు మరింత ప్రియం

కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న మెర్సిడెస్ బెంజ్ వివిధ మోడళ్ల ధరలను 5 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. దీంతో ఎక్స్‌షోరూంలో కార్ల ధర మోడల్‌నుబట్టి రూ.2-12 లక్షలు అధికం కానుంది. కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ గురువారం వెల్లడించింది. పెరిగిన తయారీ వ్యయం, అధికమైన రవాణా ఖర్చుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. ప్రధానంగా యూరోతో



రూపాయి మారకం విలువ క్షీణించడం వల్లే ధరలు పెంచాల్సి వస్తోందని స్పష్టం చేశారు. ధరల సవరణ గడిచిన మూడు నెలల్లో ఇది రెండవసారి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-3-2023	
విశాఖ	430-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423-00
విజయవాడ	423-00
రిటైల్ ధర (డజను)	66.00
9-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	410-00
రిటైల్ ధర	4.70

జియో చేతికి యూఎస్ కంపెనీ

- డీల్ విలువ రూ. 492 కోట్లు
- 5జీ, బ్రాడ్‌బ్యాండ్ సేవలకు మద్దతు







న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ తాజాగా యూఎస్ కంపెనీ మిమోసా నెట్‌వర్క్స్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు 6 కోట్ల డాలర్ల(రూ. 492 కోట్లు) విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కమ్యూనికేషన్ సంబంధ పరికరాలు తయారు చేసే మిమోసా కొనుగోలుతో 5జీ టెలికం, బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను మరింత విస్తరించేందుకు వీలు చిక్కనుంది. అనుబంధ సంస్థ రాడిసిస్ కార్పొరేషన్ ద్వారా తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు జియో ప్లాట్‌ఫామ్స్ పేర్కొంది. రుణరహిత, క్యాష్ ఫ్రీ ప్రాతిపదికన మిమోసాను సొంతం చేసుకునేందుకు ఎయిర్‌స్పాన్ నెట్‌వర్క్స్ హోల్డింగ్స్‌తో 6 కోట్ల డాలర్లకు ఒప్పందం కుదిరినట్లు వెల్లడించింది. మిమోసా వైఫై-5 ఆధారిత పాయింట్ టు మల్టీపాయింట్ ప్రొడక్టులతోపాటు.. ఆధునిక వైఫై 6ఈ టెక్నాలజీలు, సంబంధిత పరికరాల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. 2018లో మిమోసాను ఎయిర్‌స్పాన్ కొనుగోలు చేసింది. కాగా.. చైనీస్ టెక్నాలజీ నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు దూరం జరుగుతున్న నేపథ్యంలో మిమోసా కొనుగోలు జియో ప్లాట్‌ఫామ్స్‌కు కీలకంగా నిలవనుంది. మిమోసాకు జియో ప్రధాన కస్టమర్‌కావడం గమనార్హం!

లెన్స్‌కార్ట్‌పై అబుధాబి సంస్థ కన్ను

దేశీ ఐవేర్ స్టార్టప్ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్‌పై అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ కన్నేసినట్లు తెలుస్తోంది. లెన్స్‌కార్ట్ కొనుగోలుకి అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ సుమారు 50 కోట్ల డాలర్ల(రూ. 4,100 కోట్లు) విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకునే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐవేర్ కంపెనీని సొంతం చేసుకునేందుకు మధ్యప్రాచ్యానికి చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ నిర్వహిస్తున్న చర్చలు తుది దశలో ఉన్నట్లు అంచనా. దీనిలో భాగంగా కంపెనీ ప్రస్తుత షేర్లతోపాటు తాజాగా జారీ చేసే ఈక్విటీని సైతం పొందేందుకు వీలుగా ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో లెన్స్‌కార్ట్ విలువ 4 బిలియన్ డాలర్లకు(రూ. 32,800 కోట్లు)పైగా చేరనున్నట్లు అంచనా.

హోమ్ ఫస్ట్‌లో వాటా విక్రయం

- 7.75 శాతం విలువ రూ. 467 కోట్లు
- గోకల్‌దాస్‌లో 9.9% వాటా అమ్మకం

ఎన్‌బీఎఫ్‌సీ హోమ్ ఫస్ట్ ఫైనాన్స్‌లో 7.75 శాతం వాటాను ఇన్వెస్టర్ సంస్థ బెస్సెమర్ ఇండియా క్యాపిటల్ హోల్డింగ్స్-2 విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 686 సగటు ధరలో 68.11 లక్షలకుపైగా షేర్లను విక్రయించింది. వీటి విలువ రూ. 467 కోట్లుకాగా.. ఫిడిలిటీ ఫండ్స్- ఏషియన్ స్మాలర్ కంపెనీస్ పూల్, నోమురా ట్రస్ట్ అండ్ బ్యాంకింగ్ కో లిమిటెడ్ మొత్తం 11.93 లక్షల హోమ్ ఫస్ట్ షేర్లను కొనుగోలు చేశాయి. యూఎస్ వెంచర్ క్యాపిటల్ సంస్థ బెస్సెమర్ వెంచర్ పార్ట్‌నర్స్‌కు చెందిన కంపెనీయే బెస్సెమర్ ఇండియా. 2022 డిసెంబర్‌కల్లా హోమ్ ఫస్ట్‌లో బెస్సెమర్ ఇండియా 7.75 శాతం వాటాను కలిగి ఉంది.



గోకల్‌దాస్‌లో అమ్మకాలు ఇలా...

ఇక టెక్స్‌టైల్స్ రంగ కంపెనీ గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్‌లో ప్రమోటర్ గ్రూప్ సంస్థ క్లియర్ వెల్త్ కన్సల్టెన్సీ సర్వీసెస్ 9.9 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి దాదాపు రూ. 392 సగటు ధరలో 60 లక్షల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ దాదాపు రూ. 235 కోట్లు. తాజా లావాదేవీ తదుపరి గోకల్‌దాస్‌లో ప్రమోటర్ సంస్థ క్లియర్ వెల్త్ వాటా 10.66 శాతానికి పరిమితమైంది.

వాటాలు విక్రయించిన కిర్లోస్కర్ ఆయిల్ ప్రమోటర్లు

కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్ ప్రమోటర్ సంస్థలు 17.71 శాతం వాటాలను (2,56,22,987 షేర్లు) మార్కెట్లో విక్రయించారు. వీటి విలువ రూ.825 కోట్లు. జ్యోత్స్న గౌతమ్ కులకర్ణి, అంబర్ గౌతమ్ కులకర్ణి, నిహాల్‌గౌతమ్ కులకర్ణి వాటాలు విక్రయించిన వారిలో ఉన్నారు. నోమురా ట్రస్ట్ అండ్ బ్యాంకింగ్ కంపెనీ, సొసైట్ జనరల్, సీగోన్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్, బీఎన్‌పీ పారిబాస్ ఆర్బిట్రేజ్, మ్యాక్స్ లైఫ్ కంపెనీ, డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు చేశాయి. సగటున ఒక్కో షేరు రూ.322 వద్ద లావాదేవీ జరిగింది.



సాక్షి స్పోర్ట్స్

తొలి పోరు 'డ్రా'తో సరి

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) రెండో సెమీఫైనల్ తొలి అంచె పోరులో ఫలితం తేలలేదు. గురువారం గచ్చిబౌలి స్టేడియంలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ), ఏటీకే మోహన్‌బగాన్ మధ్య జరిగిన మ్యాచ్ 0–0తో 'డ్రా'గా ముగిసింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లూ గోల్ సాధించడంలో విఫలమయ్యాయి. టోర్నీ ఆసాంతం అత్యుత్తమ డిఫెన్స్‌తో ఆకట్టుకున్న ఈ రెండు జట్లూ కీలక మ్యాచ్‌లోనూ డిఫెన్స్‌కే ప్రాధాన్యతనివ్వడంతో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. హైదరాబాద్ సొంతగడ్డపై ఆడిన ప్రయోజనాన్ని పొందలేకపోయింది. మోహన్‌బగాన్ ఆట గాడు పెట్రాటోస్ గోల్ చేసేందుకు చేరువగా వచ్చినా...హైదరాబాద్ కీపర్ గుర్మీత్ సింగ్ దానిని సమర్థంగా అడ్డుకోవడంలో సఫలమయ్యాడు. సెమీఫైనల్ రెండో అంచె పోరులో ఈ నెల 13న ఇరు జట్లు కోల్‌కతాలో తలపడతాయి. ఇందులో గెలిచిన టీమ్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.



ఖాజా శతక జోరు



- తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 255/4
- బోర్డర్–గావస్కర్ ట్రోఫీ చివరి టెస్టు

తొలి మూడు టెస్టులకు భిన్నంగా చివరి నాలుగో టెస్టు మొదలైంది. తొలి ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టిన జట్టు మొదటి రోజే ఆలౌట్ కాకపోవడం విశేషమైతే... ఒక బ్యాటర్ తొలి రోజే సెంచరీ సాధించడం మరో విశేషం. స్పిన్ పిచ్‌లపై చేతులెత్తేసిన బ్యాటర్లను చూసిన ఈ టెస్టు సిరీస్‌లో తొలిసారి బౌలర్లు కష్టపడ్డారు. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ఆఖరి టెస్టు పరుగుల మజా అందించనుంది. ఓపెనర్ ఉస్మాన్ ఖాజా అజేయ సెంచరీతో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలిరోజును సంతృప్తికరంగా ముగించింది.

అహ్మదాబాద్: తొలిరోజు ఆలౌట్. మూడో రోజు కల్లా ముగింపు! ఆస్ట్రేలియా ఆడినా... భారత్ ఇన్నింగ్స్ ఓపెన్ చేసినా... 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో ఇది షరామామూలే! కానీ ఆఖరి టెస్టు అలా మొదలవలేదు. మొతెరా వికెట్ బ్యాటర్లకు అవకాశమిచ్చింది. ఆలౌట్ కాదుకదా... కనీసం సగం వికెట్లు (5) అయినా ఆతిథ్య భారత బౌలర్లు పడగొట్టలేకపోయారు. ఇదే మరో నాలుగు రోజులు కొనసాగితే ఈ టెస్టు ఐదు రోజుల పాటు జరగడం ఖాయం! నాలుగో టెస్టులో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలిరోజు ఆటముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. ఓపెనర్ ఉస్మాన్ ఖాజా (251 బంతుల్లో 104 బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ సెంచరీ సాధించాడు. భారత పేసర్ షమీ 2 వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు అశ్విన్, జడేజాలకు చెరో వికెట్ దక్కింది. ఆట నిలిచే సమయానికి ఖాజాతో పాటు కామెరాన్ గ్రీన్ (49 బ్యాటింగ్; 8 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.



ఓపెనర్ల శుభారంభం

ఆస్ట్రేలియా ఓపెనర్లు ట్రవిస్ హెడ్ (44 బంతుల్లో 32; 7 ఫోర్లు), ఖాజా బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై యథేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. అనుభవజ్ఞులైన పేసర్లలో షమీ రివర్స్ స్వింగ్‌తో వైవిధ్యం కనబరిస్తే... ఉమేశ్ యాదవ్ నిరాశపరిచాడు. ఇతని బౌలింగ్‌లో హెడ్ వన్డేను తలపించే ఆట ఆడాడు. హెడ్ కొట్టిన 7 ఫోర్లలో అరడజను ఉమేశ్ బౌలింగ్‌లోనే బాదాడు. అయితే అంతకు ముందు ఉమేశ్ బౌలింగ్‌లోనే హెడ్ 7 పరుగుల వద్ద ఉన్నప్పుడు కీపర్ భరత్ సులువైన క్యాచ్ వదిలేయడం కూడా ఆసీస్‌కు కలిసొచ్చింది. తొలి వికెట్‌కు 61 పరుగులు జతయ్యాక హెడ్‌ను అవుట్ చేసిన అశ్విన్ ఓపెనింగ్ జోడీకి ముగింపు పలికాడు. తర్వాత లబుషేన్ (3)ను చక్కని డెలివరీతో షమీ క్లీన్ బౌల్డ్ చేశాడు. కెప్టెన్ స్మిత్ క్రీజులోకి రాగా... 75/2 స్కోరు వద్ద లంచ్‌బ్రేక్‌కు వెళ్లారు. అనంతరం రెండో సెషన్‌నైతే బౌలర్లకు ఏమాత్రం కలిసి రాలేదు. ఖాజా, స్మిత్ ఆతిథ్య బౌలర్లకు ఎలాంటి అవకాశమివ్వకుండా ఆట కొన సాగించారు.

ఖాజా అజేయ శతకం

మూడో వికెట్‌కు ఖాజా-స్మిత్ జోడీ అజేయంగా సాగడంతో వికెట్ పడకుండానే 149/2 స్కోరువద్ద రెండో సెషన్ ముగిసింది. వికెట్లు టపటపా రాలిన ఈ సిరీస్‌లో ఒక్క వికెట్ అయినా పడకుండా సెషన్ ముగియడం ఇదే తొలిసారి! అయితే ఆఖరి సెషన్ మొదలవగానే స్మిత్ (38; 3 ఫోర్లు) వికెట్‌ను జడేజా పడగొట్టడంతో 79 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికి హ్యాండ్స్‌కాంబ్ (17)ను షమీ అవుట్ చేశాడు. తర్వాత వచ్చిన కామెరాన్ గ్రీన్ చూడచక్కని బౌండరీలతో స్కోరు బోర్డును పరుగుపెట్టించాడు. అతని అండతో ఖాజా టెస్టుల్లో 14వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరి 9 ఓవర్లలో ఆసీస్ వేగంగా పరుగులు సాధించడంతో 54 పరుగులు వచ్చాయి. వీరిద్దరు అబేధ్యమైన ఐదో వికెట్‌కు 85 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32; ఉస్మాన్ ఖాజా బ్యాటింగ్ 104; లబుషేన్ (బి) షమీ 3; స్మిత్ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్ (బి) షమీ 17; గ్రీన్ బ్యాటింగ్ 49; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (90 ఓవర్లలో 4 వికెట్లకు) 255. వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-151, 4-170. **బౌలింగ్:** షమీ 17-2-65-2, ఉమేశ్ 15-2-58-0, అశ్విన్ 25-8-57-1, జడేజా 20-2-49-1, అక్షర్ 12-4-14-0, అయ్యర్ 1-0-2-0.



ఖాజా

మైదానంలో ప్రధానమంత్రులు

తొలి రోజు ఆటలో భారత్, ఆస్ట్రేలియా ప్రధానమంత్రులు నరేంద్ర మోదీ, ఆంథోనీ అల్బనీస్ '75 ఇయర్స్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ త్రూ క్రికెట్' అంటూ ప్రధాన ఆకర్షణగా మారారు. టెస్టు ఆరంభానికి ముందు వీరిద్దరు ప్రత్యేక వాహనంలో మైదానమంతా కలియతిరుగుతూ ప్రేక్షకులకు అభివాదం చేశారు. అనంతరం ఇరు ప్రధానులు తమ జట్ల కెప్టెన్లకు ప్రత్యేక 'క్యాప్'లను అందించగా, వేదికపై నలుగురూ చేతులు కలిపి నిలబడిన దృశ్యం హైలైట్‌గా నిలిచింది. తమ జట్ల ఆటగాళ్లతో కలిసి వీరిద్దరు జాతీయ గీతాలాపన చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన 'హాల్ ఆఫ్ ఫేమ్'ను ప్రారంభించిన అనంతరం మాజీ క్రికెటర్లు గావస్కర్, లక్ష్మణ్ తదితరులతో మోదీ సంభాషించారు. ప్రెసిడెంట్స్ బాక్స్ నుంచి ప్రధానులిద్దరూ కొద్ది సేపు టెస్టు మ్యాచ్ తొలి సెషన్‌ను వీక్షించగా...బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులు రోజర్ బిన్నీ, జై షా జ్ఞాపికలు అందజేశారు. మ్యాచ్ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అలరించాయి. అయితే కఠినమైన భద్రతా నిబంధనల కారణంగా తొలి రోజు ఆశించిన స్థాయిలో రికార్డు సంఖ్యలో ప్రేక్షకులు మ్యాచ్‌కు హాజరు కాలేదు.

ముంబై 'హ్యాట్రిక్' విజయం

- 8 వికెట్లతో ఢిల్లీపై జయభేరి
- డబ్ల్యూపీఎల్



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ జోరుకు బ్రేకులేసిన ముంబై ఇండియన్స్ 'హ్యాట్రిక్' విజయం సాధించింది. గురువారం జరిగిన పోరులో సమష్టిగా చెలరేగిన ముంబై 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై అలవోక విజయం సాధించింది. ముంబై క్రికెటర్ హేలీ మాథ్యూస్ (3 వికెట్లు; 31 బంతుల్లో 32; 6 ఫోర్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 18 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (41 బంతుల్లో 43; 5 ఫోర్లు), జెమిమా రోడ్రిగ్స్ (18 బంతుల్లో 25; 3 ఫోర్లు) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ పరుగులు చేయలేదు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సయిక ఇషాక్ (3/13), ఇసి వాంగ్ (3/10)ల ధాటికి హిట్టర్లు షఫాలీ వర్మ (2), క్యాప్సీ (6), మరిజెన్ కప్ (2), జెస్ జొనసెన్ (2) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తర్వాత మిడిలార్డర్‌ను హేలీ దెబ్బతీయడంతో ఢిల్లీ ఇక కోలుకోలేదు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ముంబై 15 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు యస్తిక భాటియా (32 బంతుల్లో 41; 8 ఫోర్లు), హేలీ తొలి వికెట్‌కు 65 పరుగులు జోడించారు. వాళ్లిద్దరు అవుటయ్యాక నట్ సీవర్ బ్రంట్ (19 బంతుల్లో 23 నాటౌట్; 4 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (11 నాటౌట్, 2 ఫోర్లు) మిగతా లాంఛనాన్ని పూర్తిచేశారు.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

బెంగళూరు X యూపీ వారియర్స్

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇంగ్లండ్‌కు బంగ్లా షాక్

చట్టోగ్రామ్: టి20 వరల్డ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించింది. గురువారం జరిగిన తొలి టి20లో బంగ్లా 6 వికెట్లతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులు చేసింది. జోస్ బట్లర్ (42 బంతుల్లో 67; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (35 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. అనంతరం బంగ్లాదేశ్ 18 ఓవర్లలో 4 వికెట్లకు 158 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నజ్ముల్ హొస్సేన్ (30 బంతుల్లో 51; 8 ఫోర్లు), షకీబ్ అల్ హసన్ (24 బంతుల్లో 34 నాటౌట్; 6 ఫోర్లు) గెలిపించారు.

వెస్టిండీస్ 251 ఆలౌట్



హోల్డర్

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 251 పరుగులకు ఆలౌటైంది. జేసన్ హోల్డర్ (117 బంతుల్లో 81 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఇతర బ్యాటర్లలో కైల్ మేయర్స్ (29), రోస్టన్ ఛేజ్ (28), జొషువా డ సిల్వ (26) కొన్ని పరుగులు జోడించగలిగారు. సఫారీ బౌలర్లలో కోయెట్జీ 3 వికెట్లు పడగొట్టగా...రబడ, హార్మర్ చెరో 2 వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికాకు తొలి ఇన్నింగ్స్‌లో 69 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా వికెట్ కోల్పోకుండా 4 పరుగులు చేసింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 311/7తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ మొదటి ఇన్నింగ్స్‌లో 320 పరుగులకు ఆలౌటైంది.

శ్రీలంక 305/6



కుశాల్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో గురువారం మొదలైన తొలి టెస్టులో శ్రీలంక శుభారంభం చేసింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి లంక తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 305 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (83 బంతుల్లో 87; 16 ఫోర్లు) దూకుడుగా ఆడగా, కెప్టెన్ దిముత్ కరుణరత్నే (87 బంతుల్లో 50; 7 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీ నమోదు చేశాడు. ఏంజెలో మాథ్యూస్ (47), ధనంజయ డి సిల్వ (39 బ్యాటింగ్), దినేశ్ చండిమాల్ (39) కీలక ఇన్నింగ్స్‌లతో రాణించారు. మెండిస్, కరుణరత్నే రెండో వికెట్‌కు 137 పరుగులు జోడించడం విశేషం. ఈ మ్యాచ్‌లో టెస్టుల్లో 7 వేల పరుగులు పూర్తి చేసుకున్న మాథ్యూస్...ఈ ఘనత సాధించిన మూడో లంక క్రికెటర్‌గా నిలిచాడు. కివీస్ బౌలర్లలో సౌతీ 3 వికెట్లు పడగొట్టాడు.

'అట్టడుగు'కు చేరేలా
అంతరాలు తగ్గేలా..

కంచర్ల యాదగిరిరెడ్డి

ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే ఆఫీసులో పనులు చక్కబెట్టుకోవచ్చు.. సంగీతం, సినిమాల వంటి వినోదమూ దొరుకుతుంది. మరి ఇంటర్నెట్ కారణంగా కూలీల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, వారి ఆరోగ్యం బాగుపడుతుందని ఎంత మందికి తెలుసు? అట్టడుగు వర్గాల వారికి చదువు అవకాశాలతోపాటు వారి జీవితాలు బాగుపడతాయనీ ఎందరికి తెలుసు? కొన్ని సంస్థలు, ప్రభుత్వాల కృషితో ఇంటర్నెట్ విషయంలో ధనికులు– పేదలు, విద్యావంతులు– అత్తెసరు చదువరుల మధ్య ఇప్పుడు అంతరం తగ్గుతోంది! 2025 నాటికి ఇది మరింత తగ్గనుంది! ఇందుకు బాటలు వేస్తున్న 'ఎడిసన్ అలయన్స్'గురించి ఈ ప్రత్యేక కథనం..

ప్రపంచ జనాభా సుమారు 800 కోట్లు! వీరిలో 270 కోట్ల మందికి ఇంటర్నెట్ అందుబాటులో లేదు. దీనికి కారణాలెన్నో. ఈ పరిస్థితిని మార్చేందుకు 2021లో ఓ పెద్ద ప్రయత్నమే మొదలైంది. అదే 'ఎడిసన్ అలయన్స్ (ఎసెన్షియల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సర్వీసెస్ నెట్‌వర్క్ అలయన్స్'. 2025 నాటికి అదనంగా కనీసం వంద కోట్ల మందిని ఇంటర్నెట్ సూపర్ హైవేలోకి చేర్చాలన్నదే దీని లక్ష్యం. ఏదో వినోదం పంచేందుకు ఈ ప్రయత్నం జరగడం లేదు. ఆరోగ్యం, విద్య, ఆర్థిక సేవలు సమాజంలోని అట్టడుగు వర్గాల వారికీ చేరాలన్న ఉదాత్త లక్ష్యాన్ని ఈ అలయన్స్ తన భుజాలపైన వేసుకుంది. ఆరోగ్యం, విద్య, బ్యాంకింగ్, రుణాల వంటి ఆర్థిక సేవలు అందుబాటులోకి వస్తే వారి జీవితాలు మారిపోతాయని భావించింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలోని ఆసక్తికరమైన అంశం.. ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలూ భాగస్వాములు కావడం. పేద దేశాలు, లేదా డిజిటల్ సేవలు అందుబాటులో లేనివారికి వాటిని సులువుగా అందించడం, వాడుకునేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడం వంటివి ఈ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్నాయి. సూటిగా చెప్పాలంటే ఇంటర్నెట్ సౌకర్యం చౌకగా అందించేందుకు, డిజిటల్ నైపుణ్యాలను నేర్పించేందుకు, విద్య, వైద్యం అందించేందుకు జరుగుతున్న కృషి ఇది. రెండేళ్ల క్రితం మొదలైన ఎడిసన్ అలయన్స్ ఇప్పటివరకూ సాధించిందేమిటన్న దానిపై వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ఇటీవలే ఒక నివేదికను విడుదల చేసింది. రానున్న రెండేళ్లలో సాధించాలనుకుంటున్న లక్ష్యాలను సమీక్షించింది.



పలు సంస్థలు, ప్రభుత్వాల కృషితో అందరికీ ఇంటర్నెట్

ఆరోగ్యం, విద్య, ఆర్థిక సేవలు అట్టడుగు వర్గాలకూ అందేందుకు తోడ్పాటు

ఈ దిశగా కృషి చేస్తున్న 'ఎడిసన్ అలయన్స్'

లక్ష్యంలో ఇప్పటికే సగం..

2021 జనవరిలో ప్రారంభమైన ఎడిసన్ అలయన్స్ తన భాగస్వాముల సాయంతో ఇప్పటివరకు సుమారు 45.4 కోట్ల మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపిందని వరల్ఎకనమిక్ ఫోరమ్ విడుదల చేసిన తాజా నివేదిక తెలిపింది. మొత్తం 90 దేశాల్లో 250కిపైగా కార్యక్రమాలు మొదలయ్యాయి. 2021లో మొత్తం 140 కోట్ల మందికి బ్యాంక్ అకౌంట్ కానీ, రుణ వసతి గానీ లేకపోయింది. ఎడిసన్ అలయన్స్ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటివరకూ కనీసం 28 కోట్ల మందికి ఈ–బ్యాంకింగ్, మొబైల్ వ్యాలెట్స్, ఎలక్ట్రానిక్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. అలాగే సుమారు తొమ్మిది కోట్ల మంది ఆరోగ్యాన్ని డిజిటల్ ఆరోగ్య సేవల రూపంలో పరిరక్షించడం సాధ్యమైంది. టెలిహెల్త్, టెలిమెడిసిన్ వంటి టెక్నాలజీల సాయంతో వేర్వేరు ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తున్నారు. విద్య విషయానికొస్తే 2021లో ప్రపంచవ్యాప్తంగా 24.4 కోట్ల మంది (ఆరు నుంచి 18 ఏళ్ల మధ్య వయస్కులు) పాఠశాలలకు దూరం కాగా.. ఎడిసన్ అలయన్స్ భాగస్వాములు ఆన్‌లైన్ విద్య, రిమోట్ లెర్నింగ్ సొల్యూషన్స్ సాయంతో కోటీ 18 లక్షల మందికి విద్యను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఉద్యోగం చేసేందుకు అవసరమైన నైపుణ్యాలపైనా శిక్షణ ఇవ్వడం గమనార్హం.

ఎడిసన్ అలయన్స్‌తో గరిష్ట లబ్ధి పొందిన దేశాలివీ	
1	భారత్
2	బంగ్లాదేశ్
3	పాకిస్తాన్
4	ఇథియోపియా
5	ఇండోనేసియా
6	అమెరికా
7	జాంబియా
8	మయన్మార్
9	కొలంబియా
10	ఉగాండా

(డబ్ల్యూఈఎఫ్ నివేదిక ప్రకారం)



ఎంతమందికి.. ఏయే రకంగా?

ఎడిసన్ అలయన్స్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందికి డిజిటల్ టెక్నాలజీ లాభాలు అందాయనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. డిజిటల్ రంగం మౌలిక సదుపాయాల కల్పనకు పెట్టిన ఖర్చుతోనే 6.4 కోట్ల మందికి లబ్ధి చేకూరిందని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నివేదిక చెబుతోంది. అయితే 250 మంది భాగస్వాముల్లో మూడొంతుల మంది ఆన్‌లైన్ విద్యపై దృష్టిపెట్టినా దీనివల్ల బాగుపడిన వారి సంఖ్య కొంచెం తక్కువగానే ఉంది. నాణ్యమైన ఆన్‌లైన్ విద్యకు అవసరమైన వనరులు లేకపోవడం దీనికి కారణంగా చెప్తున్నారు. మొబైల్ బ్రాడ్‌బ్యాండ్, ఇంటర్నెట్ ఆధారిత పరికరాలు, ఆన్‌లైన్ సర్వీసుల ఖర్చులు తగ్గడం 12.8 కోట్ల మందికి ఉపయోగపడింది. దాదాపు 27 కోట్ల మందికి కనెక్టివిటీ లేదా డిజిటల్ సేవలు లభించడం మొదలైంది.

ముందున్న సవాళ్లు..

ఇంకో మూడేళ్లలో 55 కోట్ల మందికి డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఎడిసన్ అలయన్స్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగస్వాములు కావాల్సిందిగా మరిన్ని కంపెనీలను ఆహ్వానిస్తోంది. ప్రస్తుత భాగస్వాముల్లో కేవలం 12 శాతం మంది మాత్రమే 50 శాతం మేర లక్ష్యాన్ని అందుకోవడంపై అలయన్స్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. సగం మంది భాగస్వాములు లక్ష్యంలో 20 శాతాన్ని మాత్రమే చేరుకోవడంపై అసంతృప్తిగా ఉంది. వచ్చే రెండేళ్లలో పాత, కొత్త భాగస్వాములు వేగంగా లక్ష్యాల సాధనకు పూనుకోవాలని కోరింది.

పర్వత ప్రాంతాలకు అపోలో ఆరోగ్య సేవలు

ప్రఖ్యాత వైద్యసేవల సంస్థ అపోలో హాస్పిటల్స్, అపోలో టెలిహెల్త్ సర్వీసులను ఎడిసన్ అలయన్స్‌లో భాగంగా హిమాచల్ ప్రదేశ్ వంటి పర్వత ప్రాంతాల్లో అందిస్తోంది. ఆ రాష్ట్రంలో వైద్యసేవలు, నిపుణుల కొరత ఎక్కువగా ఉండటంతో.. ఆ సమస్యను అధిగమించేందుకు డిజిటల్ టెక్నాలజీల సాయం తీసుకుంటున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నాలుగు కీలక ప్రాంతాల్లో టెలిమెడిసిన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 2021 జూలై నాటికి 22,727 టెలికన్సల్టేషన్లు అందించారు. 1,300కుపైగా ఎమర్జెన్సీ కేసులను డిజిటల్ పద్ధతిలోనే ఎదుర్కొని పరిస్థితిని చక్కదిద్దారు. టెలి డిస్పెన్సరీల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండటం ఒక విశేషమైతే.. రక్తహీనత, అసాంక్రమిక వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 4,000 మందితో విస్తృత ప్రయత్నం జరుగుతుండటం ఇంకో విశేషం.

''ఎడిసన్ అలయన్స్‌లో భాగస్వామి అయిన మేం మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఐదు డిజిటల్ డిస్పెన్సరీలు ప్రారంభించాం. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. వ్యాధుల నివారణ, నిర్దిష్ట సమస్యలపై టెలికన్సల్టేషన్ సర్వీసులు కూడా అందిస్తున్నాం'' అని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శోభన కామినేని చెప్పారు.



అగ్రరాజ్యంలో వెరిజాన్ సేవలు

అమెరికా టెక్ దిగ్గజ సంస్థ వెరిజాన్ ఆ దేశంలో ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని విద్యార్థులకు ఎడిసన్ అలయన్స్‌లో భాగంగా కనెక్షన్లు అందించే ప్రయత్నం చేస్తోంది. అమెరికాలో లక్షల మంది విద్యార్థులకు ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుబాటులో లేదని.. ఈ కాలపు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు తగ్గట్టుగా నైపుణ్యాలు లేక విద్యార్థులు నష్టపోతున్నారని వెరిజాన్ గుర్తించింది. దీనిని అధిగమించేందుకు వెరిజాన్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ సాయంతో స్కూల్ డిస్ట్రిక్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ఉపాధ్యాయులు, విద్యార్థులకు కూడా టెక్నాలజీ వినియోగంలో శిక్షణ ఇస్తోంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ (స్టెమ్) రంగాలకు సంబంధించిన శిక్షణ కూడా ఇచ్చే ప్రయత్నాలు చేస్తోంది. 2021–22లో ఆ దేశవ్యాప్తంగా సుమారు 500 పాఠశాల్లో 6.5 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారని అంచనా. ఈ కార్యక్రమం కోసం వెరిజాన్ వందకోట్ల డాలర్లకుపైగా ఖర్చు పెడుతోంది.



పురుషులను బరిగెలతో కొడుతున్న మహిళలు

భర్తల భరతం పట్టిన భార్యామణులు!

బంజారా సంప్రదాయంలో డూండ్ వేడుక

కారేపల్లి: భార్యామణులు భర్తల భరతంపట్టారు. ఇంకొందరు పచ్చిబరిగెలతో వరసైన వారి వీపులను విమానం మోత మోగించారు. చేసేదేం లేక పురుషపుంగవులు పరుగు లంకించుకున్నారు. హోలీ సందర్భంగా గిరిజన తండాల్లో ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. గత ఏడాది హోలీ నుంచి ఈ ఏడాది హోలీ మధ్యకాలంలో భూక్యా, లాకావత్, తేజావత్, వడిత్యా వంశస్తుల కుటుంబాల్లో ఎవరికైతే తొలి సంతానంగా మగబిడ్డ జన్మిస్తాడో ఆ ఇంట్లో డూండ్ వేడుక వైభవంగా నిర్వహిస్తారు. కారేపల్లి మండలం సామ్యతండాలో భూక్యా నగేష్, సుజాత దంపతులకు తొలి సంతానం మగబిడ్డ దర్శక్ జన్మించడంతో ఈ వేడుక నిర్వహించారు. డూండ్ అంటే గిరిజన భాషలో వెతకడం అని అర్థం కాగా, బాలుడిని ఒక ఇంట్లో దాచిపెట్టి గ్రామస్తులంతా వెతకడమే ఈ వేడుక! ఇదంతా హోలీ రోజు ముగియగా.. గురువారం గ్రామంలో ఓ గుంజ పాతి, తినుబండారాలు ఉన్న రెండు గంగాళాలను తాళ్లతో కట్టారు. గంగాళాలకు మహిళలు పచ్చి బరిగెలతో కాపలాగా ఉండగా, పురుషులు వాటిని ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. మహిళలు, పురుషులు సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పాత్రలు ఎత్తుకెళ్లేందుకు వచ్చే పురుషులను మహిళలు సరదాగా కొడుతుండటం చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతుంది. ఈ వేడుకలో బావ, బావమరిది వంటి వరసైనవారు మహిళల దెబ్బల రుచి చూడాల్సిందే. చివరకు పురుషులు గంగాళాలను ఎత్తుకెళ్లి ఆరగించడంతో వేడుక ముగిసింది.

ఆయనకిద్దరితో పెళ్లి
ఆరు ముళ్లు.. పద్నాలుగు అడుగులు!

- ముగ్గురూ కలిసి ఉండేందుకు అంగీకరించడంతో వివాహం చేసిన పెద్దలు
- పెళ్లి రోజుకే ఒకరికి పాప.. మరొకరికి బాబు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ''మూడే ముళ్లు... ఏడే అడుగులు.. మొత్తం కలిపి నూరేళ్లు...'' ఓ సినీ గేయ రచయిత అన్న మాటలను ఈయన సరిగ్గా డబుల్ చేశాడు. ఒకే రోజు ఇద్దరికీ.. ఒక్కొక్కరికి మూడు ముళ్లు.. వెరసి ఆరు ముళ్లు వేసి పద్నాలుగు అడుగులు నడిచాడు. ఇక కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు.. చందంగా పెళ్లి సమయానికే ఇద్దరు వధువులూ ఒకరు మగ బిడ్డతో.. ఒకరు ఆడ బిడ్డతో పెళ్లి పీటలపై కూర్చొని సదరు పెళ్లి కొడుకుతో తాళి కట్టించుకున్నారు. ఈ చిత్రమైన పెళ్లి'ళ్ల' భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఎర్రబోరు గ్రామంలో జరిగాయి. పూర్వాపరాలిలా.. గ్రామానికి చెందిన సత్తిబాబు దోశిళ్లపల్లికి చెందిన స్వప్నకుమారితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరూ శారీరకంగా ఒకటి కావడంతో స్వప్నకుమారి గర్భం దాల్చింది. విషయం ఆమె ఇంట్లో తెలియడంతో పెళ్లి చేసుకునేందుకు సత్తిబాబు ఓకే అన్నాడు. కానీ స్వప్నకి తెలియకుండా సత్తిబాబు కుర్నపల్లికి చెందిన సునీతతోనూ మరో ప్రేమ కథ నడిపాడు. ఈమెనూ గర్భవతిని చేశాడు. ఇరువురు యువతుల తల్లిదండ్రులతో పాటు కుల పెద్దలూ రంగంలోకి దిగారు. తాను ఇద్దరినీ ప్రేమించానని, ఇరువురినీ పెళ్లి చేసుకుంటానని సత్తిబాబు చెప్పగా, యువతులూ అంగీకరించడంతో పరస్పర అంగీకారంతో ఒకే చోట కాపురం పెట్టాడు. గతేడాది జూలైలో స్వప్నకుమారి పాపకు జన్మనివ్వగా, సెప్టెంబర్‌లో సునీతకు బాబు పుట్టాడు. కాగా తన పెళ్లి ఘనంగా జరగలేదని భావించిన సత్తిబాబు..ఈనెల 9న గురువారం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఒక వరుడు, ఇద్దరు వధువుల పేర్లతో పెళ్లి పత్రిక అచ్చు వేయించి బంధుమిత్రులందరికీ పంచాడు. సోషల్ మీడియాలో ఈ పెళ్లికార్డు వైరల్‌గా మారింది. సత్తిబాబు పెళ్లి ముచ్చట ఆరు ముళ్లు, పద్నాలుగు అడుగులతో ముగిసింది.



పీఈసెట్ షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: రెండేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ), డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష టీఎస్‌పీఈసెట్–2023 షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి గురువారం విడుదల చేసింది. పరీక్షను ఈ ఏడాది శాతవాహన వర్సిటీ నిర్వహిస్తోంది. కార్యక్రమంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మన్ వి.వెంకటరమణ పాల్గొన్నారు. ఈ నెల 13న సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 15 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్షలు జూన్ 1 నుంచి 10 వరకు జరుగుతాయి.

ట్రిపుల్ ఐటీ, టీఎస్ కాస్ట్‌ల ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్/నిర్మల్/భైంసా: విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని మరింతగా అందించేందుకు వీలుగా తెలంగాణా స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్ కాస్ట్), బాసర ట్రిపుల్ ఐటీ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ ఎంవోయూపై బాసర ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ పి. సతీష్‌కుమార్, టీఎస్–కాస్ట్ మెంబర్ సెక్రటరీ ఎం.నగేష్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ మాట్లాడుతూ, ఈ ఎంవోయు వల్ల బాసర విద్యార్థులు బోధన, పరిశోధనల్లో నూతన అవిష్కరణలతో మరింత ముందుకెళ్తారన్నారు.

డిగ్రీలో సమూల మార్పులు

- విద్యార్థి ఇష్టం వచ్చిన సబ్జెక్ట్‌ల ఎంపికకు అవకాశం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు.. జూలై నుంచే క్లాసులు
- కాలేజీలకు ముందే అనుబంధ గుర్తింపు.. ఉన్నత విద్యామండలి సమావేశంలో నిర్ణయాలు



సాక్షి, హైదరాబాద్: జాతీయ విద్యావిధానం–2020కి అనుగుణంగా డిగ్రీలో సరికొత్త మార్పులకు ఉన్నత విద్యామండలి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కసరత్తు మొదలు పెట్టింది. విద్యార్థులు కోరుకున్న సబ్జెక్టులతో డిగ్రీ పూర్తి చేసేందుకు అవకాశం కల్పించేలా వచ్చే విద్యాసంవత్సరం నుంచి 'బకెట్' విధానాన్ని తీసుకొస్తున్నామని ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి నేతృత్వంలో గురువారం మండలి కార్యాలయంలో కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్‌సహా ఉస్మానియా, కాకతీయ, మహాత్మాగాంధీ, శాతవాహన, పాలమూరు, తెలంగాణ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సమావేశం నిర్వహించింది. సమావేశ వివరాలను లింబాద్రి మీడియాకు వివరించారు.

నచ్చిన కోర్సు...

- ఇప్పటి వరకూ డిగ్రీ కోర్సులు మూస విధానంలో ఉండేవి. బీఏ హెచ్‌పీపీ తీసుకుంటే హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్లు మాత్రమే చదవాలి. అయితే కొత్త విధానంలో ఏ, బీ, సీ, డీ బకెట్లుగా సబ్జెక్టులను విడగొడతారు. వీటిల్లో వేటినైనా ఎంచుకోవచ్చు. ఉదాహరణకు... ఎ గ్రూపులో అరబిక్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ పాలసీ, లిటరేచర్ ఇలా కొన్ని సబ్జెక్టులుంటాయి. బి గ్రూప్‌లో ఎకనామిక్స్, హిందీ, ఇంగ్లిష్, తెలుగు, సాహిత్యం, ట్రావెల్ టూరిజం వంటి కొన్ని కోర్సులుంటాయి. ఇలా సి, డీ గ్రూపుల్లోనూ కొన్ని కోర్సులుంటాయి. విద్యార్థులు ఏవేని మూడు బకెట్స్ నుంచి ఒక్కో సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు.
- డిగ్రీలో క్రెడిట్ సిస్టమ్ అమలు చేయడం వల్ల ప్రతీ దాన్ని క్రెడిట్ విధానంలో కొలుస్తారు. బకెట్ విధానం వల్ల బీఏ విద్యార్థి కూడా కంప్యూటర్ సైన్స్ కోర్సు, సాహిత్యం, మరే ఇతర కోర్సు అయినా చేయవచ్చు.
- ఈ విధానం క్షేత్రస్థాయిలో అన్ని కాలేజీల్లో ఎలా అమలు చేయాలనే దానిపై మండలి ఓ కమిటీని నియమించి, దాని సూచనల మేరకు మార్పులు చేస్తుంది. విభిన్న సబ్జెక్టులతో డిగ్రీ చేసిన విద్యార్థికి మార్కెట్ అవసరాలకు తగిన నైపుణ్యం వచ్చే వీలుంది.

మరికొన్ని మార్పులు

- విద్యార్థి కాలేజీలోనే కాకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా దేశ, విదేశాల్లో ఎక్కడైనా ఒక కోర్సు చేసే వీలుంది. దానికి సంబంధిత సంస్థలే పరీక్షలు నిర్వహిస్తాయి. క్రెడిట్స్‌ను ఆయా సంస్థలకు బదలాయిస్తాయి.
- డిగ్రీ స్థాయిలో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తోపాటు మరికొన్ని కంప్యూటర్ అనుబంధ కోర్సులను సబ్జెక్టులుగా తీసుకురానున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ కోర్సుల బోధనకు అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.
- రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియ కాలేజీ మొదలయ్యే నాటికే పూర్తి చేయాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది జూలై నుంచే డిగ్రీ క్లాసులు మొదలవ్వాలని తీర్మానించారు.
- కోవిడ్ మూలంగా చాలామంది విద్యార్థుల్లో అభ్యసన నష్టాలు కన్పిస్తున్నాయి. వీటిని పూడ్చడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. దీనికి పక్కా ప్రణాళికను త్వరలో ఖరారు చేయబోతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.